


teenmaardesk@gmail.com

# తీన్మార్

నేటి వాస్తవాలు...

తెలుగు దిన పత్రిక

ములుగు | సంపుటి : 02 | సంచిక : 320 | ఛీఫ్ ఎడిటర్ : రెడ్డి శేఖర్ | మంగళవారం | 5 మార్చి 2024 | పేజీలు : 08 | వెల ‘ 5

Published from Mulugu Circulated by Warangal, Khammam, Hyderabad, Nalgonda, Mahabubnagar, Rangareddy,Medak, Karimnagar,Nizamabad, Adilabad.

## బీఆర్ఎస్ కుంభకోణాలకు పాల్పడితే కాంగ్రెస్ ఫైళ్లను దాచిపెడుతోంది

తీవ్ర ఆరోపణలు చేసిన ప్రధాని నరేంద్ర మోదీ



తెలంగాణ బ్యూరో, మార్చి 04 (తీన్మార్ న్యూస్): తెలంగాణలో గతంలో అధికారంలో ఉన్న భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో కుంభకోణానికి పాల్పడితే, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఫైళ్లను

మిగతా 2 లో

# అభ్యర్థులకోసం వెతుకులాట..!

పోటీకి ముందుకు రానీ గులాబీ నేతలు

మారుతున్న రాజకీయ సమీకరణాలు

కాంగ్రెస్, బీజేపీల్లో టికెట్లకోసం తీవ్ర పోటీ

త్వరలో లోక్‌సభ ఎన్నికలు జరగనున్న వేళ.. తెలంగాణలో రాజకీయ సమీకరణాలు వేగంగా మారిపోతున్నాయి. టికెట్ హామీ ఇస్తే చాలు.. అటు కాంగ్రెస్, బీజేపీలోకి బీఆర్ఎస్ నుంచి పెద్దపెద్ద నేతలు రాత్రికి రాత్రే జంప్ చేస్తున్నారు.

తెలంగాణ బ్యూరో, మార్చి 04 (తీన్మార్ న్యూస్): గత పదేళ్లుగా అధికారంలో ఉన్న బీఆర్ఎస్ పార్టీలో అన్ని పదవులు అనుభవించిన సీనియర్ నేతల్లో చాలామంది ఇప్పటికే కాంగ్రెస్‌లో చేరిపోగా, కాంగ్రెస్‌లో టికెట్ రాదనుకున్న మరికొందరు బీజేపీ తీర్థం పుచ్చుకుంటున్నారు. మరోవైపు కాంగ్రెస్ ఇప్పటికే ప్రజాదీవెన సభను ప్రకటించటంతో బాటు చేరికలతో బిజీబిజీగా ఉంది. 17 స్థానాల్లో 10 స్థానాల మీద ఇప్పటికే కసరత్తు పూర్తి చేసి అభ్యర్థుల పేర్లను పార్టీ హైకమండ్‌కు

మిగతా 2 లో








## సాగు నీటికోసం రోడ్డెక్కిన రైతన్నలు

రామునిపట్ల రాజీవ్ రహదారిపై రైతుల ధర్నా

పొలాలకు సాగు నీరు ఇవ్వాలని డిమాండ్

పంటల కోసం పెట్టిన పెట్టుబడులు భారంగా మారాయని ఆవేదన వ్యక్తం

సిద్దిపేట, మార్చి 04 (తీన్మార్ న్యూస్): కాంగ్రెస్ ప్రభుత్వంపై సిద్దిపేట రైతులు కన్నెర్రజేస్తున్నారు. కండ్ల ముందే పంటలు ఎండిపోతున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడంపై కడుపుమండిన రైతన్నలు సాగు నీటికోసం రోడ్డెక్కారు. ఎండిపోతున్న పంటలకు

మిగతా 2 లో

## బీఆర్ఎస్ పార్లమెంట్ అభ్యర్థుల తొలి జాబితా

నాలుగు పార్లమెంట్ నియోజకవర్గాలకు అభ్యర్థుల ఖరారు

బరిలో నిలువబోతున్న అభ్యర్థులకు శుభాకాంక్షలు తెలిపిన కేసీఆర్



.. వివరాలు 2లో



ఇంగ్లీష్ రాదనే ట్రోల్స్ పై స్పందించిన

## సీఎం రేవంత్ రెడ్డి

నేను ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకున్నాను, కాన్వెంట్‌కి వెళ్లి ఉంటే అద్భుతంగా మాట్లాడే వాడిని

గురువులు సరైన విద్యాబుద్ధులు నేర్పినందునే సీఎం అయ్యాను

అవహేళన చేస్తున్న వారు ఇప్పుడు ఎలా ఉన్నారో గమనించాలని సూచించిన సీఎం

తెలంగాణ బ్యూరో, మార్చి 04 (తీన్మార్ న్యూస్): పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ ల మధ్య సోషల్ మీడియాలో వార్ నడుస్తోంది. సోషల్ మీడియాలో ఇరు పార్టీల కార్యకర్తలు పోస్టుల యుద్ధం

మిగతా 2 లో

## రాష్ట్రంలో ముఖ్యమంత్రి సుడిగాలి పర్యటనలకు షెడ్యూల్ ఖరారు

మార్చి 05 నుండి 12 వరకు పర్యటనలతో బిజీ బిజీ

.. వివరాలు 2లో

## గట్టమ్మ దేవాలయంలో అయోమయంలో యంత్రాంగం

ముదిరాజ్ లే పూజారులనే కోర్టు ఆర్డర్‌పై..

ముదిరాజ్ మహిళలపై దాడి చేసి గాయపరిచిన నాయకపోడులు

మహిళలపై దాడికి బాధ్యులు ఎవరో ప్రభుత్వ యంత్రాంగం చెప్పాలని డిమాండ్

జాకారం ముదిరాజ్ లకు అండగా ఉంటాం

విజ్ఞాపాలు మెపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పులి దేవేందర్ ముదిరాజ్





ములుగు, మార్చి 04 (తీన్మార్ న్యూస్): ములుగు జిల్లా జాకారంలో వెలసిన గట్టమ్మ దేవాలయంలో పూజారులుగా ముదిరాజ్ లే ఉండలానే కోర్టు ఉత్తరువులనే అయోమయంలో ములుగు జిల్లా యంత్రాంగం అందరూ ముదిరాజ్ లను తప్పుబడుతూ మాట్లాడడం ఎంత వరకు న్యాయం అని MEPA మెపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పులి దేవేందర్ ముదిరాజ్ మీడియాతో అన్నారు. అనంతరం దేవేందర్ ముదిరాజ్ మాట్లాడుతూ గత 8 దశాబ్దాల క్రితం ముదిరాజ్ లచే కొలువైన గట్టమ్మ దేవాలయంలో ముదిరాజ్ లే పూజారులు అని ఆధారాలు ఉన్నాయని, వాటిని సమర్థిస్తూ కోర్టు కూడా ఉత్తరువులు ఇచ్చిందని, తుది తీర్పు వచ్చే వరకు ముదిరాజ్ లే పూజలు నిర్వహిస్తూ ఉండలాని స్థానిక కలెక్టర్, RDO లను ఈ నెల 7వ తేదీ వరకు వివరణ ఇవ్వాలని గడువు ఇచ్చిందనీ అన్నారు. ఈ క్రమంలో సోమవారం పూజలు నిర్వహించేందుకు వెళ్లిన ముదిరాజ్ మహిళలపై నాయపోడు వారు దాడి చేసి గాయపరిచిన నేపథ్యంలో ముదిరాజ్ వ్యక్తులకు, మహిళలకు గాయాలు అయ్యాయని, దీనికి

మిగతా 2 లో



2 లో..

## ఇందిరమ్మ ఇండ్ల పథకంపై మంత్రి పొంగులేటి కీలక ప్రకటన

భద్రాద్రి రాములవారి సన్నిధిలో ప్రారంభించునున్న సీఎం రేవంత్‌రెడ్డి



2 లో..

## ఈ నెల 6న రాష్ట్ర వ్యాప్తంగా బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ధర్నాలు

ఎల్ఆర్ఎస్ ను ఉచితంగా చేయాలని డిమాండ్ చేసిన కేటీఆర్

# అభ్యర్థులకోసం వెతుకులాట..!

## మొదటి పేజీ తరువాయి

పంపినట్లు సమాచారం. అలాగే.. అటు బీజేపీ సైతం 9 మంది అభ్యర్థులను ప్రకటించి బరిలో తాను ఉన్నట్లు సందేశాలు పంపుతోంది. కానీ.. గులాబీ పార్టీ మాత్రం ఇంకా అభ్యర్థులతో మాట్లాడే పనిలోనే ఉంది.

**కలవరపెడుతున్న పరిణామాలు..**

ఈ పరిణామాలన్నీ బీఆర్ఎస్ పార్టీని కలవర పెడుతున్నాయి. నిన్నటి దాకా తన దర్శనం కోసం పడిగాపులు కాసిన నేతలంతా ఇప్పుడు వేరే పార్టీలో చేరిపోవటం, గెలిచిన ఎమ్మెల్యేలు, ఎంపీలు కూడా దిక్కులు చూడటంతో కేసీఆర్ దిక్కుతోచని పరిస్థితిలో పడిపోయారు. మరీ ముఖ్యంగా గత ఎన్నికల్లో హైదరబాద్ పరిధిలోని దాదాపు అన్ని సీట్లు గెలుచుకుని ఆధిక్యాన్ని ప్రదర్శించిన ఆ పార్టీకి నేడు లోక్‌సభ అభ్యర్థులు కరువవయ్యారు. అధికారంలో ఉండగా అన్నీ తానై వ్యవహరించిన కుమారుడు కేటీఆర్.. విపక్షంలోకి వచ్చిన రెండు నెలల్లోనే పార్టీని కాపాడుకోలేకపోవటం, హరీష్ రావు సైతం కేవలం తన జిల్లా రాజకీయాలకే పరిమితం కావటంతో కేసీఆర్ మళ్లీ రంగ ప్రవేశం చేయాల్సి వచ్చింది.హామీలను అమలుతో జనంలో సీఎం రేవంత్ రెడ్డికి రేటింగ్ పెరగటం, గత పాలనలోని లొసుగులపై అసెంబ్లీ వేదికగా సీఎం విజృంభించటంతో ఎన్నికల వేళ గులాబీ బాస్ కలవర పడుతున్నారు.

**ఎంపీగా పోటీచేయాలంటే..**

ఇక.. లోక్‌సభ సీట్ల విషయానికొస్తే.. ఎంపీగా పోటీచేయాలంటే వంద కోట్లైనా ఖర్చు పెట్టక తప్పని పరిస్థితి ఉంది. దీంతో దీనికోసం పోటీపడే వ్యాపారవేత్తలు, సంపన్నులు తమ ప్రయోజనాలు నెరవేరాలని కోరుకోవటం సహజమే. అయితే.. పార్టీ ఓటమితో పాత నేతలెవరూ ఇప్పుడు ఎంపీ సీటు మాకొద్దంటే మాకొద్దని దూరంగా ఉ ంటున్నారు. గతంలో కేసీఆర్‌తో రాసుకుపూసుకు తిరిగి, పోటీకి ఉవ్విళ్లూరిన కొందరు సంపన్నులు సైతం మొహం చాటేయటం ఆ పార్టీని కలవరపరుస్తోంది.

**ఆదిలాబాద్ కేడర్ జంప్..**

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని 10 సీట్లలో కాంగ్రెస్ 4, బీజేపీ 4 గెలుచుకోగా, బీఆర్ఎస్ బలం 2 సీట్లకు పడిపోయింది. పైగా ఈ రెండు నెలల్లో అక్కడి అనేక గ్రామ, మండల, స్థానిక సంస్థల సభ్యులు కాంగ్రెస్‌లో చేరిపోవటంతో అక్కడ అభ్యర్థిగా నిలిచేందుకు ఎవరూ ముందుకు రావటం లేదు. పెద్దపల్లి సీటులో కొప్పుల ఈశ్వర్‌ను ఆదివారం రోజు ప్రకటించినా.. ఆయన బలిపశువు కాబోతున్నారనే వార్తలు వినిపిస్తున్నాయి. ఈ స్థానంలో వివేక్ వెంకటస్వామి కుమారుడు వంశీ, సిట్టింగ్ ఎంపీ వెంకటేశ్ నేతల్లో ఒకరు ఇక్కడ బరిలో నిలవటంతో వారి ముందు ఈశ్వర్ నిలవలేరనే వాదన వినిపిస్తోంది. నిజామాబాద్ సీటులో గతంలో పోటీ చేసిన కుమార్తె కవిత సైతం పోటీకి సిద్ధపడకపోవటం, అక్కడ పార్టీ ప్రాభవం బొత్తిగా తగ్గిపోవటంతో మరెవరూ ఆ సీటు అడిగిన పాపాన పోలేదు. బండి సంజయ్ సిట్టింగ్‌గా ఉన్న కరీంనగర్ సీటు పరిధిలోని 7 అసెంబ్లీ సీట్లలో 4 కాంగ్రెస్, 3 బీఆర్ఎస్ గెలిచాయి. బిఆర్ఎస్ సీట్లలో కేటీఆర్ గెలిచిన సిరిసిల్ల కూడా ఉంది. కానీ.. అక్కడ పార్టీ తరపున ఎవరూ ఆసక్తి చూపకపోవటంతో బి. వినోద్ కుమార్‌ను దింపక తప్పలేదు. మెదక్ ఎంపీ సీటు పరిధిలోని 7 స్థానాల్లో కేవలం మెదక్ సీటు తప్ప అన్నీ బీఆర్ఎస్ గెలుచుకుంది. కానీ.. ఆ సీటును కేసీఆర్ కుమార్తె కోరుకోవటంతో లోకల్‌గా ఉన్న అభ్యర్థులంతా వ్యతిరేకిస్తున్నారు. హరీష్ రావు సైతం దీనికి నో చెప్పినట్లు తెలుస్తోంది. మరోవైపు ఇక్కడ నీలం మధును కాంగ్రెస్ బరిలో దించేందుకు రంగం సిద్ధం చేస్తోంది. జహీరాబాద్ ఎంపీ పరిధిలోని సెగ్మెంట్లలో 4 కాంగ్రెస్ చేతిలో, ఒకటి బీజేపీకి దక్కగా బీఆర్ఎస్ బాన్స్‌వాడ, జహీరాబాద్ సీట్లకే పరిమితమైంది. దీంతో అక్కడా సీటు తీసుకునేందుకు ఎవరూ సాహసించటం లేదు. ఇక.. నల్గొండ, భువనగిరి, ఖమ్మం సీట్ల కోసం ఒక్క దరఖాస్తు కూడా వచ్చే పరిస్థితి లేదు. ఉమ్మడి ఖమ్మం, నల్గొండ జిల్లాల్లో గత ఎన్నికల్లో బీఆర్ఎస్ పూర్తిగా తుడిచిపెట్టుకుపోయింది. ఖమ్మం జిల్లాలో గెలిచిన ఒక్క ఎమ్మెల్యే కాంతారావు కాంగ్రెస్ బాట పట్టటంతో అక్కడ నామా నాగేశ్వరరావును పోటీ చేయమని బతిమాలుకుంటున్నట్లు సమాచారం. నల్లగొండ, భువనగిరి సీట్లలో కాంగ్రెస్ గెలుపు ఖాయంగా కనిపిస్తోండటంతో బీ ఫామ్ కోసం ఎవరూ ముందుకు రావటం లేదు. అటు మెండుగా బలమున్న మహబూబ్ నగర్ సీటు, వరంగల్లు, మహబూబాబాద్‌లోనూ అదే పరిస్థితి. వరంగల్లు సీటు కోసం బీఆర్ఎస్‌కు గుడ్ బై చెప్పి కాంగ్రెస్‌లో చేరిన మాజీ మంత్రి రాజయ్య ప్రయత్నిస్తుండగా, మహబూబాబాద్ సీటు ఎవరు నిలిచినా కాంగ్రెస్ ఖాతాలోకేననే విశ్లేషణ వినిపిస్తోంది.

సిటీలోని సికింద్రాబాద్ సీటు నుంచి తలసాని సాయిని బరిలో దించాలని పార్టీ భావిస్తుండగా, ఇప్పటికే ఒకసారి అక్కడ ఓడిన తన కుమారుడు మళ్లీ ఓడితే అతడికి రాజకీయ భవిష్యత్తే లేకుండా పోతుందని తలసాని శ్రీనివాస యాదవ్ ఈ ప్రతిపాదనకు పెద్దగా ముందుకు రానట్లు సమాచారం.

**పదిమందిలో ముగ్గురు వేరే పార్టీకి..**

రాష్ట్రంలో అధికారం పోయినా, తనకున్న పది ఎంపీ సీట్లలోనైనా నిలుపుకోగలమని నిన్నటి వరకు భావించగా, ఆ పదిమందిలో ముగ్గురు వేరే పార్టీలోకి వెళ్లిపోయారు. వీరిలో నాగర్ కర్నూల్ ఎంపీ రాములు.. కుమారుడు భరత్‌కు, జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్‌కి బీజేపీ సీటు కూడా ఇచ్చేసింది. పెద్దపల్లి ఎంపీ వెంకటేష్ నేత కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. మరోవైపు.. టాలీవుడ్ హీరో అల్లు అర్జున్ మామ కంచర్ల చంద్రశేఖర్ రెడ్డి బీఆర్ఎస్‌కు రాజీనామా చేసి కాంగ్రెస్ తరపున మల్కాజిగిరి లోక్‌సభ సీటులో పోటీ చేయాలనే ప్రయత్నాల్లో ఉన్నారు.
ఇక.. హైదరాబాద్ మాజీ మేయర్ బొంతు రామ్మోహన్ దంపతులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. సికింద్రాబాద్ సీటులో బొంతు శ్రీదేవి కాంగ్రెస్ నుంచి నిలిచే అవకాశముందనే వార్తలూ వినిపిస్తున్నాయి. మరోవైపు చెవెళ్ల పార్లమెంటు బరిలో ఇటీవలే కాంగ్రెస్‌లో చేరిన మాజీ మంత్రి మహేందర్ రెడ్డి నిలిచేందుకు సిద్ధమవుతున్నారు. మరోవైపు మహబూబ్ నగర్ ఎంపీ సీటుకు కాంగ్రెస్ సీటులో వంశీచంద్ రెడ్డి నిలబడతారనే స్పష్టత రానే వచ్చింది. నిన్నటిదాకా.. 'దోస్త్ మేరా దోస్త్' అని పాడిన ఎంఐఎం అధినేత అసదుద్దీన్ సొంత సీటులో మారిన రాజకీయాలతో కేసీఆర్ పేరే ఎత్తటం లేదు.

**కేసీఆర్ పొలిటికల్ ప్లాన్ ఎలా ఉంటుందో..**

మరి ఈ ప్రస్తుత పరిస్థితిలో పార్టీని నిలబెట్టుకోవటం ఎలా? మునుపటిలా రాష్ట్ర రాజకీయాల్లో చురుకైన పాత్ర పోషించడం ఎలా? ఈ ఎన్నికల్లో సత్తా చాటలేకపోతే.. మరో 5 ఏళ్ల నాటికి పార్టీ నామరూపాల్లేకుండా పోయేలా ఉందనేది కేసీఆర్ భయం. కానీ.. ఎన్నిరకాలుగా ఆలోచించినా అందుకు ఎలాంటి దారీ కనిపించటం లేదు. ఒక్క ఓటమి ఇంత తక్కువ సమయంలో పరిస్థితిని ఇంతగా దిగజార్చుతుందా? అని కేసీఆర్ అండ్ కో ఇప్పుడు తలలు పట్టుకుంటున్నారు.

# సాగు నీటికోసం రోడ్డెక్కిన రైతన్నలు

## మొదటి పేజీ తరువాయి

సాగునీరు ఇవ్వాలని సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలం ఎల్లాయిపల్లి రైతులు రామునిపట్ల రాజీవ్ రహదారిపై సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ రంగనాయక సాగర్, అనంతగిరి రిజర్వాయర్ ఉన్నా సాగునీరు అందడం లేదన్నారు. భూ సేకరణ చేపట్టి పంట పొలాలకు సాగు నీరు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సాగుచేసిన పంటలు ఎండిపోయే పరిస్థితి నెలకొందన్నారు. అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా కనికరం చూపిస్తలేరని ఆవేదన వ్యక్తం చేశారు. పంటల కోసం పెట్టిన పెట్టుబడులు భారంగా మారా యన్నారు. ఇప్పటికైన ఉ న్నతాధికారులు స్పందించి సమస్యను పరిష్కరించి పంట పొలాలలకు సాగు నీరు అందివ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

# ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్ దుర్వినియోగం పట్ల చర్యలు తీసుకోవాలి

*కేంద్ర పర్యాటక శాఖ మంత్రి కిషన్ రెడ్డి*

హైదరాబాద్, మార్చి 04 (తీన్మార్ న్యూస్): హైదరాబాద్ నగరంలోని తార్నాకలోని CSIR -- IICT లో సైన్స్ సిటీ సెంటర్ కు సైన్స్, టెక్నాలజీ మంత్రి డాక్టర్. జితేంద్ర సింగ్ తో కలిసి కేంద్ర పర్యాటక శాఖ మంత్రి కిషన్ రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశం అంతా ఎలక్షన్ మోడ్ లో ఉంటే ప్రధాని మోడీ మాత్రం కేంద్ర మంత్రులతో 8 గంటల పాటు భేటీ అయ్యారు అని పేర్కొన్నారు. ఈ మీటింగ్ లో వికసిత భారత్ గురించి చర్చ పెట్టారు అని పేర్కొన్నారు. సైన్స్ సిటీ ఏర్పాటు ఆలస్యం అయింది. ఇక్కడ ఏర్పాటు చేస్తున్న సెంటర్ ను సైన్స్ సిటీ గా డెవలప్ చేయాలనేది మా లక్ష్యం అని ఆయన చెప్పుకొచ్చారు. గత ముఖ్యమంత్రికి ల్యాండ్ కావాలని చాలా సార్లు లేఖ రాశాను.. కానీ, ఇవ్వలేదు అని తెలంగాణ బీజేపీ చీఫ్ కిషన్ రెడ్డి వెల్లడించారు. దీంతో కేంద్ర ప్రభుత్వ సంస్థ IICTలో సైన్స్ ఎక్స్పీరియన్స్ సెంటర్ ను ఏర్పాటు చేస్తున్నాం అని కేంద్ర పర్యాటక శాఖ మంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. కొత్తగా ఏర్పడ్డ ప్రభుత్వాన్ని ల్యాండ్ ఇవ్వాలని అడుగుతాం, ఇస్తుందని ఆశిస్తున్నాను అని చెప్పుకొచ్చారు. న్యూ ఎడ్యుకేషన్ పాలసీ సైన్స్ కి ప్రాధాన్యత ఇస్తున్నాం, సైంటిఫిక్ టెంపర్ పెరగాల్సిన అవసరం ఉంది. స్కూల్స్ లో విద్యార్థులను సైన్స్ పట్ల ఆసక్తి కలిగేలా ప్రోత్సహించాలి. ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్ దుర్వినియోగం కాకుండా చూడాలి అని కిషన్ రెడ్డి పేర్కొన్నారు.

# గట్టమ్మ దేవాలయంలో అయోమయంలో యంత్రాంగం

## మొదటి పేజీ తరువాయి



ఎవరు బాధ్యులో ప్రభుత్వ యంత్రాంగం చెప్పాలని, గట్టమ్మ దేవాలయం వద్ద గొడవలు జరగకుండా ప్రభుత్వ యంత్రాంగం చూసుకొని సమస్యని పరిష్కారం చేయాలని దేవేందర్ అన్నారు. మేమే పూజారులం అని చెప్పుకునే నాయకపోడు వారు తగిన ఆధారాలతో కోర్టులో నిరూపించుకోవాలని అన్నారు. తప్పుడు ఆధారాలు సృష్టించి గతంలో జైలు శిక్ష అనుభవించారు అని అది వారి విజ్ఞతకే వేదిలేస్తున్నం అని, ముదిరాజ్ జాతిలో ఉన్న పెద్దలు అందరూ జాకారం ముదిరాజ్ లకు అండగా ఉంటాం అని అన్నారు.

# ఇందిరమ్మ ఇండ్ల పథకంపై మంత్రి పొంగులేటి కీలక ప్రకటన

తెలంగాణ బ్యూరో, మార్చి 04 (తీన్మార్ న్యూస్): ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని సీఎం రేవంత్‌రెడ్డి భద్రాద్రి రాములవారి సన్నిధిలో ప్రారంభిస్తారని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. సోమవారం సత్తుపల్లిలో సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మంత్రి పొంగులేటి మాట్లాడుతూ ప్రజలు ఆశించిన మేరకు పరిపాలన సాగిస్తున్నామని చెప్పారు. పేదవాడికి తోడు నీడగా ఉండాలనేదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. విద్యా, వైద్యం, మౌలిక సదుపాయాలు కల్పించడమే ప్రభుత్వ ముఖ్య ఉద్దేశమని అన్నారు. సింగరేణి ప్రభావిత ప్రజలను సింగరేణి అధికారులు ఆదుకోవాలని చెప్పారు. రెవెన్యూ సెక్టార్‌లో అవినీతికి పాల్పడకుండా అధికారులు పనిచేయాలని సూచించారు. టీఎస్పీఎస్సీ ద్వారా పారదర్శకంగా నియామకాలు చేపడతామని అన్నారు. ఇప్పటికే సుమారు 22 వేల ఉద్యోగాల ఇచ్చామని చెప్పారు. మెగా డీఎస్సీని ప్రకటించామని 11 వేల ఉద్యోగ నియామకాలను పార్లమెంట్ ఎన్నికల కోడ్‌కు ముందుగానే చేపడతామని స్పష్టం చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ పద్ధతులు మానుకోవాలని ఇందిరమ్మ రాజ్యంలో ప్రజలకు మంచిచేసేలా అధికారులు ముందుకు వెళ్లాలని సూచించారు. పెండింగ్‌లో ఉ న్న ధరణి అప్లికేషన్లను యుద్ధ ప్రాతిపదికన పరిష్కరించేలా మండల స్థాయిలో అధికారులతో కమిటీ ఏర్పాటు చేస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు.

# ఈ నెల 6న రాష్ట్ర వ్యాప్తంగా బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ధర్నాలు

హైదరాబాద్, మార్చి 04 (తీన్మార్ న్యూస్): తెలంగాణలో ఎల్ఆర్ఎస్ ను రద్దు చేస్తామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చెప్పారని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. ఎల్ఆర్ఎస్ ను రద్దు చేస్తామని కాంగ్రెస్ నేతలు అన్నారన్న ఆయన దాన్ని ఎన్నికల అస్త్రంగా వాడుకున్నారని విమర్శించారు. అయితే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత మాట తప్పిందన్నారు. ఈ క్రమంలోనే ఎల్ఆర్ఎస్ ను ఉచితంగా చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ తీరును నిరసిస్తూ ఈ నెల 6న రాష్ట్ర వ్యాప్తంగా ధర్నాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

# ఇంగ్లీష్ రాదనే ట్రోల్స్‌పై స్పందించిన సీఎం రేవంత్ రెడ్డి

## మొదటి పేజీ తరువాయి

చేస్తున్నారు. కాంగ్రెస్ శ్రేణులు కేటీఆర్‌పై, బీఆర్ఎస్ శ్రేణులు సీఎం రేవంత్ రెడ్డిపై ట్రోల్స్ తో విమర్శలు చేస్తున్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డికి ఇంగ్లీష్ రాదంటూ ఓ ట్రోల్ సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నది. ఈ మధ్య కాలంలో రేవంత్ రెడ్డి విదేశీ పర్యటనలో భాగంగా ఇంగ్లిష్ లో మాట్లాడిన మాటలపై ట్రోల్స్ చేస్తూ విమర్శలు చేశారు. కాగా ఈ ట్రోల్స్‌పై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోమవారం స్పందించారు. ఓ సమావేశ కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ నాకు ఇంగ్లీష్ రాదని ట్రోల్స్ చేస్తున్నారు. నేను ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకున్నాను, కాన్వెంట్‌కి వెళ్లి ఉంటే నేను కూడా అద్భుతంగా ఇంగ్లీష్ మాట్లాడే వాడినని, నా గురువులు సరైన విధంగా విద్యాబుద్ధులు నేర్పినందునే నేను ఈ రోజు తెలంగాణ రాష్ట్రానికి ముఖ్యమంత్రిని అయ్యానని, అందుకు నా గురువులకు ఎల్లప్పుడూ కృతజ్ఞుడిగా ఉంటానని, నాకు ఇంగ్లీష్ రాదని అవహేళన చేస్తున్న వారు ఇప్పుడు ఎలా ఉన్నారో గమనించాలని అన్నారు. చైనా, జపాన్, జర్మనీ ఆయా దేశాల్లో ఎవరికీ ఇంగ్లీష్ రాదని, కానీ ఆ దేశాలు ప్రస్తుతం ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో అగ్ర స్థానంలో ఉన్నాయనే విషయం గమనించాలని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు.

# ప్రజాశాంతి పార్టీలో చేరిన సినీ కమెడియన్ బాబుమోహన్

**లోక్‌సభ ఎన్నికల్లో వరంగల్ నుంచి పోటీ చేయనున్నట్లు సమాచారం**


**బీజేపీని వదిలే క్రమంలో బాబు మోహన్ కీలక వ్యాఖ్యలు**



తెలంగాణ బ్యూరో, మార్చి 04 (తీన్మార్ న్యూస్): సినీ కమెడియన్, మాజీ మంత్రి బాబుమోహన్ కేఏ పాల్‌కు చెందిన ప్రజాశాంతి పార్టీలో చేరారు. త్వరలో జరగనున్న లోక్‌సభ ఎన్నికల్లో ప్రజాశాంతి పార్టీ తరఫున వరంగల్ స్థానం నుంచి ఆయన పోటీ చేయనున్నట్లు తెలుస్తోంది. తన జీవితంలో ఒక్కసారైనా వరంగల్ నుంచి ఖచ్చితంగా లోక్‌సభకు పోటీ చేస్తానని ఎంపీగా గెలుస్తానని బాబు మోహన్ గతంలో పలుమార్లు చెప్పారు. ఈ క్రమంలోనే ఎన్నికలకు ముందు ఆయన బీజేపీ నుంచి ప్రజాశాంతి పార్టీలోకి చేరడం ఆ వ్యాఖ్యలకు బలం చేకూరుస్తోంది. వరంగల్ లోక్‌సభ టికెట్ ఇచ్చేందుకు బీజేపీ నో చెప్పడంతో బాబు మోహన్ ప్రజాశాంతి పార్టీలో చేరారని సమాచారం. గత అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ తరఫున ఆందోల్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పోటీ చేసి బాబు మోహన్ ఓడిపోయారు. ఆందోల్ సీటు కేటాయింపులోనే బీజేపీ నేతలతో తీవ్ర ఘర్షణ వాతావరణం తలెత్తగా ఆ ఎన్నికల్లో బాబు మోహన్ ఓటమి పాలయ్యారు. ఆ నియోజకవర్గంలో కాంగ్రెస్ నుంచి పోటీ చేసిన దామోదర రాజనరసింహ గెలపొందారు. బాబూ మోహన్ మూడో స్థానానికే పరిమితమయ్యారు. ఈ క్రమంలోనే ఇటీవలె బీజేపీపై, బీజేపీ నేతలపై తీవ్ర విమర్శలు గుప్పించిన బాబు మోహన్ ఎట్టకేలకు ఫిబ్రవరి 7న బీజేపీకి రాజీనామా చేశారు. అయితే ఏ పార్టీలో చేరుతాననే దానిపై త్వరలోనే నిర్ణయం వెలువరిస్తానని పేర్కొన్న బాబు మోహన్ తాజాగా ప్రజాశాంతి పార్టీ కండువాను కప్పుకున్నారు. బీజేపీని వదిలే క్రమంలో బాబు మోహన్ కీలక వ్యాఖ్యలు చేశారు. కంపు నుంచి బయటకి రావాలనుకున్నా వచ్చేశా అని చెప్పారు. బీజేపీ ఓడాలని చూస్తున్నారు. వీళ్లేం లీడర్లు. ఇలాంటి నేతలను నేను ఏ పార్టీలోనూ చూడలేదు అని ఆయన తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. బీజేపీ వాళ్లకు వెదవలు కావాలి కానీ బాగా పనిచేసే వారు పార్టీ నుంచి బయటికి వెళ్లిపోవాలి అని బాబూ మోహన్ సంచలన ఆరోపణలు చేశారు. నన్ను వాడుకొని బీజేపీ వదిలేసింది. బీజేపీ నేతలు పొమ్మనలేక పొగబెడుతున్నారు అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

# ఎంపీ సీటు ఇవ్వాలని కాంగ్రెస్‌ని కోరిన సీపీఐ

**ఒక సిటు కేటాయించాలని విజ్ఞప్తి చేసిన సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు**



ఖమ్మం, మార్చి 04 (తీన్మార్ న్యూస్): ఖమ్మంలో పార్లమెంటరీ నియోజక వర్గ స్థాయి జనరల్ బాడీ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు హాజరయ్యారు. తెలంగాణలో కాంగ్రెస్‌తో పొత్తులో ఉన్న సీపీఐ ఎంపీ సీట్‌పై ఆశలు పెట్టుకుంది. పొత్తులో భాగంగా ఒక ఎంపీ సీటు ఇవ్వాలని కాంగ్రెస్‌ని కోరుతుంది సీపీఐ. తెలంగాణలో పార్లమెంట్ ఎన్నికల వాతావరణం నెలకొంది. తెలంగాణలో కాంగ్రెస్‌తో పొత్తులో ఉన్న సీపీఐ ఎంపీ సీట్‌పై ఆశలు పెట్టుకుంది. పొత్తులో భాగంగా ఎంపీ సీటు ఇవ్వాలని కాంగ్రెస్‌ని కోరుతుంది సీపీఐ. ఈమేరకు తెలంగాణలో 5 ఎంపీ స్థానాలు ప్రతిపాదించింది సీపీఐ. ఖమ్మం, నల్గొండ, భువనగిరి, వరంగల్, పెద్దపల్లి ఎంపీ సీట్లలో ఏదో ఒక సీటు కేటాయించాలని కాంగ్రెస్‌కి విజ్ఞప్తి చేశారు తెలంగాణ సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు. ప్రతిపాధించిన 5 ఎంపీ స్థానాల్లో ఒక్కటైన ఇస్తుందని ఆశిస్తున్నట్లు చెప్పారు కూనంనేని. ఖమ్మంలో పార్లమెంటరీ నియోజక వర్గ స్థాయి జనరల్ బాడీ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు హాజరయ్యారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో పొత్తు పెట్టుకుని ఒక సీటు కేటాయించినట్టే.. ఇప్పుడు ఎంపీ ఎన్నికల్లోనూ ఒక సీటు కేటాయించాలని కోరుతోంది సీపీఐ. ఒక్క సీటైనా ఇచ్చేలా ఒప్పిస్తామని చెప్తున్నారు కూనంనేని. కమ్యూనిస్టులు ఉంటేనే ఇండియా కూటమికి స్ట్రెంత్ అని తమకు పార్లమెంట్ ఎన్నికల్లో ఒక్క ఎంపీ స్థానామైన ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇండియా కూటమీలో భాగంగా తమిళనాడులో సీపీఐకి డీఎంకే రెండు సీట్లు కేటాయించిందని గుర్తు చేశారు. అలాగే రాష్ట్రంలో బీఆర్ఎస్ మనుగడ రోజురోజుకి తగ్గిపోతుందని చెప్పారు. బీఆర్ఎస్ ప్లేస్‌ను బీజేపీ భర్తీ చేసేందుకు చేస్తున్న ప్లాన్స్‌ని కాంగ్రెస్ తిప్పికొట్టాలని చెప్పారు. సీపీఐ పొత్తుతో కాంగ్రెస్‌కి మరింత బలం చేకూరుతుందని కూనంనేని సాంబశివరావు చెప్పారు.

# బీఆర్ఎస్ కుంభకోణాలకు పాల్పడితే కాంగ్రెస్ ఫైళ్లను దాచిపెడుతోంది

## మొదటి పేజీ తరువాయి

దాచిపెడుతోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆరోపించారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు రెండూ ఒక్కటేనని బీఆర్ఎస్ సర్కారు పోయి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని అది తప్ప ఏ మార్పూ రాలేదని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతి జరిగిందన్న కాంగ్రెస్ సర్కారు ఇప్పుడేం చేస్తోందని మోదీ ప్రశ్నించారు. కాళేశ్వరం అవినీతిపై విచారణ జరిపిస్తామని ఎన్నికలకు ముందు చెప్పిన కాంగ్రెస్ పార్టీ ఇంత వరకూ ఆ పనిచేయలేదని మోదీ విమర్శలు గుప్పించారు. లోక్ సభ ఎన్నికల్లో బీజేపీ నాలుగు వందలకు పైగా సీట్లు సాధిస్తుందని దేశమంతా మోదీ గ్యారెంటీలపైనే చర్చ జరుగుతోందని అన్నారు. 2014 తర్వాత కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తెలంగాణ అభివృద్ధికి, గిరిజనుల గౌరవానికి పెద్దపీట వేసింది. ఒక గిరిజన మహిళ దేశానికి రాష్ట్రపతి అవుతుందని ఎవరైనా ఊహించారా.. భగవాన్ బిర్సా ముండా జయంతిని జాతీయ పండుగలా జరుపుకుంటారని ఊహించారా.. గిరిజనుల అభివృద్ధి కోసం బీజేపీ ప్రభుత్వం ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేసింది అని ప్రధాని నరేంద్ర మోదీ చెప్పుకొచ్చారు.

# రాష్ట్రంలో ముఖ్యమంత్రి సుడిగాలి పర్యటనలకు షెడ్యూల్ ఖరారు



హైదరాబాద్, మార్చి 04 (తీన్మార్ న్యూస్): తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సుడిగాలి పర్యటనలకు సంబంధించిన షెడ్యూల్ ఖరారు అయింది. అయితే, మంగళవారం సంగారెడ్డిలో ప్రధాని నరేంద్ర మోడీ పాల్గొనే మీటింగ్ కు ముఖ్యమంత్రి హాజరుకానున్నారు. ఆ తర్వాత ఈనెల 6న మహబూబ్ నగర్ పర్యటనలో ప్రభుత్వ కార్యక్రమాలతో పాటు పార్లమెంట్ ఎన్నికల ప్రచారంను ఆయన ప్రారంభించనున్నారు. ఇక, 7వ తేదీన రాజన్న సిరిసిల్ల జిల్లాలో పర్యటిస్తారు. అలాగే, కేటీఆర్ నియోజకవర్గం సిరిసిల్లలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో సీఎం రేవంత్ రెడ్డి పాల్గొననున్నారు. ఇక, మార్చ్ 7వ తేదీన వేములవాడ రాజరాజేశ్వరి ఆలయాన్ని సీఎం రేవంత్ రెడ్డి సందర్శించనున్నారు. ఈనెల 8న ఓల్డ్ సిటీలో రెండో దశ మెట్రో పనులను ఆయన ప్రారంభించనున్నారు. అలాగే, మార్చ్ 9వ తేదీన ఎల్బీనగర్ పరిధిలోని బైరామల్ గూడ ఫ్లై ఓవర్ ను సీఎం ప్రారంభించనున్నారు. ఈనెల 11న భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు రేవంత్ రెడ్డి వెళ్లనున్నారు. అక్కడ ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని ప్రారంభించనున్నారు. ఇక, ఈనెల 12న సికింద్రాబాద్ లోని పరేడ్ గ్రౌండ్లో మహిళా సదస్సు కార్యక్రమంలో పాల్గొంటారు. రాష్ట్రంలోని మహిళా స్వయం సహాయక బృందాలతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేకంగా సమావేశం కానున్నారు.

# బీఆర్ఎస్ పార్లమెంట్ అభ్యర్థుల తొలి జాబితా

తెలంగాణ బ్యూరో, మార్చి 04 (తీన్మార్ న్యూస్): రాబోవు పార్లమెంట్ ఎన్నికల కోసం బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖరరావు అభ్యర్థులను ప్రకటించారు. తొలి జాబితాలో నాలుగు పార్లమెంట్ నియోజకవర్గాలకు అభ్యర్థులను ఖరారు చేశారు. కరీంనగర్‌కు మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్, పెద్దపల్లికి కొప్పుల ఈశ్వర్, ఖమ్మం నామా నాగేశ్వరరావు, మహబూబూబాద్ స్థానానికి మాలోత్ కవిత పేర్లను ప్రకటించారు. ఆది, సోమవారాల్లో నాలుగు పార్లమెంట్ నియోజకవర్గాలకు చెందిన నేతలతో బీఆర్ఎస్ అధినేత వరుస సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా లోక్‌సభ ఎన్నికలపై నేతలతో చర్చించి అభ్యర్థుల ఎంపికపై అభిప్రాయాలను సేకరించారు. ఈ క్రమంలో ముఖ్యనేతల అభిప్రాయం మేరకు సమష్టి నిర్ణయంతో తొలి విడుదతలో నలుగురు అభ్యర్థుల పేర్లను ప్రకటించారు. ఈ సందర్భంగా పార్లమెంట్ ఎన్నికల బరిలో నిలువబోతున్న అభ్యర్థులకు కేసీఆర్ శుభాకాంక్షలు తెలిపారు.

తీన్మార్
తెలుగు దినపత్రిక

# విపక్షాల 'వాణి'కి చోటేది?

అందరి ఉమ్మడి కృషితో 17వ లోక్‌సభలో 97 శాతం పని జరిగిందని, ఇది స్వతహాగా సంతోషించదగ్గ విషయమని, ఏడు సెషన్లు 100% కంటే ఎక్కువ ఉత్పాదకతను కలిగి ఉన్నాయని, రాత్రంతా మేల్కొని కూర్చుని ప్రతి ఎంపి అభిప్రాయాలను ప్రభుత్వం దృష్టిలో ఉంచుకునే ప్రయత్నం చేశారని అంటూ 17వ లోక్‌సభ చివరి సమావేశంలో మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోడీ సంతోషం వ్యక్తం చేశారు. పరోక్షంగా స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ముందెన్నడూ లేని విధంగా ఫలదాయకంగా ఈ సమయంలో పార్లమెంట్ పని చేసిన్నట్లు ఘనతగా చాటుకున్నారు. అయితే, వాస్తవానికి పార్లమెంట్ పని తీరు నానాటికీ ప్రజాస్వామ్య సంప్రదాయాలకు తిలోదకాలిస్తూ, కేవలం మొక్కుబడిగా బిల్లుల ఆమోదం జరుపుకునేందుకు అన్నట్లుగా మారుతున్నాయి. ప్రభుత్వం తమకు వ్యతిరేకమైన స్వరాలు వినేందుకు గతంలో ఎన్నడూ లేని విధంగా విముఖంగా వ్యవహరిస్తున్నది. ఈ ఐదేళ్ల కాలంలో డిప్యూటీ స్పీకర్ నియామకం లేకుండానే సభా కార్యకలాపాలు జరపడం గమనిస్తే ప్రతిపక్షాల పట్ల ఏర్పరచుకున్న అసహనాన్ని వెల్లడి చేస్తుంది. 1969 నుండి డిప్యూటీ స్పీకర్ పదవిని ప్రతిపక్ష నేతకు ఇవ్వడం ఓ సంప్రదాయంగా కొనసాగుతూ వస్తున్నది. ఈ సంప్రదాయం పాటించడం ఇష్టం లేకనే స్వాతంత్ర్యం తర్వాత మొదటిసారి ఆ పదవికి అసలు ఎన్నికనే జరపలేదు. లోక్‌సభ పని తీరుపై పౌర సమాజ బృందాలు విడుదల చేసిన 'ఛార్జ్ షీట్' ఈ సందర్భంగా విభ్రాంతి కలిగించే అంశాలను వెల్లడి చేసింది. ప్రపంచంలో అతిపెద్ద ప్రజాస్వామ్యంగా, ప్రజాస్వామ్యానికి మాతృకగా చెప్పుకోవడమే గాని ఆచరణలో మన రాజకీయ పార్టీలు అత్యంత 'అప్రజాస్వామికం'గా మారుతున్నట్లు వెల్లడి అవుతుంది. ప్రతిపక్షాలు లేవనెత్తిన అంశాలపై చర్చకు ఆస్కారం లేకుండా చేస్తూ, వారి ఆందోళనల నేపథ్యంలో సభా కార్యక్రమాలు జరిపే ప్రయత్నమే చేయకుండా, చివరి రెండు రోజులు హడావుడిగా చర్చలు లేకుండా, ప్రతిపక్ష సభ్యులను సభ నుంచి బహిష్కరించి బిల్లులను ఆమోదింప చేసుకోవడం ఒక ఆనవాయితీగా మారింది. 97% పని జరిగిందని ప్రధాని ఏ విధంగా చెప్పారో గాని ఈ లోక్‌సభలో జరిగినన్ని తక్కువ సమావేశాలు ఇంతకు ముందెన్నడూ జరగలేదు. 17వ లోక్‌సభలో సుమారు 278 సెషన్స్ మాత్రమే జరిగాయి. వాజపేయి ప్రధానిగా ఉన్న సమయంలో 1999 నుండి 2004 వరకు 13వ లోక్‌సభలో జరిగిన 423 సిట్టింగ్‌లతో పోలిస్తే ఇది దాదాపు 34% తక్కువ. 2020లో, కరోనా మహమ్మారి కారణంగా అనేక ఇతర దేశాలు చట్టసభల ఆన్‌లైన్ సమావేశాలను నిర్వహించాయి. కానీ ఆ సమయంలో మన దేశంలో కేవలం 33 సమావేశాలు మాత్రమే జరిగాయి. దాదాపు ప్రతి సెషన్ సమయంలో కూడా ప్రభుత్వం తన స్వంత ఎజెండాను పూర్తి కాగానే గడువుకన్నా ముందుగానే వాయిదా వేస్తూ వచ్చింది. 2020 నుండి 2022 మధ్య ఆ విధంగా వరుసగా ఏడు సెషన్‌లు షెడ్యూల్ కంటే ముందే ముగిశాయి. 2023లో జరిగిన చివరికి ప్రత్యేక సెషన్‌తో పాటు శీతాకాల సమావేశాలు కూడా షెడ్యూల్ కంటే ముందే ముగిశాయి. షెడ్యూల్ కంటే ముందే సెషన్ ముగిసినప్పుడు, మిగిలిన రోజుల వ్యవధి కోసం అడిగే ప్రశ్నలన్నీ ముగిసిపోతాయి. ఇక ఆర్డినెన్స్‌ల జారీలో సహితం రికార్డు సృష్టించారు. యుపిఎ II ప్రభుత్వంలో 2004 - 14 మధ్య 61 ఆర్డినెన్స్‌లు జారీ చేయగా, 2014 నుండి 2021 మధ్య 76 ఆర్డినెన్స్‌లు జారీ అయ్యాయి. ఇప్పటి వరకు 17వ లోక్‌సభలో (డిసెంబర్ 21, 2023 నాటికి), లోక్‌సభలో 86 బిల్లులు, రాజ్యసభలో 103 బిల్లులను 2 గంటల కన్నా తక్కువ చర్చతో ఆమోదింపచేశారు. 2023 వర్షాకాల సమావేశంలో రాజ్యసభ ఫార్మసీ (సవరణ) బిల్లును కేవలం 3 నిమిషాల్లోనే ఆమోదించడంతో కొత్త రికార్డు సృష్టించబడింది. మరుసటి రోజు, లోక్‌సభ రెండు బిల్లులను సెంట్రల్ జిఎస్‌టి సవరణ, ఇంటిగ్రేటెడ్ జిఎస్‌టి సవరణ బిల్లు 3 నిమిషాల్లో ఆమోదించింది! గత పార్లమెంట్ సెషన్‌లో ప్రభుత్వం ప్రతిపాదించిన ఎజెండాలో కేవలం మూడు బిల్లులు మాత్రమే ఉన్నాయి.అయితే ఎజెండాలో అసలు చేర్చని మరో 3 కొత్త బిల్లులను ప్రభుత్వం ప్రవేశపెట్టింది. 2009- 2014 మధ్య అన్ని బిల్లులలో 71% స్టాండింగ్ కమిటీలకు పంపగా, 2019 నుండి 16% బిల్లులు మాత్రమే స్టాండింగ్ కమిటీలకు పంపారు. 2014 నుండి 2021 మధ్య పార్లమెంటులో ప్రవేశపెట్టిన 301 బిల్లులలో 24.5% బిల్లులు మాత్రమే సంప్రదింపుల కోసం సర్క్యులేట్ చేశారు. అయితే, ఈ 74 బిల్లులలో కనీసం 40 బిల్లులను సభా సంప్రదాయాల ప్రకారం అందుకు కనీసంగా 30 రోజుల వ్యవధి ఇవ్వలేదు. కీలకమైన మూడు క్రిమినల్ బిల్లులను అధ్యయనం చేసిన బిజెపి ఎంపి అధ్యక్షతన హోం వ్యవహారాల కమిటీ ప్రజల నుండి అభిప్రాయాలను ఆహ్వానించలేదు. ఈ బిల్లుల తయారీ ప్రక్రియలో కమిటీ హడావిడిగా వ్యవహరించిన తీరు, ఎంపిక చేసిన వ్యక్తులను మాత్రమే కమిటీ ముందు అభిప్రాయలు చెప్పేందుకు ఆహ్వానించడం పట్ల పలువురు ప్రతిపక్ష ఎంపిలు అసమ్మతిని వ్యక్తం చేశారు. 2014 నుంచి కేవలం ఐదు బిల్లులు మాత్రమే ఉమ్మడి పార్లమెంటరీ కమిటీలకు వెళ్లాయి. 2016 నుండి 2023 మధ్య, సగటున, బడ్జెట్‌లో 79% చర్చ లేకుండానే ఆమోదించారు. ప్రతి మంత్రిత్వ శాఖ పద్దులను వివరంగా పరిశీలించడానికి స్టాండింగ్ కమిటీలనుఅవకాశం కల్పించేందుకు బడ్జెట్ సెషన్‌కు మధ్యలో విరామం ఇస్తారు. 2016లో 40 రోజులుగా ఉన్న విరామాన్ని 2021లో 20 రోజులకు తగ్గించారు. ఈ వ్యవహారాలను చూస్తుంటే చట్టాలపై, బడ్జెట్ పద్దులపై సమగ్రమైన చర్చల పట్ల ప్రభుత్వం ఏమాత్రం ఆసక్తి చూపలేదని, హడావుడిగా వాటి ఆమోదం పట్లనే శ్రద్ధ చూపిందని స్పష్టం అవుతుంది.అత్యాధునిక వసతులతో, ఛేదించే అవకాశం లేని భద్రతా ప్రమాణాలతో నిర్మించామని చెప్పుకున్న నూతన పార్లమెంట్ భవనం లో తొలి సమావేశంలోనే మొత్తం దేశం దిగ్భ్రాంతి చెందే విధంగా భద్రత ఉల్లంఘన బయటపడింది. దీనిపై చర్చ జరగాలని, ప్రధాని, హోంమంత్రి ఓ ప్రకటన చేయాలని డిమాండ్ చేసిన 146 మంది ఎంపిలను సస్పెండ్ చేసి నూతన చరిత్ర సృష్టించారు. ఏ ప్రజాస్వామ్య దేశంలో ఈ విధంగా జరిగి ఉండదు. పార్లమెంట్ బయట, టివి ఇంటర్వ్యూలలో ఈ ఘటనపై యథేచ్ఛగా మాట్లాడారు గాని పార్లమెంట్‌లో నోరు విప్పకపోవడం సభపట్ల అమర్యాదగానే భావించాల్సి ఉంటుంది.

# బీడీ కార్మికులందరికి జీవన భృతి ఇవ్వాలి

**- తెలంగాణ బీడీ & సిగర్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు మహిమోద్**



ఆత్మకూర్, మార్చి 04(తీన్మార్ న్యూస్): వనపర్తి జిల్లా, అమరచింత మండల్ కేంద్రంలో తెలంగాణ బీడీ & సిగర్ వర్కర్స్ యూనియన్ ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా సమావేశం అమరచింత సీఐటీయూ కార్యాలయంలో అధ్యక్షతనతో బుచ్చన్న ప్రారంబించారు. ఈ సందర్భంగా తెలంగాణ బీడీ & సిగర్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు మహిమోద్ నాయకులు వేణు గోపాల్, రమేష్ మాట్లాడుతూ మహబూబ్ నగర్ జిల్లా లో ఉన్న బీడీ కార్మికుల వేతనాలు ఒప్పందం రెండు సంవత్సరాలు పూర్తి అయినా సందర్భంగా డిమాండ్ నోటీస్ ఇచ్చేందికే సమావేశం జరిగిందని అన్నారు. బీడీ కార్మికులకు కనీస వేతనం అమలు చేయాలనీ, పీఫ్, గ్రాడివిటీ, ఇవ్వాలని డిమాండ్ చేశారు.బీడీ చేసే కార్మికులందరికి జీవన భృతి ఇవ్వాలని,అమరచింత లో 4 వందల బీడీ గుర్తింపు కార్డులు ఉన్న అందరికి జీవన భృతి చాలా మందికి రావడం లేదని ఆరోపించారు. అధికారికముగా మాత్రం అమరచింత లో 6 వందల జీవన భృతి పింఛన్ లు వస్తున్నాయా, అర్హులైన బీడీ కార్మికులకు కాకుండా వేరే వాళ్ళకి జీవన భృతి కింద పింఛన్లు మంజూరు చేయడం జరిగిందని కోరారు. వెంటనే అధికారులు స్పందించి అర్హులైన బీడీ కార్మికులందరికీ జీవన ప్రతి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమం లో బీడీ కార్మిక సంఘము నాయకులు వెంకటన్న, అనంతమ్మ, మాణిక్యమ్మ, వసంతమ్మ, సుజాత, స్వర్ణమ్మ, తదితరులు పాల్గొన్నారు.

# కొత్తకోట హైవే ప్రమాద స్థలాన్ని సందర్శన

**- జిల్లా ఎస్పీ రక్షిత కె.మూర్తి ఐపీఎస్**



వనపర్తి నియోజకవర్గం ప్రతినిధి, మార్చి04(తీన్మార్ న్యూస్): వనపర్తి జిల్లా కొత్తకోట మండలం కేంద్రానికి సమీపంలో 44వ జాతీయ రహదారిపై సోమవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఐదుగురు దుర్మరణం చెందగా మరో ఏడు మందికి తీవ్ర గాయాలు అయ్యాయి. సంబంధించిన వివరాలు కర్ణాటక రాష్ట్రంలోని బళ్లారి జిల్లా, బసవన్న కుంట గ్రామానికి చెందిన ఆలీ కుటుంబ సభ్యులు మొత్తం 12 మంది కెఏ 34 పి 7323 గల ఏర్టిగా కార్ వాహనంలో హైదరాబాద్ కు బయలుదేరారు మార్గమధ్యంలో అందాజ తెల్లవారు జామున రెండున్నర గంటల సమయంలో కొత్తకోట బై పాస్ సమీపంలో టెక్కలి దర్గా వద్ద డ్రైవర్ అతివేగంగా అజాగ్రత్తగా నడిపి చెట్టుకు గుద్దుకొనగా అందులో ఐదుగురు అక్కడికక్కడే మృతి చెందారు. మిగిలిన వారికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటనలో ఫాతిమా బి 85 సంవత్సరాల అబ్దుల్ రహమాన్(65), బస్ర (2), మర్యాబి (5), వసిత రఫిల్ 7 నెలల పాప అక్కడికక్కడే మృతి చెందారు. కాగా షాజహాన్ బేగం, అబిబ్ హసన్, హుస్సేన్ అని, ఖురిమున్నిస, షఫీ వాహనం నడుపుతున్న ఆలీ కి తీవ్రగాయాలు కాగా మరొకరు ప్రమాదం నుండి బయటపడ్డారు. సమాచారం అందుకున్న కొత్తకోట పోలీస్ హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకొని క్షతగాత్రులకు వనపర్తి ఏరియా ఆసుపత్రికి తరలించారు పరిస్థితులు విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం కర్నూలు ఆసుపత్రికి తరలించారు. పెళ్లిచూపులు సోమవారం హైదరాబాదులో జరగవలసి ఉండటంతో వారు తమ యొక్క వాహనంలో బయలుదేరి మార్గమధ్యంలో ప్రమాదానికి గురయ్యారు. ఘటన స్థలాన్ని జిల్లా ఎస్పీ రక్షిత కె మూర్తి ఐపీఎస్ అన్ని కోణాలలో ప్రమాద సంఘటనకు గల కారణాలను సంఘట స్థలానికి వెళ్లి డిఎస్పి సీఐలతో కలిసి విచారించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేసి నిండు ప్రాణాలను బలి తీసుకుంటున్న డ్రైవర్ల పై కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. ప్రతి ఒక్కరు డ్రైవింగ్ చేసేటప్పుడు జాగ్రత్తగా డ్రైవింగ్ చేయాలని, రోడ్డు ప్రమాదాలు నివారించేందుకు ఇప్పటికే పోలీసులు తగు చర్యలు తీసుకుంటున్నారని తెలియజేశారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటామని తెలియ జేశారు.

# జర్నలిస్టు ల సమస్యల పరిష్కారం కోసం ఐక్యంగా పోరాడుదాం

**- ప్రెస్ క్లబ్ జిల్లా అధ్యక్షులు అంబటి స్వామి**



వనపర్తి నియోజకవర్గం ప్రతినిధి, మార్చి 04(తీన్మార్ న్యూస్): జర్నలిస్టు ల సమస్యల పరిష్కారం కోసం ఐక్యత తో పోరాడి సాధించుకుందామని వనపర్తి జిల్లా ప్రెస్ క్లబ్ అధ్యక్షులు అంబటి స్వామి అన్నారు. సోమవారం వనపర్తి పట్టణంలో ని జడ్పీ సమావేశ మందిరం లో వనపర్తి జిల్లా ప్రెస్ క్లబ్ సమావేశం భక్త రాజు అధ్యక్షతనతో నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యక్షులు మాట్లాడుతూహోవిలేకర్లను విడదీసి పాలిస్తున్న జర్నలిస్టు యూనియన్ల నాయకుల మాటలు నమ్మవద్దన్నారు. కొంత మంది జర్నలిస్టులు యూనియన్లను అడ్డుపెట్టుకుని తోటి విలేకర్లకు తీరని అన్యాయం చేశారని చెప్పారు. వనపర్తి ప్రెస్ క్లబ్ ను విచ్చిన్నం చేయుటకు కుట్రలు చేస్తున్నారని, వారి కుట్రలను తిప్పికొడుదామన్నారు. వనపర్తి జిల్లా కేంద్రంలోహో జర్నలిస్టు లకు కేటాయించిన ఇంటి స్థలాల విషయం లో అప్పటి జర్నలిస్టు యూనియన్ నాయకులు మోసం చేశారని ఆయన చెప్పారు. గతంలో రెండు, మూడు సార్లు ప్లాట్లు పొందిన వారే మళ్ళీ ప్లాట్లు తీసుకుని అర్హులైన జర్నలిస్టు లకు, న్యాయంగా దక్కాల్సిన వారికి అన్యాయం చేశారని ఆయన గుర్తు చేశారు. జర్నలిస్టు లకే కాకుండా రిటైర్డ్ ఉద్యోగులకు, రాజకీయ నాయకులకు ప్లాట్లు కేటాయించడం శోచనీయ మన్నారు. గత పాలకులను అడ్డుపెట్టుకుని జర్నలిస్ట్ మోసాలకు పాల్పడ్డారని ఆయన చెప్పారు. మళ్లీ ఇప్పుడు ప్రెస్ క్లబ్ ముసుగులో జర్నలిస్టు లను మోసం చేయుటకు పాత జర్నలిస్ట్ యూనియన్ వారు ప్రయత్నిస్తున్నారని, వారి తీపి మాటలు నమ్మి మరో సారి మోస పోవద్దన్నారు. ప్లాట్లు రాని జర్నలిస్టు లు ఐక్యత తో ఉండి ప్లాట్లు సాధించుకోవాలన్నారు. ప్రెస్ క్లబ్ సారథ్యంలో అందరం ప్లాట్లు సాధించుకుందామన్నారు. అంతకు ముందు ప్రెస్ క్లబ్ అధ్యక్షులు స్వామి, పవన్ లను శాలువా, బోకెలతో సన్మానించారు. ఈ సమావేశంలో సీనియర్ రిపోర్టర్స్ దశరథం, పూరి సురేష్, లింగం గౌడ్, రామకృష్ణారెడ్డి, రవి శంకర్ గౌడ్, సంతోష్, రిపోర్టర్స్ హుస్సేన్, శేఖర్, రవి ప్రసాద్, ఆంజనేయులు యాదవ్, సాయిరాం, కృష్ణయ్య, నరసింహ రాజు, విష్ణు, శ్రీనాథ్ , రవి, ప్రవీణ్, బండి రాజు, అశోక్ గౌడ్, ఆంజనేయులు, కృష్ణ , ఖలీల్, అరుణ్ కుమార్, మనోహర్, స్వామి, బాలు, లక్ష్మీనారాయణ, పర్వతాలు, అశోక్, బాలకృష్ణ, కుర్మయ్య, అలీ,జియ, రమేష్, ఎం. కృష్ణ, వేణుగోపాల్, మన్నెం, వి.విజయ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

# గత ప్రభుత్వంలో గంధమల్లను ఆగం చేసిర్రు

**- ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య**



తుర్కపల్లి, మార్చి 04(తీన్మార్ న్యూస్): మండలంలోని వేల్పుపల్లి, దత్తాయిపల్లి, ఇబ్రహీంపూర్, కొనాపూర్, వీరారెడ్డిపల్లి, మంచిరోని మామిల్లు, గంధమల్ల గ్రామల్లో జాతీయ ఉపాధి హామీ పథకం నిధుల ధ్వారా మంజూరైన సీసీ రోడ్డులను ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య ప్రారంభించారు. ముందుగా వేల్పుపల్లి గ్రామంలో డాక్టర్ బాబా సాహెబ్ అంబెడ్కర్ విగ్రహనికి పూలమాల వేసి నివాళు లర్పించారు. అనంతరం సీసీ రోడ్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధి లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. గంధమల్ల నా సొంత గ్రామమన్నారు. గంధ మల్ల గ్రామానికి ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూసుకుంటనాని, గత ప్రభుత్వం గంధమల్లను ఆగం చేసి భయభ్రాంతులకు గురి చేసిందన్నారు. గంధమల్ల చెరువును ఒక టీఎంసీ వరకు చెరువును పెద్దగా చేస్తామన్నారు. గ్రామంలో ఒక్క ఇల్లు ఒక ఎకరం భూమి పోకుండా చూసుకునే బాధ్యత నాదని, గంధమల్ల చెరువు కట్టను అభివృద్ధి చేసి పర్యాటక కేంద్రంగా మారుస్తామన్నారు. గంధమల్ల గ్రామంలో ఏ ఒక ఇల్లు ఒక ఎకరం కూడా పోకుండా చూస్కుకొనే బాధ్యత మీ బిడ్డ బీర్ల ఐలయ్యదన్నారు. ఈ ప్రజా పాలన ప్రభుత్వం రాగానే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో 48 గంటల్లో రెండు గ్యారెంటీలను అమలు చేశామన్నారు. మహిళలకు ఉచిత బస్సు,సౌకర్యం ఆరోగ్యశ్రీని 10 లక్షల పెంపు చేయడం జరిగిందని, తాజాగా 500 కే గ్యాస్, 200 యూనిట్లకు ఉచిత విద్యుత్ ను అమలు చేశామన్నారు. ఈనెల 11వ తేదీన ఇందిరమ్మ ఇళ్లు పథకాన్ని కూడా ప్రారంభం చేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమం లో మధుసూదన్ రెడ్డి, భాస్కర్ రెడ్డి, శంకర్ నాయక్, నిఖిల్, ఎంపీటీసీ లు కరుణాకర్, మోహన్ బాబు నాయక్ లు, రాజాలు, మల్లేష్, శివరములు, అమరసింహారెడ్డి, అచ్చయ్య, దుప్సింగ్ నాయక్, నరేందర్, ఆంజనేయులు, బాలరాజు, వెంకటేష్ గౌడ్, ఐలయ్య, బాలయ్య, మల్లేష్, మల్లేష్ యాదవ్, కొండల్ రెడ్డి, కిషన్ యాదవ్, ఆంజనేయులు, మన్నెపు తిరుపతి రెడ్డి, సురేష్, రామగోని వెంకటేష్, రాములు పంచాయితీ సెక్రటరీ లు గ్రామ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.



# సీనియర్ జర్నలిస్ట్ వార్త రమేష్ కు ఘన సన్మానం





రాజాపేట, మార్చి 04(తీన్మార్ న్యూస్): రాజాపేట మండల సీనియర్ జర్నలిస్ట్(వార్త) ఉప్పల రమేష్ జన్మదినం సందర్భంగా సోమవారం రాజాపేట మండల నాయకులు ఆయనను ఘనంగా సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపి మిఠాయిలు తినిపించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మార్కెట్ కమిటీ చైర్మన్ మోత్కుపల్లి జ్యోతి ప్రవీణ్, రాష్ట్ర రజక సంఘం నాయకులు సట్టు తిరుమలేష్, బిఆర్ఎస్ నాయకులు ఎర్ర గోగుల జస్వంత్, పాండవులు లింగయ్య, పాండవుల నరేందర్ గౌడ్, జిల్లా ఎమ్మార్పీఎస్ ఉపాధ్యక్షులు ఎర్రగుంట ప్రభాకర్ మాదిగ, తదితరులు పాల్గొన్నారు.

# గ్యాస్, ఉచిత కరెంటు హామీల అమలుపై హర్షం



**- కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు అంగడి నాగరాజు**

భువనగిరి టౌన్, మార్చి 04(తీన్మార్ న్యూస్): కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 100 రోజుల పూర్తి కాకముందే నాలుగు హామీలు నెరవేర్చుడంతో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు అంగడి నాగరాజు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన సోమవారం రోజున విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన మాట తప్పకుండా ఉచిత హామీలను అమలు చేస్తూ వస్తుందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి 500 కు గ్యాస్ 200 యూనిట్లు ఉచిత కరెంటు హామీల ఫైలు పై సంతకం చేశారని అన్నారు. ఇచ్చిన హామీలు ఒక్కొక్కటి అమలు చేస్తున్నందుకు సోనియా గాంధీ రాహుల్ గాంధీ సీఎం రేవంత్ రెడ్డి మరియు భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# నేరేడుచర్లలో అగ్నిమాపక కేంద్రం (ఫైర్ స్టేషన్ )ఏర్పాటు చేయాలి



నేరేడుచర్ల, మార్చి 04(తీన్మార్ న్యూస్): నేరేడుచర్ల మండల కేంద్రం పాలకవీడు, గరిడేపల్లి, పెన్ పహాడ్ మండలాలకు అందుబాటులో ఉన్నందున మున్సిపాలిటీ అయినందున నేరేడుచర్ల పట్టణ కేంద్రంలో అగ్నిమాపక కేంద్రం ( ఫైర్ స్టేషన్) మంజూరు చేసిన యెడల నాలుగు మండలాల పరిధిలో జరుగబోయే అగ్నిప్రమాదాల పట్ల ఆస్తి నష్టాలు, ప్రాణ నష్టాలు జరుగకుండా అందుబాటులో ఉంచి కాపాడిన వారుగుతారనీ ఇట్టి అగ్నిమాపక కేంద్రం (ఫైర్ స్టేషన్) మంజూరుకి స్థానిక హుజూర్ నగర్ శాసన సభ్యులు, రాష్ట్ర మంత్రి వర్యులు నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి చొరవ చూపి సంబంధిత శాఖా మంత్రి గారితో గానీ, సంబంధిత శాఖ అధికారులతో గానీ అగ్నిమాపక కేంద్రం (ఫైర్ స్టేషన్) మంజూరు చేయడానికి వెంటనే సహకరించి ఈప్రాంత ప్రజానీకానికి మెరుగైన సౌకర్యాలు కల్పించి అభివృద్ధి ప్రదాతగా ప్రజా మన్ననలు పొందాలని తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు నేరేడుచర్ల మండల పార్టీ అధ్యక్షుడు ఇంజమూరి వెంకటయ్య కోరారు.

# లక్షలు వెచ్చించి నిర్వహణ మరిచారు

**– నిరూపయోగంగా మారిన ఓపెన్ జిమ్**





రాజన్న సిరిసిల్లా ప్రతినిధి, మార్చి 04(తీన్మార్ న్యూస్): తంగళ్లపల్లి మండలంలోని మేజర్ గ్రామమైన జిల్లాల గ్రామంలో నిర్మించిన ఓపెన్ జిమ్ నిర్వహణ లోపం తో పాడవుతుంది. ఓపెన్ జిమ్ లక్ష్యంగా గ్రామంలో ఉన్న యువతి, యువకులు ప్రతి రోజు ఒకేచోట చేరి ప్రతిరోజు వ్యాయామం చెయ్యాలని ప్రతి గ్రామంలో జడ్పీ నిధులతో గ్రామాలల్లో ఓపేన్ జిమ్ లను నిర్మించారు కానీ యువతి, యువకులు వ్యాయామం చెయ్యడనికి ఓపెన్ జిమ్ చేసురుకునే క్రమంలో వాటి పక్కనే ఉన్న మురుగు కాలువను దాటడానికి తగిన మరమ్మత్తులు చెయ్యలేదు అలాగే దుర్వాసన సైతం వస్తుందని యువకులు ఆరోపించారు. లక్షలు పెట్టి నిర్మించి నిరుపయోగంగా ఉన్న ఓపెన్ జిమ్ ని వేరే చోటుకి తరలించి యువతకు, గ్రామస్థులకు అందుబాటులో వుండేలాగా చూడాలని గ్రామస్థులు కోరుతున్నారు.

# మంత్రులు క్షేత్రస్థాయిలో కరువు పరిశీలన చేయాలి

**– అధికారులు కరువు నష్టపరిహారం అంచనా వేయాలి**

**– సిపిఎం**





నల్లగొండ జిల్లా ప్రతినిధి, మార్చి 04(తీన్మార్ న్యూస్): భూగర్భ జలాలు అడుగంటి బోర్లు ఎండిపోయి చేతికొచ్చేముందు ఎండుతున్న పంటను అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి పంట నష్టపరిహారాన్ని అంచనా వేసి ప్రభుత్వానికి పంపాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి కోరారు. సోమవారం సిపిఎం నల్గొండ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో 4వ వార్డు కేశరాజు పల్లి లో నీరు లేక ఎండిన వరి పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా రంగారెడ్డి మాట్లాడుతూ కరువు కారణంగా రైతు ఎకరానికి 25 వేల రూపాయల పెట్టుబడి పెట్టి తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. వేసిన పంట ఎండిపోయి గేదలు మేపుకోవడానికి వదిలివేయాల్సిన దుస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటనలు నిర్వహించి ఎండిపోయిన పంటలను జరిగిన నష్టాన్ని అంచనా వేసి ప్రభుత్వానికి పంపాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం మంత్రులు రైతులను ఆదుకోవడానికి తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. త్రాగునీటి కోసం నీటిని కాలువల ద్వారా చెరువులు నింపాలని విజ్ఞప్తి చేశారు.



ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్ రెడ్డి, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సయ్యద్ హాశం, పట్టణ కార్యదర్శి ఎండి సలీం, జిల్లా కమిటీ సభ్యులు వీరపల్లి వెంకటేశ్వర్లు, దండెంపల్లి సత్తయ్య, తుమ్మల పద్మ, పట్టణ నాయకులు కుంభం కృష్ణారెడ్డి, అద్దంకి నరసింహ, పిన్నపురెడ్డి మధుసూదన్ రెడ్డి, భూతం అరుణ, కేశవరాజుపల్లి మాజీ సర్పంచ్ పొనుగోటి జనార్ధన్ రావు, స్థానిక రైతులు ముత్తినేని పరుశరామ్, ముత్తినేని మురళి, చింతల దుర్గయ్య, చింతల రామస్వామి, చింతల మధు, వెంకన్న పుల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

# స్వయం సహాయక సంఘాలకు వడ్డీలేని రుణాలు ఇవ్వాలి

**– పాలడుగు ప్రభావతి**



నల్లగొండ జిల్లా ప్రతినిధి, మార్చి 04(తీన్మార్ న్యూస్): వడ్డీ లేని రుణాలు ఇవ్వాలని పొదుపు మహిళలకు ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలి అని జిల్లా కలెక్టర్ హరి చందన కి వినతిపత్రం అందజేశారు. పొదుపు సంఘాల మహిళలకు వడ్డీ లేని రుణాలు ఇవ్వాలని ప్రతి మహిళకు ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి పాలడుగు ప్రభావతి డిమాండ్ చేశారు ఈరోజు ఐద్వా ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ హరిచందనా దాసరి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రభావతి మాట్లాడుతూ ఇటీవల నల్లగొండ జిల్లా వ్యాప్తంగా అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) ఆధ్వర్యంలో సమగ్ర సర్వే నిర్వహించడం జరిగిందని ఈ సర్వే ఆధారంగా మహిళలు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని అన్నారు. నేటికీ పావలా వడ్డీ రుణాలు అందడం లేదని, బ్యాంక్ లు అధిక వడ్డీ లు వసూలు చేస్తున్నారని, సంఘం గ్రూపు లోనుకు బ్యాంకులకు వెళ్ళగా లక్ష కు పైగా బలవంతంగా డిపాజిట్లు పెట్టుకుంటున్నారని తెలిపారు. దీనిపై న బ్యాంక్ లు వడ్డీ ఇవ్వడం లేదు. ఇది ఎక్కడా లేని విధంగా నల్గొండ జిల్లాలో బ్యాంకర్స్ అమలు చేస్తున్నాయని అన్నారు. మహిళలకు ప్రత్యేకంగా ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలిని మహిళా పొదుపు సంఘం సభ్యురాలు మరణిస్తే లోను మాఫీ చేయాలని మహిళా సభ్యురాలు పిల్లలకు స్కాలర్షిప్స్ ఇవ్వాలని అభయ హస్తం డబ్బులు జిల్లాలో ఇంకా పెండింగ్ లో ఉన్నవి 2018 నవంబర్ వరకు ఇచ్చారు. అందులో ఎస్సీ, ఎస్టీ సంఘాలకు 2021 వరకు ఇచ్చారు. అసెంబ్లీలో రద్దు చేస్తూ చట్టం కూడా అయినప్పటికీ నేటికీ విడుదల చేయలేదని వెంటనే ఇవ్వాలన్నారు. స్త్రీ నిధి డబ్బులు జిల్లాలో సక్రమంగా అమలు కావడం లేదు దుర్వినియోగం అవుతున్న ఆరోపణలు ఉన్నయాని గ్రామాలలో 50,60 సంఘాలకు ఒక సంఘ బంధం కమిటీలు ఉన్నవి. నిబంధన ప్రకారంగా 35 సంఘాలకు ఒక సంఘం ఉండేవిధంగా చూడాలని అన్నారు. ప్రతి సంవత్సరం సంఘ బంధం నూతన కమిటీల ఎన్నిక జరగాలని కానీ జరగడం లేదని అన్నారు. సంఘ బంధం గ్రామ కమిటీలకు భవనాలను నిర్మించి ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా అధ్యక్షురాలు పోలేబోయిన వరలక్ష్మి, రాష్ట్ర కమిటీ సభ్యులు కొండ అనురాధ, జిల్లా ఉపాధ్యక్షురాలు తుమ్మల పద్మ, జిల్లా సహాయ కార్యదర్శులు చనగాని నాగమణి, భూతం అరుణకుమారి, పాదూరి గోవర్ధన, కారంపొడి ధనలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

# కేటీఆర్ దమ్ముంటే నిజామాబాద్ ఎంపీగా పోటీ చేటరు..

**– ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి**



జగిత్యాలటౌన్: కేటీఆర్‌కు దమ్ముంటే నిజామాబాద్ నుంచి ఎంపీగా పోటీ చేయాలని కరీంనగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి సవాల్ విసిరారు. శుక్రవారం జగిత్యాల జిల్లాలోని ఇందిరా భవన్‌లో మీడియాతో ఎమ్మెల్సీ మాట్లాడారు.

అధికారం కోల్పోయినా కేటీఆర్‌కు ఇంకా జ్ఞానోదయం కావడం లేదన్నారు. ఎమ్మెల్యేగా ఉన్న కేటీఆర్ తన స్థాయి మరిచిపోయి సీఎం రేవంత్ రాజీనామా చేసి మళ్లీ పోటీకి రావాలంటూ సవాలు విసరడం హాస్యాస్పదం అన్నారు. ఎమ్మెల్యే పదవి, సీఎం పదవి ఒక్కటేనా అని నిలదీశారు.

కేటీఆర్‌కు రేవంత్‌కు నక్కకు నాగలోకానికి ఉన్నంత తేడా ఉ ందన్నారు. మొన్నటి వరకు బీఆర్ఎస్ మెదక్ ఎంపీ సీటు అయినా గెలుస్తుందేమో అని అనిపించేదని. ఇప్పుడు కేటీఆర్ వైఖరితో మెదక్ కూడా గెలిచే పరిస్థితి లేదన్నారు.

ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీకి ఓటేస్తే పెన్షన్ రాదని అసత్య ప్రచారం చేశారని, కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేస్తుందని తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టులో రెండు టీఎంసీలు ఉపయోగించకుండా మరో అదనపు టీఎంసీ కోసం అనుమతులు లేకుండా చేపట్టడం నేరమని తెలిపారు. తుమ్మిడి హెట్టీ వద్ద ప్రాజెక్టు నిర్మాణం చేపడితే ఒక్క లిఫ్ట్‌తో ఎల్లంపల్లికి నీరు చేరేదని కేంద్ర జలవనరుల శాఖ నిపుణులు వేదిర శ్రీరామ్ నివేదిక ఇచ్చారని గుర్తు చేశారు.

మెడిగడ్డ పిల్లర్లు కుంగడం టెక్నికల్ లోపమని, ఇకనైనా బీఆర్ఎస్ పార్టీ నాయకులకు జ్ఞానోదయం కావాలని విమర్శించారు. సమావేశం అనంతరం పలువురు బీఆర్ఎస్ నాయకులు ఎమ్మెల్సీ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు.

# 5న లైబ్రరియన్ అభ్యర్థులకు ధ్రువపత్రాల పరిశీలన



హైదరాబాద్: రాష్ట్రంలోని ఇంటర్ విద్య, సాంకేతిక విద్యలో లైబ్రరియన్ పోస్టులకు ఎంపికైన అభ్యర్థులకు ఈనెల ఐదో తేదీన హైదరాబాద్‌లోని నాంపల్లిలో ఉన్న తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) ధ్రువపత్రాల పరిశీలన జరగనుంది. ఈ మేరకు టీఎస్‌పీఎస్సీ కార్యదర్శి నవీన్ నికోలస్ శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. టీఎస్‌పీఎస్సీ వెబ్‌సైట్‌లో అభ్యర్థుల షార్ట్‌లిస్ట్ అందుబాటులో ఉందని తెలిపారు. ధ్రువపత్రాల పరిశీలనకు అవసరమైన అన్ని పత్రాలనూ తీసుకురావాలని సూచించారు. ఎవరైనా అభ్యర్థులు ఒరిజినల్ ధ్రువపత్రాలను తీసుకురాకపోతే ఆ తర్వాత అవకాశం ఇవ్వబోమని స్పష్టం చేశారు. ధ్రువపత్రాల పరిశీలనకు గైర్హాజరైతే తర్వాత ఈ ప్రక్రియను చేపట్టబోమని స్పష్టం చేశారు. విద్యాశాఖ పరిధిలో ఇంటర్ కమిషనరేట్‌లో 40, సాంకేతిక విద్యాశాఖలో 31 కలిపి మొత్తం 71 లైబ్రేరియన్ పోస్టుల భర్తీకి 2022, డిసెంబర్ 31న నోటిఫికేషన్‌ను విడుదల సంగతి తెలిసిందే. ఇతర వివరాలకు అభ్యర్థులు www.tspsc.gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని ఆయన సూచించారు.

టీఆర్టీ హిందీ ఫలితాలు విడుదల

ఉపాధ్యాయ నియామక పరీక్ష (టీఆర్టీ) హిందీ ఫలితాలను టీఎస్‌పీఎస్సీ విడుదల చేసింది. ఈ మేరకు టీఎస్‌పీఎస్సీ కార్యదర్శి నవీన్ నికోలస్ శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రీలింక్విష్‌మెంట్ తర్వాత విత్‌హెల్డ్‌లో ఉన్న ఫలితాలను విడుదల చేశామని తెలిపారు. రెండు ఖాళీలను ప్రభుత్వం విత్‌హెల్డ్‌లో ఉంచిందని పేర్కొన్నారు. గతనెల 24 నుంచి 26 వరకు రీలింక్విష్‌మెంట్ కోసం అవకాశం కల్పించామని తెలిపారు. అభ్యర్థులెవరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోలేదని పేర్కొన్నారు. ప్రొవిజినల్ జాబితాను విడుదల చేశామని తెలిపారు. ఎంపికైన అభ్యర్థుల వివరాలు www.tspsc.gov.in వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయని వివరించారు.

జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్ పోస్టులు 12

మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖలో అకౌంట్స్ ఆఫీసర్ (యూఎల్‌బీ), జూనియర్ అకౌంట్స్ ఫీసర్ (యూఎల్‌బీ), సీనియర్ అకౌంటెంట్ (యూఎల్‌బీ)లో జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్ పోస్టులు 12 ఉన్నాయని టీఎస్‌పీఎస్సీ కార్యదర్శి నవీన్ నికోలస్ తెలిపారు. 13 ఉన్న జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్ పోస్టులను తాజాగా మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ సవరించిందనీ, వాటిని 12 పోస్టులకు తగ్గించిందని పేర్కొన్నారు.

టీఎస్‌పీఎస్సీ సభ్యునిగా ఆమీర్ ఉల్లాఖాన్ బాధ్యతల స్వీకరణ

టీఎస్‌పీఎస్సీ సభ్యునిగా ఆమీర్ ఉల్లాఖాన్ శుక్రవారం బాధ్యతలను స్వీకరించారు. టీఎస్‌పీఎస్సీ చైర్మెన్ ఎం మహేందర్‌రెడ్డి ఆయనతో ప్రమాణస్వీకారం చేయించారు. తపాలా శాఖలో రిటైర్డ్ అధికారిగా పనిచేసిన ఆమీర్ ఉల్లాఖాన్‌ను రాష్ట్ర ప్రభుత్వం టీఎస్‌పీఎస్సీ సభ్యునిగా నియమించిన విషయం తెలిసిందే.

# గంభీర్ బాటలో.. ఎన్నికలకు దూరంగా కేంద్ర మాజీ మంత్రి



ఢిల్లీ: బీజేపీ తరపున లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేయబోనని.. రాజకీయాల నుంచి వైదొలగానుకుంటున్నట్లు గౌతం గంభీర్ ప్రకటించిన వేళ.. మరోనేత అదే రీతిన నిర్ణయం తీసుకున్నారు.

బీజేపీ సీనియర్.. ఎంపీ జయంత్ సిన్హా వచ్చే లోకసభ ఎన్నికల్లో పోటీ చేయనని ప్రకటించారు.

జయంత్ సిన్హా.. గతంలో కేంద్ర మంత్రిగానూ పని చేశారు. ప్రస్తుతం ఆయన జార?ండ్‌లోని హజారీబాగ్ నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్నారు.'నన్ను ఎన్నికల విధుల నుంచి తప్పించాలని కోరుతున్నా. నేను ప్రపంచ పర్యావరణ మార్పుల విషయంలో భారత్‌పై పూర్తి దృష్టి సారించాలనుకుంటున్నా. నేను ఆర్థిక, ప్రభుత్వపరమైన విషయాల్లో బీజేపీ పార్టీకి అన్ని రకాలుగా సేవలందిస్తా.

.. గత పదేళ్లుగా హజారీబాగ్‌కు సేవలు అందించినందుకు గర్వపడుతున్నా. ప్రధాని మోదీ, అమిత్ షా, బీజేపీ నాయకత్వం ఆశీస్సులతో చాలా మంచి అవకాశాలు పొందాను. వారందరికీ నా కృతజ్ఞతలు. జైహింద్' అని జయంత్ సిన్హా ఎక్స్( ట్విటర్) వేదికగా ప్రకటించారు.ఐఏఎస్ మాజీ అధికారి.. కేంద్ర మాజీ మం?త్రి యశ్వంత్ సిన్హా కుమారుడే జయంత్ సిన్హా అని తెలిసిందే. సుదీర్ఘకాలం బీజేపీతో రాజకీయాల్లో ఉన్న యశ్వంత్ సిన్హా.. తీవ్ర విమర్శలు గుప్పిస్తూ పార్టీని వీడారు. ఆ తర్వాత తృణమూల్ కాంగ్రెస్‌లో చేరారు. 2022లో రాష్ట్రపతి ఎన్నికల్లో ప్రతిపక్షల తరఫున అభ్యర్థిగా పోటీ చేసి ఓటమిపాలయ్యారు.

ఇలా ఇద్దరూ సిట్టింగ్ ఎంపీలు తాము వచ్చే లోకసభ ఎన్నికల్లో పోటీ చేయమని.. రాజకీయాలకు దూరం ఉంటామని ప్రకటించటం బీజేపీలో చర్చనీయాంశంగా మారింది. అయితే మరోవైపు బీజేపీ ప్రకటించే ఎంపీ అభ్యర్థుల జాబితాలో వీరికి టికెట్ లభించకపోవచ్చని కూడా రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. అందుకేవారు రాజకీయాలకు దూరంగా ఉండాలని వారు ఇలా నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఇక..బీజేపీ మొదటి జాబితాలోనే సుమారు వంద మంది అభ్యర్థుల పేర్లను ప్రకటిచనున్నట్లు వార్తలు వస్తున్నాయ. ఆ దిశగా బీజేపీ రెండు రోజులుగా తీవ్ర కసరత్తు చేస్తున్న విషయం తెలిసిందే.

# బీజేపీలో చేరిన ఎంపీ బీబీ పాటిల్

**– జహీరాబాద్ ఎంపీగా రెండు సార్లు విజయం**

**– బీఆర్ఎస్‌కు బలమైన అభ్యర్థి దొరికేనా..?**



మెదక్: పదేండ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ నేతలు ఓటమిని తట్టుకోలేకపోతున్నారు. అధికారంలో ఉంటే తప్ప తమ రాజకీయ, వ్యాపార ప్రయోజనాలను కాపాడుకోవడం కష్టమనే భావనలో ఉ న్నారు. ఒక్కొక్కరుగా పార్టీని వీడుతున్నారు. అధికారంలో ఉండేందుకు తమకు అనువైన పార్టీని ఎంచుకుంటున్నారు. పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తున్న వేళ ముగ్గురు బీఆర్ఎస్ ఎంపీలు పార్టీకి రాజీనామాలు చేశారు. ఇప్పటికే పెద్దపల్లి, నాగర్‌కర్నూల్ ఎంపీలిద్దరూ బీఆర్ఎస్‌కు రాజీనామా చేసి ఒకరు కాంగ్రెస్, మరొకరు బీజేపీలో చేరారు. తాజాగా జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్ పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేసి ఢిల్లీలో బీజేపీ పెద్దల సమక్షంలో కాషాయ కండువా కప్పుకున్నారు. రాబోయే ఎన్నికల్లో కమలం పార్టీ నుంచి ఎంపీగా పోటీ చేసేందుకు సిద్ధమవుతున్నారు. బీఆర్ఎస్ వరుసగా గెలుస్తూ వస్తున్న పార్లమెంట్ నియోజకవర్గాల నుంచి సిట్టింగ్ ఎంపీలు పార్టీని వీడటం శ్రేణుల్ని సేతం కలవరపరుస్తోంది. 2019 పార్లమెంట్ ఎన్నికల్లో గెలిచిన 9 మంది ఎంపీలకుగాను ఇప్పటికే ముగ్గురు ఎంపీలు బీఆర్ఎస్‌కు రాజీనామా చేశారు. మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో దుబ్బాక నుంచి పోటీ చేసి ఎమ్మెల్యేగా గెలిచారు. దీంతో నాలుగు పార్లమెంట్ నియోజకవర్గాల్లో బీఆర్ఎస్‌కు కొత్త అభ్యర్థుల్ని వెతుక్కునే పరిస్థితి ఏర్పడింది. ముఖ్యంగా బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ సొంత జిల్లా ఉమ్మడి మెదక్ పరిధిలో ఉన్న జహీరాబాద్, మెదక్ రెండు పార్లమెంట్ నియోజకవర్గాల్లోనూ ఎంపీల్లే కుండా పోయారు. దీంతో కొత్త అభ్యర్థుల్ని వెతుక్కోవాల్సి వచ్చింది. పార్టీ బలంగా ఉన్నప్పటికీ ఆర్థిక పరిపుష్టి, ప్రజాధరణ కల్గిన బలమైన అభ్యర్థులేకపోతే పార్టీకి ఎదురు దెబ్బ తప్పదని పలువురు బీఆర్ఎస్ నేతలు వ్యాఖ్యానిస్తున్నారు. నిజామాబాద్ జిల్లా సిర్పూర్‌కు చెందిన భీమారావు బసవంతరావు (బీబీ పాటిల్) 2014లో అప్పటి టీఆర్ఎస్‌లో చేరారు. 2014, 2019 ఎన్నికల్లో జహీరాబాద్ నుంచి టీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేసి రెండుసార్లు గెలుపొందారు. మూడోసారి పోటీ చేసేందుకు సిద్ధమవుతున్న ఆయన బీఆర్ఎస్ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేశారు. తన రాజీనామా లేఖను కేసీఆర్‌కు పంపారు. పార్టీలో అవకాశం కల్పించినందుకు ధన్యవాదాలు తెలుపుతున్నట్లు పేర్కొన్నారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు నుంచే బీబీ పాటిల్ కొంత అసంతృప్తితో ఉన్నారు. పార్టీ ఓడిపోవడంతో కార్యక్రమాలకు మరింత దూరంగా ఉంటూ వచ్చారు. 2019 ఎన్నికల్లో ఆయన స్వల్ప ఓట్ల తేడాతోనే గెలిచారు. ప్రస్తుతం రాష్ట్రంలో అధికారం కోల్పోయినందున వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ నుంచి పోటీ చేసి గెలవడం కష్టంగా భావించి.. ప్రత్యామ్నాయంగా బీజేపీ వైపు మొగ్గు చూపినట్టు ఆయన సన్నిహితులు చెబుతున్నారు.

ఎంపీ టికెట్.. వ్యాపార పరిరక్షణ

జహీరాబాద్ ఎంపీగా రెండు పర్యాయాలు బీఆర్ఎస్ నుంచి గెలిచిన బీబీ పాటిల్‌కు వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ నుంచి ఎంపీ టికెట్ కన్ఫమ్ చేసినట్టు తెలుస్తోంది. అందుకే ఆయన ఆ పార్టీలో చేరారు. జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో సంగారెడ్డి జిల్లాలోని నారాయణఖేడ్, అందోల్, జహీరా బాద్‌తో పాటు బాన్సువాడ, జుక్కల్, ఎల్లారెడ్డి, కామారెడ్డి అసెంబ్లీ నియోజక వర్గాలున్నాయి. వీటిల్లో బీఆర్ఎస్ జహీరాబాద్ ఎమ్మెల్యే సీటు మాత్రమే గెలి చింది. కామారెడ్డిలో బీజేపీ ఎమ్మెల్యే గెలిచారు. ఏడు నియోజకవర్గాల్లోనూ లింగా యత్‌ల ఓట్లు బలంగా ఉన్నాయి. వీరంతా కూడా బీజేపీ వైపు మొగ్గు చూపుతు న్నారనే అంచనాలతో పాటిల్ కమలం పార్టీ వైపు అడుగులేశారంటు న్నారు. రాజకీయ ప్రయోజనాలే కాకుండా ఆయన 'పాటిల్' కంపెనీకి మహారాష్ట్రలో అనేక వ్యాపారులున్నాయి. ఆర్థిక ప్రయోజనాల రీత్యా కూడా బీజేపీ సేఫ్‌గా బీబీ పాటిల్ భావించి ఉంటారని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు.

# బాబ్లీ నుంచి ఎస్సారెస్పీకి నీటి విడుదల



నిజామాబాద్: తాగునీటి అవసరాల మేరకు మహారాష్ట్రలోని బాబ్లీ ప్రాజెక్టు గేట్లు ఎత్తి శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌కు నీటిని విడుదల చేసినట్టు ఎస్సారెస్పీ ఎఈఈ రవి తెలిపారు. బాబ్లీ ప్రాజెక్టు నుంచి సీడబ్ల్యుసీ అధికారుల సమక్షంలో మహారాష్ట్ర, తెలంగాణ ప్రాజెక్టుల అధికారులు శుక్రవారం బాబ్లీ గేట్లు తెరిచారు. 0.6 టీఎంసీల నీరు విడుదల చేసి మూసివేయనున్నారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ప్రతి సంవత్సరం మార్చి 1న దిగువకు 0.6 టీఎంసీల నీటిని తాగునీటి కోసం బాబ్లీ ప్రాజెక్టు నుంచి గోదావరి నది గుండా ఎస్సారెస్పీలోకి వదులుతారు. ఈ కార్యక్రమంలో సీడబ్ల్యూసీ ఈఈఈ వెంకటేశ్వర్లు, బాబ్లీ ప్రాజెక్టు ఈఈ సిఆర్ బాన్సోధ్, ఎస్సారెస్పీ డిఈఈ గణేష్, ఎస్సారెస్పీ ఎఈఈ రవి, కడెం ప్రాజెక్టు డిఈఈ ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

# మహిళా సాధికారతే లక్ష్యంగా సంక్షేమ పథకాలు

**- ప్రతి గ్యారంటీ పథకాన్ని తప్పనిసరిగా అమలు చేస్తాం: హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్**

**- గృహజ్యోతి లబ్దిదారులకు జీరో బిల్లులు అందజేత**




సిటీబ్యూరో: నిరుపేదలకు సంక్షేమ పథకాలను అందజేయడమే లక్ష్యంగా మహిళల ఆర్థికాభివృద్ధికి సంపూర్ణ సహకారం అందించేందుకు గృహజ్యోతి కార్యక్రమాన్ని అమలు చేస్తున్నామని రవాణా, బీసీ సంక్షేమ శాఖ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఆదివారం హైదరాబాద్ అమీర్‌పేట్‌లోని ధరమ్ కరమ్ రోడ్డు పక్కనున్న గృహాల్లో గృహజ్యోతి కార్యక్రమాన్ని ప్రారంభించారు. స్వయంగా మీటర్ రీడింగ్ తీసి జీరో బిల్లులను మహిళలకు మంత్రి అందించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఎన్నికలకు ముందు ఇచ్చిన గ్యారంటీల్లో భాగంగా తెలంగాణ ప్రజలకు ఇప్పటికే పది లక్షల ఆరోగ్యశ్రీ తోపాటు, మహిళలకు ఉచిత ప్రయాణం, రూ.500కే గ్యాస్, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్‌ని చేశామన్నారు. మిగతా పథకాలను త్వరలో అమలు చేస్తామని తెలిపారు. 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అమలుతో దాదాపు వెయ్యి రూపాయల విలువైన కరెంట్‌ను ప్రతి మీటర్‌పై లబ్ధిదారునికి ఇవ్వనున్నట్టు చెప్పారు. అసెంబ్లీ ఎన్నికల ఫలితాలొచ్చిన 90 రోజుల్లోనే ఇచ్చిన హామీలు అమలు చేస్తున్నామని గుర్తుచేశారు.

ఈనెల 11న ఇందిరమ్మ ఇండ్లతో పాటు మిగతా వాగ్దానాల్ని పూర్తి చేస్తామని తెలిపారు. మహిళలకు ఉచిత ప్రయాణం, ఉచిత విద్యుత్, 500కే గ్యాస్ అందించడం ద్వారా మహిళా సాధికారత వస్తుందని.. తద్వారా మహిళల జీవితాల్లో అభివృద్ధి జరుగుతుందన్నారు. కార్యక్రమంలో హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, విద్యుత్ శాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# మోడీ హామీలు కాకుండా నిధులు కేటాయించాలి

**- అఖిల పక్షం ఆధ్వర్యంలో పట్టణంలో ర్యాలీ**

**- నల్ల జెండాలు పట్టుకొని నినాదాలు**



ఆదిలాబాద్‌టౌన్: నలభై ఏండ్ల తర్వాత ఆదిలాబాద్‌కు అధికారికంగా ప్రధానమంత్రి వస్తున్నారని, జిల్లాలోని సమస్యలను పరిష్కరించేలా హామీలు కాకుండా నిధులు కేటాయించాలని ఆదిలాబాద్ అభివృద్ధి సాధన కమిటీ కన్వీనర్ బండి దత్తాత్రి అన్నారు. ఆదివారం అఖిల పక్షం ఆధ్వర్యంలో ఆదిలాబాద్ పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. స్థానిక ఆర్ అండ్ బీ అతిథి గృహం నుంచి ప్రారంభమైన బైక్ ర్యాలీ పట్టణంలోని పలు కూడళ్ల మీదుగా సాగింది. నల్ల జెండాలను పట్టుకొని ప్రధాని పర్యటనలో జిల్లాకు న్యాయం జరిగేలా చూడాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా బండి దత్తాత్రి మాట్లాడుతూ.. బీజేపీ అధికారంలోకి వచ్చిన పదేండ్లలో ఆదిలాబాద్‌ను ఎలాంటి అభివృద్ధి చేయలేదన్నారు. గత ఎన్నికల్లో సీసీఐ పునరుద్ధరణ, ఎయిర్‌పోర్టు, ఆదిలాబాద్ టూ ఆర్మూర్ రైల్వేలైన్ తదితర హామీలు ఇచ్చారని, కానీ ఇప్పటివరకు వాటి ఊసే తీయడం లేదన్నారు. ఈనెల 4న ఓట్లు అడగడానికి ఆదిలాబాద్‌కు వస్తున్న ప్రధాని నరేంద్ర మోడీ వీటిపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనాదిగా ఆదిలాబాద్‌లో అభివృద్ధి మరుగున పడిందన్నారు. గత ఎన్నికల హామీలను బీజేపీ నెరవేర్చకుండా ఎన్నికల సమయంలోనే అదిలాబాద్ పర్యటనలకు రావడం ప్రజానీకాన్ని తీవ్ర నిరాశకు గురి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో అఖిల పక్షం నాయకులు దర్శనాల మల్లేష్, ప్రభాకర్ రెడ్డి, సచిన్, గోవర్ధన్, రాములు, గంద్రత్ రమేష్, బాలూరి గోవర్ధన్ రెడ్డి, గుడిపెల్లి నగేష్, దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

# దేశంలో పేదరికం సంఖ్యలపై బీజేపీ ఎత్తులు

**- పేదరికం తగ్గిందంటూ నిటిఅయోగ్ మాయాజాలం**




హైదరాబాద్: దేశంలో పేదరికం తగ్గలేదని సీనియర్ జర్నలిస్టు, ఆర్థికవేత్త డి.పాపారావు తెలిపారు. ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రం మేనేజింగ్ కమిటీ కార్యదర్శి ఎస్.వినరు కుమార్ సమన్వయంలో దేశంలో పేదల సంఖ్య ఐదు శాతానికి పడిపోయిందా? ఇది వాస్తవమా? నిటిఅయోగ్ మాయాజాలమా? అనే అంశంపై వెబినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా పాపారావు మాట్లాడుతూ, 2011-12లో చేసిన సర్వేతో 2022-23లో చేస్తున్న సర్వేను పోల్చడం సరికాదని తెలిపారు. అప్పుడు సర్వేకు ఎంచుకున్న మెథడాలజీ, పరిస్థితులు వేరని, ప్రస్తుతం వేరుగా ఉన్నాయని తెలిపారు. గతంలో ఒకేసారి సర్వే నిర్వహించగా ప్రస్తుతం మూడు దఫాలుగా నిర్వహిస్తున్నారనీ, రెండో దఫా ఇంకా పూర్తి కాకముందే నిటిఅయోగ్ ఐదు శాతానికి పేదరికం పడిపోయిందని చెప్పడం వెనుక కేవలం రాజకీయమే కారణమని చెప్పారు. దేశంలో బీజేపీ సాధించిన విజయాలు ఏమీ లేవని బీజేపీ విధానాలను బలపరిచేందుకు నిటిఅయోగ్ ఇలాంటి మాయాజాలానికి తెరలేపిందని చెప్పారు. నిటిఅయోగ్ మాటలను బీజేపీ శ్రేణులు, వారి సానుభూతిపరులను కొంత మేరకు నమ్మిం చవచ్చేమో గానీ, దేశంలో పేదలకు వాస్తవం తెలుసన్నారు. చైనాపై ఉన్న వ్యతిరేకతతో భారతదేశాన్ని మచ్చిక చేసుకునేందుకు అమెరికా కూడా పిల్లికి ఎలుక సాక్ష్యమన్నట్టు భారతదేశంలో పేదరికం తగ్గిందని చెబుతున్నదని ఎద్దేవా చేశారు. పేదరికం తగ్గితే దేశంలో ఇప్పటికీ 60 శాతం మంది అంటే 80 కోట్ల మందికి సబ్సిడీ రేషన్ బియ్యం ఇచ్చే పరిస్థితి ఎందుకుందని బీజేపీని ప్రశ్నించారు. నిటి అయోగ్ గ్రామీణుల తలసరి ఆదాయం రూ.3,773కు పెరిగిందని చెబుతు న్నదనీ, గ్రామాల్లో ఒక కుటుంబంలో సగటున ఐదుగురు ఉంటారనీ, ఆ లెక్కన నెలకు దాదాపు రూ.18 వేల కుటుంబ ఆదాయముం టుందని వివరించారు. అయితే నిటిఅయోగ్ ఇచ్చిన సర్వే లెక్కల ప్రకారమే% గ్రామీణ కుటుంబాల సగటు నెల ఆదాయం రూ.10 వేల వరకే ఉంటుందని తెలిపారు. పరస్పర విశ్వసనీయత లేని, భిన్నమైన లెక్కల ద్వారా ఇది కేవలం బీజేపీకి రాజకీయ ప్రయోజనం చేకూర్చేందుకే అని అర్థమవుతుందని తెలిపారు. నిటిఅయోగ్ 2017-18లో చేసిన సర్వే ఫలితాలను శాస్త్రీయత లేదని తొక్కిపెట్టారని పాపారావు ఈ సందర్భంగా గుర్తుచేశారు. అప్పుడు శాస్త్రీయత లేని మెథడాలజీనే ఉపయోగించి చేసిన ప్రస్తుత సర్వే ఏ విధంగా శాస్త్రీయమైంది అవుతుందని ప్రశ్నించారు. గ్రామాల్లో ఫాస్ట్ మూవింగ్ కన్జ్యూమర్ గూడ్స్ అమ్మకాలు పెరగడం లేదనీ, షేర్లు మార్కెట్లో ఎఫ్ఎంసీజీ షేర్లూ పెరగడం లేదన్నారు. వీటి ద్వారా గ్రామాల్లో వ్యవసాయ సంక్షోభం ఉందని తెలుస్తుందన్నారు. నోట్ల రద్దు, జీఎస్టీలతో పాటు అసంఘటిత రంగాన్ని పూర్తిగా సంఘటిత రంగంగా మార్చేందుకు బీజేపీ అనుసరించిన విధానాలతో కార్పొరేట్లు బలపడ్డారని తెలిపారు. వాటికి సంబంధించిన లెక్కలను కూడా పేదరికం తగ్గిందనేందుకు చెప్పేందుకు ఉపయోగిం చుకున్నారని తప్పుపట్టారు. చిన్న వ్యాపారులు దెబ్బతిన్నారని గుర్తుచేశారు.

# ఏపీ ఎన్నికలకు స్టార్ క్యాంపెయినర్‌గా రేవంత్‌రెడ్డి

**- కర్నాటక సీఎం సిద్ధ రామయ్య , జాబితాలో ఏఐసీసీ అగ్రనేతలు కూడా**




హైదరాబాద్: ఆంధ్రప్రదేశ్ ఎన్నికలకు స్టార్ క్యాంపెయినర్‌గా సీఎం రేవంత్‌రెడ్డికి బాధ్యతలు ఇవ్వాలని ఏఐసీసీ యోచిస్తున్నది. ఆయనతోపాటు కర్ణాటక సీఎం సిద్ధరామయ్యను నియమించనుంది. ఆ జాబితాల్లో ఏఐసీసీ అగ్రనేతలు ఉండనున్నారు. ఏపీలో జరగబోయే ఎన్నికల్లో తెలంగాణ, కర్ణాటక ముఖ్యమంత్రులు ప్రచారం చేయనున్నారు.ఎన్నికల్లో క్రియాశీలక పాత్ర పోషిస్తారని ఇప్పటికే ఢిల్లీ పెద్దలు, ఆ రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షులు వైఎస్ షర్మిలారెడ్డికి సమాచారం పంపినట్టు తెలిసింది. ఇప్పటికే ఆమె పలు దఫాలుగా రేవంత్‌తో భేటీ అయిన విషయం తెలిసిందే. ఏపీ ఎన్నికల్లోనూ తన సహకారం ఉంటుందని గతంలోనే రేవంత్‌రెడ్డి స్పష్టత ఇచ్చారు. ఇప్పుడు నేరుగా ఏపీ ఎన్నికల రంగంలోకి దిగేందుకు సిద్ధమయ్యారు. స్టార్ క్యాంపెయినర్లుగా ఇప్పటి వరకు ఏఐసీసీ నుంచి ఎలాంటి ఆదేశాలు రాకపోయినా, త్వరలోనే ఆయన పేరును ప్రకటించనున్నట్టు జోరుగా ప్రచారం జరుగుతున్నది. ఏపీలో ఆయనకు వివిధ పార్టీలకు చెందిన కీలక నేతలు, కార్యకర్తలతోనూ సత్సంబంధాలు ఉన్నాయి. తెలుగుదేశంలో ఉన్న సమయంలో ఆ రాష్ట్రానికి చెందిన నేతలతో స్నేహం కూడా ఉన్నది. సీఎం హోదాలో పాత పరిచయాలను సమన్వయం చేసుకుంటూ ఏపీ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపు కోసం ఆయన పావులు కదుపుతున్నారు. వైఎస్ఆర్‌సీపీ, టీడీపీ, జనసేన పార్టీల్లో టికెట్ దక్కని నేతలంతా కాంగ్రెస్ గూటికి చేరే అవకాశాలున్నాయని ఆ వర్గాలు చెబుతున్నాయి. ఉమ్మడి అనంతపురం, కడప, చిత్తూరు జిల్లాలకు చెందిన వ్యాపారస్తులు, రాజకీయ నాయకులంతా ఎక్కువగా బెంగళూరులోనే నివసిస్తుంటారు. వ్యాపారాలు, ఇతర పనుల నిమిత్తం బెంగళూరుకు రాకపోకలు ఎక్కువగా సాగిస్తుంటారు. వారితో కర్నాటక సీఎం సిద్దరామయ్యకు మంచి సంబంధాలున్నాయి. ఈ క్రమంలో చాలా మంది ఆయనకు సన్నిహితులుగా ఉన్నట్టు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. దీంతో స్టార్ క్యాంపెయినర్‌గా ఆయా ఉమ్మడి జిల్లాల్లో ఆయన్ను నియమించాలని ఏఐసీసీ సూత్రపాయ నిర్ణయం తీసుకున్నట్టు ఆ పార్టీకి చెందిన ఓ నేత తెలిపారు. కర్ణాటకలో కాంగ్రెస్ విజయం సాధించిన తర్వాత తెలంగాణలోనూ తప్పనిసరిగా గెలుస్తామనే విశ్వాసం నెలకింది. దీంతో వివిధ సర్వేలు చేస్తూ, వ్యూహాత్మకంగా వ్యవహరిస్తూ ఇక్కడ కూడా కాంగ్రెస్ జెండా ఎగురవేశారు. అయితే తెలంగాణ రాష్ట్రంలో అధికారాన్ని హస్తగతం చేసుకునేందుకు కర్ణాటక ప్రభుత్వం నెల రోజుల పాటు హైదరాబాద్‌లోనే మకాం వేసి సంపూర్ణంగా పని చేసింది. సీఎం సిద్ధరామయ్య, డిప్యూటీ సీఎం డీకే శివకుమార్‌తోపాటు పలువురు క్యాబినేట్ మంత్రులు బీఆర్ఎస్ తప్పిదాలన్నీ ప్రజలకు వివరించేందుకు శ్రమించారు. కర్ణాటకలోని గ్యారంటీలను వివరిస్తూ ప్రజలకు భరోసా కల్పించారు. ప్రజలంతా కాంగ్రెస్ వైపు మద్దతు ఇవ్వడంతో ఇక్కడ కూడా అధికారంలోకి వచ్చింది. ఇప్పుడు ఈ రెండు ప్రభుత్వాలు ఏపీలోనూ అధికారంలోకి వచ్చేందుకు తమదైన శైలిలో కృషి చేయను న్నాయి. కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల్లో అనుసరించిన విధంగానే ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రానికి ఎంత వరకు ఉపయోగపడుతుందో వేచిచూడాల్సిందే.

# ఉద్యోగస్తులకు ఒకటో తేదీనే జీతాలు

**గత ప్రభుత్వ హయాంలో జీతాల కోసం ఎదురు చూపులు : డిప్యూటీ ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క**



ఎర్రుపాలెం: బీఆర్ఎస్ పాలనలో ప్రభుత్వ ఉద్యోగులకు సరైన సమయానికి జీతాలు అందక పలు ఇబ్బందు లు పడ్డారని, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన అనంతరం రాష్ట్రంలో ఉన్న ఆర్థిక పరిస్థితులను అధిగమించి ఒకటవ తేదీనే ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు అందిస్తున్నామని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపారు.

ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం మండలం భీమవరం గ్రామంలోని పూర్ణ చంద్రారెడ్డి గృహంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో భట్టి మాట్లాడారు. మార్చి ఒకటో తేదీన 3,65,262 మంది రెగ్యులర్ ఉద్యోగులకు, 2 లక్షలా 85 వేల మంది పెన్షన్‌దారులకు వేతనాలను వారి ఖాతాల్లో జమ చేశామన్నారు. సంక్షేమ పథకా లు, ఆరు గ్యారంటీల హామీల అమలులో అలసత్వం లేకుండా

ఉద్యోగులు పారదర్శకంగా, బాధ్యతాయు తంగా పని చేయాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో నిరుద్యోగ యువతీ యువకులకు ఉద్యోగ నియామకాల కోసం టీఎస్పీ ఎస్సీనీ ప్రక్షాళన చేశామన్నారు.

ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగాలన్నీ భర్తీ చేస్తామని హామీ ఇచ్చిన మూడు నెలల్లోనే 25 వేల ఉద్యోగాలను భర్తీ చేస్తున్నామని తెలిపారు. గ్రూప్-1, డీఎస్సీ తదితర ఉద్యోగాల కోసం ఈ ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం నోటిఫికేషన్ విడుదల చేస్తామన్నారు. పోటీ పరీక్షలకు సిద్ధం కావడానికి పేద, మధ్య తరగతి నిరుద్యోగ యువతీ యువకులు హైదరాబాద్‌కు వచ్చి లక్షల రూపాయలు వెచ్చించే ఆర్థిక స్తోమత లేనందున వారికి వెసులు బాటు కల్పించడం కోసం రాష్ట్ర ప్రభుత్వం 119 నియోజకవర్గాల్లో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ నాలెడ్జి కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు.

వాటి భవన నిర్మాణాలకు నిధులు మంజూరు చేయడం జరిగిందని, మరి కొద్ది రోజుల్లోనే శంకుస్థాపన చేయనున్నట్టు చెప్పారు. రాష్ట్ర రాజధాని హైదరాబాద్ నగరం నడిబొడ్డున ఉన్న జ్యోతిరావుపూలే ప్రజాభవన్ నందు అద్భుతమైన స్టూడియో నిర్మించి నిష్ణాతులైన లెక్చరర్లలతో ఆన్‌లైన్ ద్వారా కోచింగ్ సెంటర్ ఏర్పాటు చేస్తామన్నారు.

కోచింగ్‌కు సంబంధించి టైం టేబుల్ ముందుగానే ప్రకటించి దానికి అనుగుణంగా తరగతులు నిర్వహిస్తామ న్నారు. సమావేశంలో డీసీసీబీ డైరెక్టర్ ఐలూరి వెంకటేశ్వర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి, నాయకులు బండారు నరసింహారావు, శీలం శ్రీనివాసరెడ్డి, అనుమోలు వెంకటకృష్ణారావు, తలపురెడ్డి నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పెండింగ్ బిల్లులను మంజూరు చేయాలి

**- సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ పునరుద్ధరించాలి : టీఎస్‌యూటీఎఫ్ డిమాండ్**




హైదరాబాద్: రాష్ట్రంలోని ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లకు సంబంధించిన పెండింగ్ బిల్లులను వెంటనే మంజూరు చేయాలని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్‌యూటీఎఫ్) రాష్ట్ర కమిటీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఖజానా కార్యాలయాల్లో ఆమోదం పొంది ఆర్థిక శాఖ వద్ద రెండేండ్లుగా పెండింగ్‌లో ఉన్న మెడికల్ రీయింబర్స్‌మెంట్, జీపీఎఫ్, టీఎస్‌జీఎల్ఐ, పీఆర్సీ, డీఏ బకాయిలు, సప్లిమెంటరీ జీతాలు, పెన్షన్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని కోరింది. టీఎస్‌యూటీఎఫ్ ఆఫీస్ బేరర్ల సమావేశాన్ని ఆదివారం హైదరాబాద్‌లో ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కె జంగయ్య అధ్యక్షతన నిర్వహిం చారు. అనంతరం అధ్యక్షులు కె జంగయ్య, ప్రధాన కార్యదర్శి చావ రవి ఒక ప్రకటన విడుదల చేశారు. గత ఆర్థిక సంవత్సరానికి చెందిన బిల్లులు మంజూరు కాకపోవటం వల్ల ఈ ఆర్థిక సంవత్సరంలో గత ఏప్రిల్ తర్వాత రీవ్యాలిడేషన్ లేదా తిరిగి సమర్పించాల్సి వచ్చిందని తెలిపారు. ఈ నెలాఖరులోగా మంజూరు కాకపోతే మళ్లీ అదే పరిస్థితి పునరావృతం అయ్యే ప్రమాదముందని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టోలో పేర్కొన్న విధంగా పెండింగ్ బిల్లులన్నీ మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్దరించాలని కోరారు. మూడు వాయిదాల డీఏ బకాయిలను విడుదల చేయాలని తెలిపారు. పదోన్నతులు, బదిలీలకు గల ఆటంకాల తొలగింపునకు చొరవ తీసుకోవాలని పేర్కొన్నారు. ప్రభుత్వ స్థలాలు, సొమ్ముతో ప్రయివేటు యాజమాన్యంలో పబ్లిక్ పాఠశాలల ఏర్పాటు సరైంది కాదనీ, ఇది విద్యా ప్రయివేటీకరణను ప్రోత్సహిస్తుందనీ, ఈ ఆలోచనను విరమించుకోవాలని డిమాండ్ చేశారు. మోడల్ స్కూల్, గురుకుల ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులను నూతన నియామకాలకు ముందుగానే పూర్తి చేయాలని కోరారు. ఆ ఉపాధ్యాయులపై బోధనేతర పనుల భారం తగ్గించాలని సూచించారు. కేజీబీవీ, యూఆర్ఎస్, సమగ్ర శిక్ష ఉద్యోగులకు బేసిక్ పే ఇవ్వాలని తెలిపారు. మెగా డీఎస్సీ ప్రకటన, విద్యాకమిషన్ ఏర్పాటు, 317 జీవో సమస్యలపై మంత్రివర్గ ఉపసంఘం నియామకాన్ని ఆహ్వానిస్తున్నామని పేర్కొన్నారు. ఈనెల తొమ్మిది, పది తేదీల్లో హైదరాబాద్‌లో టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కార్యాలయంలో రాష్ట్ర కమిటీ వార్షిక విస్తృత సమావేశాలను నిర్వహిస్తున్నామనీ, రాష్ట్ర విద్యారంగం అభివృద్ధిపై విస్తృతంగా చర్చించాలని తీర్మానించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు సిహెచ్ రాములు, సిహెచ్ దుర్గాభవాని, కోశాధికారి టి లక్ష్మారెడ్డి, కార్యదర్శులు కె సోమశేఖర్, ఎం రాజశేఖర్‌రెడ్డి, ఎ వెంకట్, ఈ గాలయ్య, డి సత్యానంద్, జి నాగమణి, బి రాజు, ఎస్ మల్లారెడ్డి, కె రవికుమార్, ఎస్ రవిప్రసాద్‌గౌడ్, ఎ సింహాచలం, వై జ్ఞానమంజరి, పి మాణిక్ రెడ్డి, మహబూబ్ అలీ తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణలో మరో జర్నలిస్టు సంఘం ఆవిర్భావం

హైదరాబాద్: తెలంగాణలో మరో జర్నలిస్టు సంఘం ఆవిర్భావించింది. ఆదివారం హైదరాబాద్ నాంపల్లి టీఎన్జీవోస్ భవన్‌లో హైదరాబాద్ తో పాటు 10 ఉమ్మడి జిల్లాల జర్నలిస్ట్ ముఖ్యనేతలు సమావేశమయ్యారు.10 టీవీ జర్నలిస్ట్ కొండల్ గౌడ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జర్నలిస్టు యూనియన్ ఆఫ్ స్టేట్ తెలంగాణ(జేయూఎస్టీ) ఏర్పడింది. సంఘం కన్వీనర్‌గా ఎంవీ రమణ, కో కన్వీనర్లుగా పీ.వీ శ్రీనివాస్, జమాల్పూర్ గణేష్, బిజిగిరి శ్రీనివాస్, శశికాంత్ , మల్లీశ్వరి, నాంపల్లి మురళి, సలహాదారుగా కొండల్ రావు ఎన్నికయ్యారు. గుంటిపల్లి వెంకట్ స్టేట్ కో కన్వీనర్‌తో పాటు వరంగల్ ఉమ్మడి జిల్లా ఇన్ ఛార్జిగా వ్యవహరిస్తారు..

స్టేట్ అడ్ హక్ కమిటీ సభ్యులుగా కొండల్ గౌడ్(హైదరాబాద్), గోపాలకృష్ణ(కరీంనగర్), డి.నర్సింహచారి (నిజామాబాద్), లక్ష్మీనారాయణ(రంగారెడ్డి), బస్వరాజు(మహబూబ్ నగర్), యోగనంద్ రెడ్డి(మెదక్), క్రాంతి(నల్గొండ), రాజేష్(ఆదిలాబాద్) ఎన్నికయ్యారు. జర్నలిస్టుల సంక్షేమం, సమస్యల సాధన కోసం పని చేస్తూనే ప్రజల గొంతుకగా నిలుస్తామని కన్వీనర్ రమణ ఈ సందర్భంగా తెలిపారు.

# ఈనెల 15 నుంచి ఒంటిపూట బడులు

**- విద్యాశాఖ నిర్ణయం**

హైదరాబాద్: రాష్ట్రంలోని ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రయివేటు యాజమాన్యాల్లోని అన్ని పాఠశాలల్లో ఈనెల 15 నుంచి ఒంటిపూట బడులు ప్రారంభించాలని విద్యాశాఖ నిర్ణయించినట్టు తెలిసింది. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులు త్వరలోనే విడుదలయ్యే అవకాశమున్నది. రాష్ట్రంలో ఇప్పటికే ఎండల తీవ్రత పెరిగిన విషయం తెలిసిందే. విద్యార్థులకు ఇబ్బంది కలగకూడదనే ఉద్దేశంతో ఈనెల 15 నుంచి ఒంటిపూట బడులను నిర్వహించాలని విద్యాశాఖ నిర్ణయించినట్టు సమాచారం. ఈ క్రమంలో ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు ఒంటిపూట బడులు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు జరుగుతాయి. విద్యార్థులకు మధ్యాహ్నం 12.30 గంటలకు మధ్యాహ్న భోజనం అందిస్తారు. ఆ తర్వాత వారు ఇంటికి వెళ్తారు. పదో తరగతి పరీక్షా కేంద్రాలుండే బడుల్లో మాత్రం మధ్యాహ్న ఒంటిగంట నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు తరగతులను నిర్వహిస్తారు. రాష్ట్రంలో పదో తరగతి విద్యార్థులకు వార్షిక పరీక్షలు ఈనెల 18 నుంచి వచ్చేనెల రెండో తేదీ వరకు జరుగుతాయి. ప్రస్తుత విద్యాసంవత్సరంలో ఏప్రిల్ 23వ తేదీ పాఠశాలలకు చివరి పనిదినమని ప్రభుత్వం అకడమిక్ క్యాలెండర్‌లో ప్రకటించిన విషయం తెలిసిందే. ఏప్రిల్ 24 నుంచి జూన్ 11 వరకు వేసవి సెలవులుంటాయి.



# పొలానికి ట్యాంకర్ నీరే దిక్కు..
# పంటలు ఎండుతున్నాయని అన్నదాతల ఆందోళన

### ప్రత్యామ్నాయం వైపు పరుగు
### నల్లగొండ జిల్లాలోఆగమాగం



రామన్నపేట, మార్చి 4 : ఉమ్మడి నల్లగొండ జిల్లాలో సాగు నీరు లేక పంటలు ఎండిపోతుండటంతో రైతులు ఆగమాగం అవుతున్నారు. ప్రత్యామ్నాయం వైపు పరుగులు పెడుతున్నారు. వేలాది రూపాయలు వెచ్చించి ట్యాంకర్ల ద్వారా నీటిని తెప్పించి పొలాలకు పట్టిస్తున్నారు. నాగార్జునసాగర్ ఆయకట్టు పరిధిలోనూ సాగునీటికి కష్టంగా మారింది. నల్లగొండ జిల్లా త్రిపురారం మండల కేంద్రానికి చెందిన నగిరి శ్రీనివాస్ తనకున్న నాలుగు ఎకరాల్లో వరి సాగు చేశాడు. బావి, బోరు ఉన్నా నీళ్లు సరిపోక నెల క్రితం పొలంలో మరో బోరు వేశాడు. రెండు బోర్లు, బావి ఉన్నా నీళ్లు అందక ఎకరం పొలం ఎండిపోతున్నది. ఈ క్రమంలో బెజ్జికల్ గ్రామానికి చెందిన రైతుకు రూ.2 వేలు చెల్లించి ఆదివారం ట్యాంకర్ నీటిని తెప్పించి పొలానికి పోయించాడు.

10 గుంటల మడికి ఐదు ట్యాంకర్ల నీరు పట్టాయని, అందుకు రూ.10 వేలు చెల్లించినట్టు రైతు శ్రీనివాస్ తెలిపాడు. ఎకరం పొలం తడవాలంటే దాదాపు 15 ట్యాంకర్ల నీరు అవసరమని ఆయన పేర్కొన్నాడు. అదీకాక ఉదయం నుంచి సాయంత్రం వరకు నడి ఎండలో కాపుకాసుకుంటూ పొలంలో ఉండాల్సి వస్తున్నదని ఆవేదన వ్యక్తం చేశాడు. గ్రామంలో మొదటి సారిగా ట్యాంకర్ ద్వారా తానే నీటిని పోయించాని తెలిపాడు. పంట చేతికొచ్చే సమయంలో నీళ్లు లేక పంటలు ఎండిపోతున్నాయని, ఇకనైనా ప్రభుత్వం స్పందించి సాగర్ ఎడమ కాల్వకు నీళ్లందించాలని కోరుతున్నాడు.

నిమ్మ తోటకూ ట్యాంకర్ నీరే..

నల్లగొండ జిల్లా చిట్యాల మండలం పెద్దకాపర్తికి చెందిన రైతు గంట్ల రవీందర్‌రెడ్డి తన ఎకరంన్నర నిమ్మతోట నీళ్లు లేక ఎండిపోయే దశకు వచ్చింది. దాంతో ట్యాంకర్ ద్వారా నీళ్లు పెట్టి తోటను కాపాడే ప్రయత్నం చేస్తున్నాడు. దీనికోసం వారానికి రూ. 6,600 ఖర్చు చేస్తున్నట్టు రైతు తెలిపాడు. అదే రైతు 7 ఎకరాల్లో వరి వేయగా నీటి కొరత కారణంగా 3 ఎకరాలకు మాత్రమే నీరందుతుందని, మిగిలిన 4 ఎకరాలు ఎండి పోయిందని ఆవేదన వ్యక్తం చేశాడు.

రామన్నపేట మండలంలోనూ..

యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలంలోనూ కరువు పరిస్థితులు నెలకొన్నాయి. ఆసిఫ్‌నెహర్ కాల్వ ద్వారా నీళ్లు రాకపోవడం, భూగర్భ జలాలు అడుగంటి పోవడంతో బోరు, బావులు నీళ్లు పోయడం లేదు. దాంతో రైతులు పొట్ట దశకు వచ్చిన వరి పొలాలను కాపాడుకునేందుకు అష్టకష్టాలు పడుతున్నారు. కొందరు రైతులు పొలాలకు ట్యాంకర్ల ద్వారా నీటిని అందించి తడుపుతున్నారు.

ఆదివారం రామన్నపేట మండలం బోగారంలో రైతు ధనుంజయ రెండున్నర ఎకరాల్లో వరి సాగు చేయగా నీళ్లు లేక పొలం ఎండిపోయే దశకు వచ్చింది. దాంతో పంటను కాపాడుకోవడానికి 20 రోజులుగా ట్యాంకర్ ద్వారా నీటిని అందిస్తున్నాడు. రోజుకు రూ.2,500 ట్యాంకర్‌కే ఖర్చు చేస్తున్నట్టు ఆవేదన వ్యక్తం చేశాడు.

# ఎంపీ, ఎమ్మెల్యేలకు లంచాల కేసుల్లో సంచలన
# తీర్పు వెలువరించిన సుప్రీంకోర్టు




హైదరాబాద్: ఎంపీలు, ఎమ్మెల్యేలకు లంచాల కేసుల్లో సుప్రీంకోర్టు ధర్మాసనం సంచలన తీర్పును వెలువరించింది. లంచం కేసుల్లో ఎంపీలు, ఎమ్మెల్యేలకు మినహాయింపు లేదని సీజేఐ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని న్యాయమూర్తులు ఏఎస్ బోపన్న, ఎంఎం సుందరేష్, పీఎస్ నరసింహ, జేబీ పార్దివాలా, సంజయ్ కుమార్, మనోజ్ మిశ్రాలతో కూడిన ఏడుగురు సభ్యుల ధర్మాసనం ఏకగ్రీవంగా తీర్పును వెలువరించింది. గతంలో ఐదుగురు సభ్యుల ధర్మాసనం ఇచ్చిన తీర్పును తాజాగా సుప్రీంకోర్టు కొట్టివేసింది. అసెంబ్లీ, పార్లమెంట్ లో లంచాలకు పాల్పడే ప్రజాప్రతినిధులు విచారణ ఎదుర్కోవాల్సిందేనని ఏడుగురు సభ్యుల ధర్మాసనం స్పష్టం చేసింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 194(2), ఆర్టికల్ 105(2) ప్రకారం సభలో చేసిన ఏ ప్రసంగం లేదా ఓటువేసినా క్రిమినల్ ప్రాసిక్యూషన్‌కు వ్యతిరేకంగా పార్లమెంటు సభ్యులకుఉన్న మినహాయింపు ఇక చెల్లదని సుప్రీంకోర్టు తెలిపింది. 1998లో ఐదుగురు న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనం.. పీవీ నరసింహారావు వర్సెస్ సీబీఐ కేసులో ఇచ్చిన మెజారిటీ తీర్పును సుప్రీంకోర్టు పునః సమీక్షించింది. పీవీ నరసింహారావు కేసు తీర్పుతో మేము విభేదిస్తున్నాం. ఓటు లేదా ప్రసంగం కోసం లంచం తీసుకున్నారనే ఆరోపణలపై శాసనసభ్యుడికి మినహాయింపునిస్తూ పీవీ నరసింహారావు కేసులోని తీర్పు విస్తృతమైన పరిణామాలను కలిగి ఉంది. దీన్ని రద్దు చేస్తున్నామని, శాసన విధులను నిర్వర్తించడానికి అటువంటి ఎమ్మెల్యేలు, ఎంపీలకు మినహాయింపులు అవసరం లేదని ఏడుగురు సభ్యుల ధర్మాసనం పేర్కొంది. లంచం తీసుకొని శాసన సభ, పార్లమెంట్ లో మాట్లాడటం, ఓటు వేయడం నెరపురిత చర్య. ప్రజాప్రతినిధి లంచం తీసుకోవటం నేరం. పీవీ నర్సింహ తీర్పు ఆర్టికల్స్ 105/194కు విరుద్ధం అని సుప్రీంకోర్టు పేర్కొంది. లంచం పార్లమెంటరీ అధికారాల ద్వారా రక్షించబడదు. శాసన అధికారాల ఉద్దేశం, లక్ష్యం తప్పనిసరిగా గుర్తుంచుకోవాలి. అధికారాలు సమిష్టిగా చట్టసభకు ఉంటాయి. ఆర్టికల్ 105/194 సభ్యులకు నిర్భయ వాతావరణాన్ని సృష్టించడానికి ప్రయత్నిస్తుందని సుప్రీంకోర్టు పేర్కొంది. అవినీతి, శాసనసభ్యుల లంచం భారత పార్లమెంటరీ ప్రజాస్వామ్య పనితీరును నాశనం చేస్తుంది. రాజ్యసభ ఎన్నికల్లో ఓటు వేయడానికి లంచం తీసుకుంటున్న ఎమ్మెల్యేలు అవినీతి నిరోధక చట్టం కింద కూడా బాధ్యులవుతారని సుప్రీంకోర్టు తీర్పులో పేర్కొంది.

# మద్దతు ధర మహాప్రభో..
# పంటలను అమ్ముకునేందుకు అన్నదాతల ఆగచాట్లు!

### మార్కెట్‌లో అన్నదాత దగా
### కష్టాల్లో పత్తి, మిర్చి, పల్లి రైతులు
### ఆగ్రహంతో రోడ్డెక్కి ధర్నాలు
### ఉలుకూ పలుకూలేని సర్కారు
### బోనస్ ధరపై కాంగ్రెస్ యూటర్న్



హైదరాబాద్, మార్చి 4: మొన్నటివరకు పంటలను దర్జాగా మద్దతు ధరకు అమ్ముకున్న రైతులు ఇప్పుడు అదే మద్దతు ధర కోసం రోడ్డెక్కాల్సిన దుస్థితి. తమ పంటలను అమ్ముకునేందుకు నానా ఆగచాట్లు. మార్కెట్లలో పడిగాపులు. నిత్యం ఎక్కడో ఒకచోట ఆందోళనలు, ధర్నాలు. ముఖ్యంగా పత్తి, మిర్చి, వేరుశనగ రైతుల ఆగ్రహం కట్టలు తెంచుకుంటున్నది.

మార్కెట్లకు తెచ్చిన పంటకు ఆశించిన ధర దక్కకపోవడం, మద్దతు ధర కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోకపోవడంతో ఆగ్రహంతో రగిలిపోతున్నారు. పలు జిల్లాల్లో రైతులు తమ పంటలను కొనుగోలు చేయాలని రోడ్డెక్కి ధర్నాలు చేస్తున్నారు. మూడు రోజుల క్రితం మిర్చి రైతులు ఖమ్మంలో ధర్నా చేశారు. కేసముద్రం, మహబూబాద్ మార్కెట్‌లలో మిర్చి పంటను కొనుగోలు చేయకుండా అధికారులు, వ్యాపారులు రైతులను ఇబ్బంది పెడుతున్నారు. వేరుశనగకు గిట్టుబాట ధర కల్పించాలంటూ అచ్చంపేట, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్‌లో రైతులు రొడ్డెక్కారు. పత్తిని కొనుగోలు చేయకుండా సీసీఐ అధికారులు ఇబ్బంది పెడుతున్నారంటూ ఆదిలాబాద్‌లో రైతులు ఆందోళన చేశారు. పత్తికి మద్దతు ధర చెల్లించడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. ఇంత జరుగుతున్నా రాష్ట్ర ప్రభుత్వంలో కదలిక కనిపించడం లేదు. రైతుల ఆక్రందన అరణ్యరోదనగానే మిగిలిపోతున్నది.

బోనస్ ధర ఏమైంది?

తాము అధికారంలోకి వస్తే రైతులు పండించే ప్రతి పంటను కొనుగోలు చేస్తామని, 10 రకాల పంటలకు మద్దతు ధరతోపాటు క్వింటాలుకు రూ.300 నుంచి రూ.500 బోనస్ ఇస్తామని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టోలో పేర్కొన్నది. కానీ, బోనస్ ధర ఇప్పటికీ అమలులోకి రాలేదు. కనీసం పంటలకు మద్దతు ధర కూడా దక్కడం లేదు. ఇప్పటికే ధాన్యానికి మద్దతు ధరపై ఆ పార్టీ సీనియర్ నేత కోదండరెడ్డి నాలుక మడతేశారు.

ధాన్యం ధర మద్దతు ధరకు తక్కువ ఉంటేనే బోనస్ ఇస్తామని, మద్దతు ధర దక్కితే బోనస్ ఇవ్వబోమని తేల్చి చెప్పారు. తాజాగా వ్యవసాయ శాఖ మంత్రి కూడా ఇదే విధంగా వ్యవహరించడం గమనార్హం. కాంగ్రెస్ ఇస్తామన్న బోనస్ గురించి మాట్లాడకుండా, మద్దతు ధర కోసం కేంద్ర సంస్థలకు లేఖలు రాస్తున్నారు. అంటే బోనస్ ఇవ్వబోమని పరోక్షంగా చెప్పారనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కాంగ్రెస్ ఇచ్చిన హామీ ప్రకారం మిర్చి, పత్తి, పసుపు పంటలకు బోనస్ కల్పిస్తే రైతులు పడుతున్న ఇబ్బందులు ఎంతోకొంత తీరుతాయి. కానీ ప్రభుత్వం ఆ దిశగా చర్యలు మొదలుపెట్టకపోవడం బాధాకరం.

# భూ సమస్య పరిష్కరించాలని.. పురుగుల మందు
# డబ్బాతో మహిళ హల్‌చల్



జోగులాంబ గద్వాల : రెవెన్యూ అధికారులు తన భూమిని ప్రభుత్వ భూమిగా రికార్డులో ఎక్కించారని, దాని తొలగించాలని కోరుతూ ఓ మహిళ పురుగుల మందు డబ్బాతో కలెక్టరేట్‌లో హల్‌చచేసింది. గమనించిన పోలీసులు ఆమెను అడ్డుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. జోగులాంబ గద్వాల జిల్లా వడ్డేపల్లి మండలం రామపురం చెందిన గోకారి బికి సర్వే నంబర్ 416 లో ఎరం భూమి ఉంది. అయితే దానిని ప్రభుత్వ భూమిగా రికార్డులోకి అధికారులు ఎక్కించారు.

తన భూమిని అధికారులు తప్పుగా ప్రభుత్వ భూమిగా రాశారని, దానిని నా పేరు మీద మార్చాలని ఎన్నిసార్లు తహసిల్దార్, అదనపు కలెక్టర్ కార్యాలయాల చుట్టూ తిరిగినా పట్టించుకోవడంలేదని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు.

సోమవారం తన భూమిని తన పేర ఎక్కించాలని కోరుతూ కలెక్టర్ కార్యాలయం ఆవరణలోని అదనపు రెవెన్యూ కలెక్టర్ కార్యాలయం ముందు గో కార్ బి పురుగుల మందును సేవించడానికి ప్రయత్నించారు. గమనించిన పోలీసులు అడ్డుకున్నారు. బాధిత మహిళకు న్యాయం చేస్తామని అధికారులు చెప్పారు.

# బోధన్ బీసీ హాస్టల్‌లో దారుణం.. విద్యార్థుల మధ్య
# ఘర్షణ డిగ్రీ విద్యార్థి మృతి




హైదరాబాద్ : నిజమాబాద్ జిల్లా దారుణం చోటు చేసుకుంది. విద్యార్థుల జరిగిన ఘర్షణ ఓ నిండు ప్రాణాన్ని బలి తీసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. జిల్లాలోని గాంధారి మండలం తిప్పారి తండాకు చెందిన వెంకటేష్(23) బోధన్‌లోని బీసీ హాస్టల్‌లో ఉంటూ చదువుతున్నాడు. ఈ క్రమంలో వెంకటేష్ పరీక్షలు ఉన్నందున చదువుకోవాలని విద్యార్థులకు సూచించాడు.

దీంతో ఇంటర్ విద్యార్థులు, వెంకటేష్ మధ్య మాట మాట పెరిగి ఘర్షణకు దిగారు. వెంకటేష్‌ను ఇంటర్ విద్యార్థులు గొంతు నులిమి హత్య చేశారు.

సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం ప్రభుత్వ దవాఖానకు తరలించారు. ఆరుగురిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. వెంకటేష్ మృతితో తండాలో విషాదం నెలకొంది.

# కొత్తకోట వద్ద చెట్టును ఢీకొట్టిన కారు.. ముగ్గురు
# చిన్నారులు సహా ఐదుగురు దుర్మరణం



వనపర్తి: వనపర్తి జిల్లా కొత్తకోట వద్ద ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. సోమవారం తెల్లవారుజామున కొత్తకోట వద్ద జాతీయ రహదారిపై వేగంగా దూసుకొచ్చిన ఓ కారు అదుపుతప్పి చెట్టును ఢీకొట్టింది. దీంతో కారులో ప్రయాణిస్తున్న వారిలో ఐదుగురు అక్కడికక్కడే మృతిచెందారు. మరో ఆరుగురు తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు.

క్షతగాత్రులను దవాఖానకు తరలించారు. వారిలో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉందని చెప్పారు. మృతుల్లో ముగ్గురు చిన్నారులు ఉన్నారని తెలిపారు. బళ్లారి నుంచి హైదరాబాద్ వస్తుండగా ప్రమాదం జరిగిందని వెల్లడించారు. చనిపోయినవారిని వాసి(1), బుస్రా (2), మరియా (4), ఫాతిమా (50), అబ్దుల్ రెహమాన్ (30)గా గుర్తించారు. నిద్రమత్తు, అతివేగమే ప్రమాదమని కారణమని ప్రాథమికంగా నిర్ధారించారు. ఈ ఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

# కొడంగల్‌లో మెడికల్ కాలేజీ కోసం పేదల
# అసైన్డ్ భూములు గుంజుకుంటారా?



హైదరాబాద్, మార్చి 4: మెడికల్ కళాశాల ఏర్పాటు కోసం పేదలకు చెందిన అసైన్డ్ భూములను స్వాధీనం చేసుకోవాలనే యోచనను ప్రభుత్వం విరమించుకోవాలని మానవ హక్కుల వేదిక డిమాండ్ చేసింది. వికారాబాద్ జిల్లా కొడంగల్ మండలం అప్పాయిపల్లిలో మెడికల్ కాలేజీ ఏర్పాటు నిర్ణయాన్ని తక్షణమే మార్చుకోవాలని కోరింది. మానవ హక్కుల వేదిక ఉభయ రాష్ట్రాల సమన్వయకర్త వసంత లక్ష్మి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తిరుపతయ్య నేతృత్వంలోని కమిటీ ఆదివారం అప్పాయిపల్లిలోని బాధితులను కలిసి వివరాలను సేకరించింది. గ్రామంలోని సర్వే నంబర్ 19లో 75 ఎకరాల భూమిని 1972లో 47 కుటుంబాలకు నాటి ప్రభుత్వం అసైన్డ్ పట్టాలు అందించిందని వారు పేర్కొన్నారు. మూడు తరాలుగా ఆ భూమిపై ఆధారపడి 150 నిరుపేద కుటుంబాలు జీవిస్తున్నాయని తెలిపారు. మెడికల్ కాలేజీ కోసం ప్రభుత్వం ఆ భూమిని సేకరించడం అన్యాయమని విమర్శించారు. ఒక్క నియోజకవర్గం కోసమే మెడికల్ కాలేజీ ఏర్పాటు చేయాలనే రేవంత్‌రెడ్డి ప్రభుత్వ ఆలోచనే పెద్ద తప్పు అని, దాని ద్వారా ఆ ప్రాంత ప్రజలకుగానీ, విద్యార్థులకుగానీ ఎటువంటి ప్రయోజనం కలగబోదని స్పష్టం చేశారు. కొడంగల్ పరిసరాల్లో వందలాది ఎకరాల ప్రభుత్వ భూమి అందుబాటులో ఉన్నదని, అక్కడ నిమ్స్ లాంటి సూపర్ స్పెషాలిటీ దవాఖాన కట్టాలని సూచించారు. కార్యక్రమంలో వేదిక ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా కన్వీనర్ బొల్లి ఆదంరాజు, హైదరాబాద్ నగర ప్రధాన కార్యదర్శి సంజీవ్, వెంకటనారాయణ, రోహిత్, మధు పాల్గొన్నారు.

# స్వీయ ఆత్మరక్షణ.. అరుదైన ఘనత

### – రాష్ట్ర, జిల్లా న్యాయ సేవాధికార సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో.. 11 వేల మందికి ఒకే సారి శిక్షణ..
### – లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో నమోదు

కంఠేశ్వర్: తెలంగాణ రాష్ట్ర, నిజామాబాద్ జిల్లా న్యాయ సేవాధికార సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని గిరిరాజ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో విద్యార్థినీలకు నిర్వహించిన స్వీయ ఆత్మరక్షణ శిక్షణా కార్యక్రమం అరుదైన ఘనతను సొంతం చేసుకుంది. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలకు చెందిన విద్యార్థినులతో పాటు వివిధ శాఖల్లో విధులు నిర్వర్తిస్తున్న మహిళా ఉద్యోగినులు వేలాదిగా శిక్షణా కార్యక్రమంలో పాల్గొనడం రికార్డు సృష్టించింది. ఏక కాలంలో 11 వేల మంది వరకు శిక్షణలో పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించడం ద్వారా 'లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్'లో చోటు దక్కించుకున్నారు. విజయవంతంగా కొనసాగిన ఈ కార్యక్రమాన్ని ప్రత్యక్షంగా వీక్షించిన లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్ ప్రతినిధులు, శిక్షణా తరగతులు ముగిసిన మీదట అవార్డును ప్రకటిస్తూ జిల్లా జడ్జి సునీతా కుంచాలకు మెడల్ బహూకరించారు. లిమ్కా బుక్ ఆఫ్ రికార్డు నమోదు కావడంతో సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి. జిల్లా యంత్రాంగం, జిల్లా పోలీస్ శాఖల తోడ్పాటుతో న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్వీయ ఆత్మరక్షణ శిక్షణ కార్యక్రమంలో నగరంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కేజీబీవీ, రెసిడెన్షియల్, గురుకుల పాఠశాలలకు చెందిన హైస్కూల్ బాలికలు, ఇంటర్మీడియట్, డిగ్రీ కళాశాలలకు చెందిన విద్యార్థినులతో పాటు న్యాయ, అటవీ, వైద్యారోగ్య, పోలీస్ తదితర శాఖల్లో విధులు నిర్వర్తిస్తున్న మహిళా ఉద్యోగినులు సైతం పాల్గొన్నారు.

# రామేశ్వరం కెఫే పేలుడు కేసు దర్యాప్తులో కీలక పరిణామాలు

హైదరాబాద్ : బెంగళూరు బ్రూక్‌ఫీల్డ్‌లోని 'రామేశ్వరం కెఫే పేలుడు' కేసు దర్యాప్తులో కీలక పరిణామాలు చోటు చేసుకొన్నాయి. తాజాగా ఈ కేసును జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ)కు హోంశాఖ అప్పగిస్తూ సోమవారం నిర్ణయం తీసుకొంది.



మరోవైపు బెంగళూరులో పోలీసు దర్యాప్తు బృందాలు నిందితుడు ఏమార్గంలో కెఫేలోకి వచ్చాడు.. బాంబు అమర్చిన తర్వాత ఎలా వెళ్లిపోయాడు అనే అంశంపై దృష్టిపెట్టాయి. ఇప్పటికే ఆ ప్రాంతంలోని దుకాణాలకు అమర్చిన సీసీకెమేరాల రికార్డులను సేకరించాయి. అనుమానితుడు టోపీ పెట్టుకొని, కళ్లజోడు, కర్చీఫ్తో ముఖాన్ని కవర్ చేసుకొన్నట్లు గుర్తించారు. అతడు కెఫే సమీపంలోని రూట్ నంబర్ 500–డి బస్సు దిగినట్లు సీసీకెమేరా దృశ్యాలను సంపాదించారు. పేలుడుకు దాదాపు గంట ముందు 12.56 సమయంలో అతడి కదలికలను గుర్తించారు. శనివారమే కెఫేలోని ఉన్న డిజిటల్ వీడియో రికార్డర్లు కూడా స్వాధీనం చేసుకొన్నారు.

# మాజీ ఎమ్మెల్యేపై గిరి పుత్రుల ఆగ్రహం

## - ఎన్నికల వేళ కొత్త పంచాయితీ..!!

కురుపాం : ఎన్నికల వేళ రాజకీయం కొత్త టర్న్ తీసుకుంటోంది. ఎమ్మెల్యేకు ఇమేజ్ వస్తుందనే కారణంతో అభివృద్ధికి అడ్డుపుతున్న ఒక మాజీ ఎమ్మెల్యే వ్యవహారం ఇప్పుడు వివాదాస్పదంగా మారుతోంది. పార్వతీ మన్యం జిల్లాలోని కురుపాం నియోజకవర్గంలో కొంత కాలంగా చోటు చేసుకుంటున్న పరిణామాలపై స్థానికులు ఆగ్రహంతో రగిలిపోతున్నారు. నిధులు మంజూరు చేయించి అభివృద్ధి పనులు ప్రారంభిస్తుంటే, ఏకంగా ఆ మాజీ ఎమ్మెల్యే బెదిరింపులకు దిగి పనులను అడ్డుకోవటం వివాదస్పదంగా మారుతోంది. అభివృద్ధికి అడ్డుగా: కురుపాం నియోజకవర్గ పరిధిలో అర్నాడ పంచాయితీకి దశాబ్దాల కాలంగా రోడ్లు లేవు. అక్కడ రోడ్డు వేయాలని స్థానికులు ఎప్పటి నుంచో పాలకులను అభ్యర్ధిస్తున్నారు. గత పాలకులు ఈ అంశాన్ని నిర్లక్ష్యం చేస్తూ వచ్చారు.అదే గ్రామం నుంచి ఎమ్మెల్యేగా గెలిచినా అక్కడ మాత్రం అభివృద్ధికి నోచుకోలేదు. తాజాగా జాతీయ ఉపాధి హామీ పథకం కింద రూ 70 లక్షలతో బీటీ రోడ్డుకు ఆమోదం లభించింది. కిలో మీటరు మేర ఈ రోడ్డు శాంక్షన్ అయింది. తమ గ్రామానికి మంచి రోడ్డు కావాలనేది అక్కడి గ్రామస్థుల చిరకాల కల. ఇప్పుడు ఆ కల నెరవేరే సమయం వచ్చింది.



మాజీ ఎమ్మెల్యేపై ఆగ్రహం: కానీ, అన్ని అనుమతులు వచ్చి రోడ్డు ప్రారంభం వేళ మాజీ ఎమ్మెల్యే అడ్డంకులు సృష్టిస్తున్నారు.ఉపాధి హామీ పథకం కింద రోడ్డు మంజూరు అయినా..అక్కడ సర్పంచ్ తో పాటుగా వెండార్లు అనుమతి ఇవ్వాల్సి ఉంటుంది. ఇందుకు సర్పంచ్ తొలుత అనుమతి ఇచ్చారు. దీంతో, రోడ్డు పనులకు స్థానిక ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి కొబ్బరి కాయ కొట్టి పనులు ప్రారంభించారు.అక్కడే అసలు సమస్య మొదలైంది. మాజీ ఎమ్మెల్యే రంగంలోకి వచ్చారు. ఇక రోడ్డు పూర్తవుతుందని భావించిన గ్రామస్థుల ఆశలను నీరు గార్చారు. సర్పంచ్, కాంట్రాక్టర్లను బెదిరించి పనులు ముందుకు సాగకుండా అడ్డుకున్నారని గ్రామస్తులు మండిపడుతున్నారు.

ఎన్నికల వేళ వివాదాస్పదం: ఆ గ్రామానికి రోడ్డు వస్తే గ్రామస్తులు తనకు ఎక్కడ దూరమవుతారో అని ఆ మాజీ ఎమ్మెల్యేలో ఆందోళన కనిపిస్తోంది. దీంతో, ఆ మాజీ ఎమ్మెల్యే పైన గ్రామస్థులు రగిలిపోతున్నారు.సర్పంచ్ తీర్మానం చేయకుండా అడ్డంకులు సృష్టిస్తూ బిల్లులు రావని బెదిరింపులకు దిగుతున్నారు.

మొత్తానికి కొందరి నేతల వల్ల ఈ గ్రామం అభివృద్ధికి దూరమవుతోందని గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పుడు ఎన్నికల సమయంలో ఈ మాజీ ఎమ్మెల్యే తీరు వివాదస్పదంగా మారుతోంది. ఆర్నాడ లో ఈ ఘటన ఇప్పుడు మన్యం జిల్లాలో చర్చనీయాంశంగా మారుతోంది.

# పీకే మాటల్ని నమ్మొద్దన్న సాయిరెడ్డి..అసలు జరిగిందిదే..!

హైదరాబాద్ : ఏపీలో ఎన్నికలు సమీపిస్తున్న వేళ రాజకీయ పార్టీల్లో విజయంపై ఎవరికి వారే ధీమా కనిపిస్తోంది. వచ్చే ఎన్నికల్లో మరోసారి గెలిచి తీరుతామంటూ వైసీపీ, ఈసారి ఎలాగైనా గెలుపు తమదేనంటూ టీడీపీ-జనసేన కూటమి ఎవరికి వారే చెప్పుకుంటున్నారు.

అయితే వాస్తవ పరిస్థితి ఎలా ఉందన్న దానిపై మిశ్రమ స్పందన వస్తోంది. ఇలాంటి తరుణంలో గత ఎన్నికల్లో వైసీపీకి వ్యూహకర్తగా పనిచేసి భారీ విజయాన్ని కట్టబెట్టిన ప్రశాంత్ కిషోర్ తాజాగా చేసిన వ్యాఖ్యలు తీవ్ర సంచలనంగా మారాయి.



హైదరాబాద్ లో నిర్వహించిన ఓ జాతీయ మీడియా సదస్సులో పాల్గొన్న ప్రశాంత్ కిషోర్ వైఎస్ జగన్ ఈసారి ఓడిపోతున్నారని, మామూలుగా కాదు భారీ తేడాతో ఓడిపోతున్నారంటూ చేసిన వ్యాఖ్యలు అధికార పార్టీలో తీవ్ర కలకలం రేపాయి. ఈ నేపథ్యంలో వైసీపీ క్యాడర్ ను ఉద్దేశించి పార్టీ ఎంపీ విజయసాయిరెడ్డి ఓ ట్వీట్ చేశారు. ఇందులో ప్రశాంత్ కిషోర్ అంచనాలపై సాయిరెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. దీంతో సాయిరెడ్డి వ్యాఖ్యలు కూడా చర్చనీయాంశమవుతున్నాయి. సాయిరెడ్డి ఎక్స్ లో పెట్టిన పోస్టులో ప్రశాంత్ కిషోర్ అంచనాలపై ఆధారపడొద్దంటూ (నమ్మొద్దంటూ) సూచించారు. చంద్రబాబుతో నాలుగు గంటల భేటీ తర్వాత లాజిక్ లేకుండా ప్రశాంత్ కిషోర్ ఈ వ్యాఖ్యలు చేశారంటూ విమర్శలు గుప్పించారు. అలాగే వర్త మాన రాజకీయాల్లో ఆయన అంచనాలకు, వాస్తవాలకూ పొంతన లేదన్నారు. ఏపీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు కోవిడ్ సమయంలో కోట్లాది మందికి అండగా నిలిచాయని, ఇవి ప్రజలకు భారీగా భద్రత నిచ్చాయని సాయిరెడ్డి గుర్తుచేశారు.

# బస్సులకు వేలాడుతున్న జీవితాలు.. మహాలక్ష్మితో

## ప్రగతి రథచక్రాలే మృత్యుశకటాలుగా..!

మా ఊరు కర్విరాల కొత్తగూడెం. తాటివనం మధ్య నుంచి రోడ్డు. తాటివనం దాటి ఫర్లాంగు పోతే లింగమంతుల సామి పెద్దగుట్ట. పెద్దగుట్ట అంచుకే.. 'బహుజనుడా..! నిలబడు.. పోరాడు' అని చెప్తున్నట్టు మారోజు వీరుని ధ్వజ స్థూపం. ఒత్తా.. పోతా దేవున్ని ఏమో..! గానీ వీరున్ని స్మరించందే బాటసాగం. బాట సాగటం అంటే జీవన సంచారం. చలనశీల జగత్తులో నిత్య కదలికే సంచారం. బైరాగిది గాన సంచారం.. విద్యార్థిది జ్ఞాన సంచారం. విప్లవకారునిది పోరు సంచారమైతే.. సగటు మనిషిది బతుకు సంచారం. ఎన్కటికి ఊరు నుంచి చెరువు దిక్కు గమనం ఉండేది. పొద్దంతా కాయకష్టం చేసుకొని, పొద్దుగూకి తాటివనం తట్టేది. ఇప్పటి ప్రస్థానమంతా పల్లె నుంచి పట్నానికే. పట్నంతోనే బతుకు పరుగు. పరుగులు పెట్టే జనాన్ని మలుపుకోవటానికి 'బస్సుల్లో ప్రయాణం సురక్షితం-శుభప్రదం' అనే నినాదం అందుకున్నది ఆర్టీసీ. జనం కోరుకున్నట్టుగా బస్సు నడిచింది. నొప్పులొచ్చిన తల్లికి అంబులెన్స్ అయి దవాఖానకు చేర్చింది. ఆపద మీద ఉన్నప్పుడు అదునుకు గమ్యాన్ని తాకింది. చెయ్యెత్తిన చోట బస్సు ఆగింది. కోరిన చోట దించింది. అట్లా ఎక్కేటోళ్లు.. దిగేటోళ్లతో బస్సు కళకళలాడింది. స్వరాష్ట్రం సిద్ధించి కొలువుకొచ్చిన కేసీఆర్ దశబంధ చెరువులను నింపి సాగుకు జీవం పోసిండు. కూరగాయల తట్టలు.. ఆకుకూరల కట్టలు.. పండ్ల బుట్టలతో పల్లె తెల్లారేది. ఎవుసం వర్తకం స్థాయికి ఎదిగింది. పల్లె పంటను పట్టణం రైతు బజారుతో 'పల్లె వెలుగు' బస్సులు అనుసంధానించారు. కోడి కూతతోనే ఊరు నుంచి బస్సు బైలెల్లితే.. వెలుగు రేఖలు పొడిచే యాళ్లకు బస్తీ చేరేది. నిగనిగలాడే రైతు వర్తకాలను జనం ముందు దించేది. అటు పట్నంలోనైనా, ఇటు పల్లెల్లోనైనా పదేండ్లుగా సాఫీ జీవనమే. అయినా మనసెందుకో కొత్త నీరు కోరింది. ఓట్ల పండుగొచ్చింది. బతుకపోయినోళ్లందరం బండ్లు కట్టుకొని పట్నం నుంచి పల్లెకొచ్చి ఒట్లేసినం. సీట్లిచ్చినం. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డొచ్చి, 'మహాలక్ష్మి' పథకం పెట్టిండు. ఆడోళ్లంత ఉత్తగనే బస్సెక్కొచ్చన్నడు. అంతా బాగానే ఉన్నట్టనిపిచ్చింది. పొద్దు పొడిచినట్టు.. మబ్బులు చెదిరినట్టు.. మంచేదో జరగబోతున్నట్టు.. మనసు మంచి ఊహల మీదుంది. వెంబడించే వెర్రి జ్ఞాపకాలు లేని 'సంచారమే ఎంతో బాగున్నది.. దీనంత ఆనందమేమున్నది' అని నిత్య సంచారికి ధీటుగా మహిళా 'తిరుగు'బాటు జరుగుతదని పొంగిపోయినం. తీరా..! దినం గడుస్తున్న కొద్దీ భ్రమలు కరిగి పోతున్నయి. బస్సంటే భయం పట్టుకుంది. టికెట్ల ఇక్కట్లు లేవు గానీ రాకట్ల.. పోకట్ల.. అన్ని తాకట్లే. హేతువుకు అందకుండా.. తార్కికతకు తావులేకుండా.. మైసమ్మ, పోచమ్మ తల్లుల బలికి గొర్రె జీవాలను తోలుకుపోయినట్టుగా బస్సుల్లో జనాలను జారగొడుతున్నరు. 49 సీట్ల సామర్థ్యం ఉన్న బస్సుల్ల 200 మంది వేలాడుతున్నరు. ఫుట్‌బోర్డులు, అద్దాలు, కిటికీలు పట్టుకొని వేలాడుతూ స్కూలు పిల్లలు, కాలేజీ విద్యార్థులు, ప్రైవేటు ఉద్యోగులు నిత్యం మృత్యు ప్రయాణం




చేస్తున్నరు. బ్రేక్ వేస్తే జారి టైర్ల కింద పడే ప్రయాణం సాగుతున్నది. మృత్యువు ఎటు దిక్కు నుంచి పొంచి కాటేస్తుందో తెలియని అగమ్యగోచర ప్రయాణమైంది. ఈ మధ్య లోతుకుంట వద్ద కిక్కిరిసిన బస్సులో ఫుట్‌బోర్డ్ ప్రయాణం చేస్తూ ఓ మహిళ అదుపు తప్పి పడిపోయింది. సుశిక్షితులైన డ్రైవర్లు ఉండటం ఆర్టీసీకి ఓ వరం. వాళ్ల అప్రమత్తతతో ఇప్పటికైతే పెద్ద ప్రమాదాలేవీ జరుగలేదు. సీటు కోసం సిగపట్లు.. చోటు కోసం అగచాట్లు.. అరుపులు.. కేకలతో బస్సు బైలెల్లుతున్నది. కండబలం ఉండి, ఒంట్లో సత్తువ ఉన్న వాళ్లదే బస్సు. ముసలి, ముతక, దివ్యాంగులకు సీటు కాదు చోటే లేదు. అడిగిన చోట దించటం లేదు. చెయ్యెత్తితే ఆపేది లేదు. అడిగిన చోట బస్సు ఆపలేదని హైదరాబాద్ శివరాంపల్లి వీకర్ సెక్షన్ కాలనీకి చెందిన ఓ మహిళ.. కండక్టర్ చెంప చెల్లుమనిపించింది. మంచిర్యాల జిల్లా నెన్నెల మండల కేంద్రంలో చెయ్యెత్తి బస్సు ఆపాలని కోరినా.. ఆపకుండా వెళ్లిపోతున్నరని మహిళా టీచర్లు మంచిర్యాల డిపో మేనేజర్ రవీంద్రనాథ్‌కు ఫిర్యాదు చేశారు. గజ్వేల్ మండలం అహ్మదీపూర్ స్టేజీ వద్ద దిగేందుకు ఓ యువతి బస్సు ఆపాలని కోరింది. బస్సు ఆపలేదు. ఆటోలో బస్సును వెంబడించిన ఆమె బంధువులు వెంకట్రావుపేట స్టేజీ వద్ద బస్సును ఓవర్‌టేక్ చేసి, డ్రైవర్‌పై దాడి చేశారు. ఇటువంటి సంఘటనలు నిత్యకృత్యం. దీన్ని ప్రజాపాలన దిశగా ముందడుగు అని ప్రభుత్వం గొప్పగా చాటింపేసింది. ' 60 రోజుల్లో 15.21 కోట్ల మంది మహిళలు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం చేసినట్టు చెప్పుకొన్నది. 550 కోట్లు మహిళలకు మిగిలినట్టు లెక్కగట్టింది. ఆర్టీసీకి 10,460 బస్సులుండగా, ఇందులో 3,508 పల్లెవెలుగు బస్సులు. ఇంకో 3,500 ఎక్స్‌ప్రెస్ బస్సులు. ఇవి 36,593 రూట్లలో నడుస్తున్నయి. 60 రోజులకు మొత్తం సామర్థ్యం ప్రకారం.. 10.5 కోట్లు మంది ప్రయాణిస్తారని అంచనా. కానీ, మహిళలే 15.21 కోట్ల మంది ప్రయాణించింద్రు. అంటే..! ఒక్క బస్సులో ఎంత మంది ఎక్కి ఉంటారో ఊహించవచ్చు. 49 మంది పట్టే ఒక బస్సులో సగటున 150కి పైగా కిక్కిరిసి పోతున్నరు. దీన్ని ప్రజా పాలన దిశగా ముందడుగుగా అభివర్ణించడం చూస్తుంటే.. భవిష్యత్తు బస్సు గమనం, గమ్యం కండ్ల ముందు కనిపిస్తున్నది.

# రెవెన్యూ సెక్టార్ లో అవినీతిని పూర్తిగా అంతరించాలి..

హైదరాబాద్: భద్రాద్రిలో రాములవారి సన్నిధిలో ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని త్వరలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభిస్తారు అని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు.

ఈ సందర్భంగా రెవెన్యూ సెక్టార్ లో అవినీతిని పూర్తిగా అంతరించాలి అని పేర్కొన్నారు.

తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా పారదర్శకంగా నియామకాలు చేపడతామని ఆయన వెల్లడించారు. ఇప్పటికే సుమారు 22 వేల ఉద్యోగాలు ఇచ్చాం అని తెలిపారు.

ఇక, తెలంగాణ రాష్ట్రంలో తమ ప్రభుత్వం మెగా డీఎస్సీని ప్రకటించిందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. 11 వేల ఉద్యోగ నియామకాలను ఎన్నికల కోడ్ కు ముందుగానే చేపడతాం అని పేర్కొన్నారు. గత పద్దతులు మానుకుని ఇందిరమ్మ రాజ్యంలో ప్రజలకు మంచి చేసేలా అధికారులు ముందుకు వెళ్ళాలి అని ఆయన



సూచనలు చేశారు. ధరణి పోర్టల్ కు సంబంధించి పెండింగ్ లో ఉన్న అప్లికేషన్ లను యుద్ధ ప్రాతిపదికన పరిష్కరించేలా మండల స్థాయిలో అధికారులతో కమిటీ ఏర్పాటు చేస్తాం అని మంత్రి చెప్పుకొచ్చారు.

# మహిళల కోసం పోస్టాఫీసుల్లో అద్భుతమైన స్కీమ్.. రిస్క్ లేని పథకం

హైదరాబాద్: మహిళలు రెండేళ్లలో ధనవంతులు కావాలనుకుంటే వారు ఈ పోస్ట్ ఆఫీస్ పథకంలో పెట్టుబడి పెట్టవచ్చు. ప్రభుత్వం మహిళల కోసం మహిళా సమ్మాన్ సర్టిఫికెట్ పథకాన్ని అమలు చేస్తోంది. మీరు మీ కుమార్తె లేదా భార్య లేదా మహిళల కోసం పెట్టుబడి ఎంపికల కోసం కూడా చూస్తున్నట్లయితే, పోస్టాఫీసు పథకం ఉపయోగకరంగా ఉంటుంది. పోస్టాఫీసు పథకంలో మహిళలు గరిష్టంగా రూ. 2 లక్షల వరకు పెట్టుబడి పెట్టవచ్చు.

మహిళా సమ్మాన్ సర్టిఫికేట్ పోస్టాఫీసులో కూడా పనిచేస్తోంది. పోస్ట్ ఆఫీస్ మహిళా సమ్మాన్ సేవింగ్స్ సర్టిఫికేట్ స్కీమ్‌లో పెట్టుబడి పెట్టడం ద్వారా, మహిళలు ఎలాంటి మార్కెట్ రిస్క్‌ను ఎదుర్కోవాల్సిన అవసరం లేదు. ఇందులో మీరు హామీతో కూడిన రాబడిని పొందుతారు. ఈ పథకం కింద మహిళలు గరిష్టంగా 2 సంవత్సరాల వరకు రూ. 2 లక్షల వరకు డిపాజిట్ చేయవచ్చు. మీరు రెండు సంవత్సరాలలో పెట్టుబడిపై 7.5 శాతం వడ్డీని అందుకోవచ్చు.

ప్రభుత్వ పథకాల ద్వారా మహిళలు పొదుపు చేసి స్వావలంబన పొందగలుగుతారు. ఈ పథకంలో జమ చేసే సొమ్ముపై ప్రభుత్వం పన్ను మినహాయింపు కూడా ఇస్తోంది. ఈ పథకంలో పెట్టుబడి పెట్టడం ద్వారా మహిళలందరికీ పన్ను మినహాయింపు లభిస్తుంది. పథకం



కింద 10 సంవత్సరాలు లేదా అంతకంటే ఎక్కువ వయస్సు ఉన్న బాలికలు కూడా ఇక్కడ తమ ఖాతాలను తెరవవచ్చు.

మీరు 2 సంవత్సరాలలో ఎంత వడ్డీని పొందుతారు?

మహిళా సమ్మాన్ సేవింగ్ సర్టిఫికేట్ స్కీమ్ కింద రెండేళ్ల కాలానికి 7.5 శాతం వడ్డీ ఇవ్వబడుతుంది. ఒకసారి రూ. 2 లక్షలు ఇన్వెస్ట్ చేస్తే మొదటి ఏడాది రూ. 15,000, రెండో ఏడాది రూ. 16,125 రాబడులు వస్తాయి. అంటే రెండేళ్లలో రూ. 2 లక్షల పెట్టుబడిపై పథకం కింద రూ. 31,125 వడ్డీ ఆదాయం లభిస్తుంది.

# అనంత్ ప్రీ వెడ్డింగ్ వేడుకలో భారతీయ సంప్రదాయాలకు పెద్దపీట

అనంత్ అంబానీ రాధిక మర్చంట్ ప్రీ వెడ్డింగ్ వేడుక నభూతో నభవిష్యతి అన్నట్టు సాగింది. అంగరంగవైభవంగా సాగుతున్న వేడుకకు సంబంధించిన ఫొటోలు, వీడియోలతో ఇంటర్నెట్ హోరెత్తిపోతోంది. వారం రోజుల నుంచి ఇదో ట్రెండింగ్ టాపిక్ అయిపోయింది. చాలా మంది సెలబ్రెటీల డెస్టినేషన్ జామ్నగర్ అయిపోయింది.

వేడుకలు ప్రారంభమైనప్పటి నుంచి కూడా భారతీయ సంప్రదాయ పద్ధతిలో సాగుతున్న సంబరాలు అందరి ప్రశంసలు అందుకుంటున్నాయి. దీనికి సంబంధించిన వీడియోలను, ఫొటోలను అంతా షేర్ చేస్తున్నారు. మొదటి రోజు. అలాంటి ఓ వీడియో ఇప్పుడు వైరల్ అవుతోంది. మెహందీ ఫంక్షన్ నుంచి ప్రధాన వేడుక వరకు అన్నింటినీ సంప్రదాయ పద్ధతిలో నిర్వహించారు. భారతీయ వివాహాలు, అక్కడ చేపట్టే సాంస్కృతిక కార్యక్రమాలన్నీ వివిధ ఆచారాలను కలిగి ఉంటాయి. వాటన్నింటినీ అంబానీ ఫ్యామిలీ పాటించిందనే ప్రశంసలు వినిపిస్తున్నాయి. భారీగా విదేశీయులు కొలువుదీరి ఉన్న వేదికపై అచ్చమైన భారతీయ సంప్రదాయపద్ధతిలో వివాహం జరగడం అభినందనీయమని నెటిజన్లు అభిప్రాయపడుతున్నారు. అనంత్ అంబానీ, రాధికా మర్చంట్ ప్రీ వెడ్డింగ్ ఫంక్షన్ గుజరాత్లోని జామ్ నగర్లో మూడు రోజుల పాటు జరిగాయి. ఈవెంట్ చివరి రోజున స్టార్స్ నుంచి అంబానీ కుటుంబ సభ్యుల వరకు సాంస్కృతిక ప్రదర్శనలు



చేశారు. నీతా అంబానీ చేసిన డ్యాన్స్ మాత్రం వచ్చిన అతిథులను మెస్మరైజ్ చేసింది. సంప్రదాయం, ఆధ్యాత్మికతకు మేళవిస్తూ సాగిన నృత్యం చూపరులను ఎంతగానో ఆకట్టుకుంది. శక్తి, సహనానికి ప్రతిరూపమైన దుర్గాదేవిని స్తుతిస్తూ సాగిన పాటకు నీతా అంబానీ మంత్రముగ్ధులయ్యే ప్రదర్శన ఇచ్చారు. దీనికి సంబంధించిన వీడియో ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. అనంత్-రాధిక కోసం తల్లి ఆశీస్సులను కోరుతూ నీతా అంబానీ నృత్య ప్రదర్శన చేశారు. నీతా అంబానీతి నవరాత్రుసు చాలా ప్రత్యేకం. అందుకే కుమారుడు అనంత్, కోడలు రాధికా మర్చంట్ భవిష్యత్ మంచిగా ఉండాలని అమ్మ ఆశీస్సులు కోరుతూ ఈ ప్రక్రియ చేపట్టారు.

# అసద్ పై బీజేపీ అస్త్రం మాధవీలత -

## ఎవరీమె, ఎంపిక వెనుక..!!

హైదరాబాద్ : కేంద్రంలోని మోదీ సర్కార్ హ్యాట్రిక్ విజయం పైన కన్నేసింది. ఈ సారి 400 సీట్లలో గెలుపు లక్ష్యంగా ఫిక్స్ చేసింది. ఇప్పటికే 195 మంది అభ్యర్దులతో తొలి జాబితా ప్రకటించింది.

అందులో తెలంగాణ నుంచి 9 మందిని ఖరారు చేసింది. అనూహ్యంగా హైదరాబాద్ ఎంపీ స్థానం నుంచి మహిళా అభ్యర్ది మాధవీ లతను ప్రకటించింది. ఎంఐఎం కంచుకోటగా ఉన్న హైదరాబాద్ లో అసద్ లాంటి బలమైన నేతపైన మధవీ లతను బీజేపీ ఎంపిక చేయటం ఇప్పుడు సంచలనంగా మారుతోంది.

మాధవీలత పేరు ఖరారు: వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో హైదరాబాద్ స్థానంలో మజ్లిస్‌కు గట్టి పోటీ ఇచ్చేందుకు విరించి ఆస్పత్రి, లతామా ఫౌండేషన్‌ల చైర్‌పర్సన్ మాధవీలతకు టికెట్ ఖరారు చేసింది. తొలుత హైదరాబాద్ స్థానంలో గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్‌ను బరిలో నిలపాలని భావించినా మాధవీ లత వైపు పార్టీ మొగ్గు చూపింది.

ఎన్‌సీసీ క్యాడెట్‌గా, క్లాసికల్ సింగర్‌గా మాధవీలత గుర్తింపు తెచ్చుకున్నారు. మాధవీలత రెండేళ్లుగా పాతబస్తీ వేదికగా అనేక ధార్మిక కార్యక్రమాలు నిర్వహిస్తూ సోషల్ మీడియాలో చురుగ్గా ఉంటున్నారు. గోశాలతో పాటు భారీ యజ్ఞశాల ఏర్పాటు చేసి ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. కొంతకాలంగా పాతబస్తీ ప్రజలతో మమేకమై పేదలను ఆదుకుంటున్నారు.

ఇంటర్వ్యూలతో పాపులర్: మాధవీలత మహిళలు, హిందూ అంశాల పైన యాక్టివ్ గా వ్యవహరిస్తున్నారు. సామాజిక కార్యకర్తగా త్రిపుల్ తలాక్‌పై అనేక ముస్లిం మహిళా సంఘాలతో కలిసి పనిచేశారు. ఎంపీ అసదుద్దీన్ ఓవైసీపై కౌంటర్‌గా ఇచ్చిన పలు ఇంటర్వ్యూలతో ఆమె పాపులర్ అయ్యారు. బీజేపీ ప్రతినిధిగా అసదుద్దీన్ విధానాలను తనదైన శైలిలో వ్యతిరేకించడంతో పార్టీ అధిష్ఠానం దృష్టిలో పడ్డారు. ప్రధాని నరేంద్ర మోదీ ప్రసంగాలు, పాలనా స్ఫూర్తితో బీజేపీలో చేరారు. తన లోపాముద్ర ఛారిటబుల్ ట్రస్ట్ ద్వారా నగరంలోని పలు ప్రాంతాల్లో పలు ఆరోగ్య సంరక్షణ, విద్య, ఆహార పంపిణీ కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహిస్తుంటారు. హైందవ సంస్కృతి, సాంప్రదాయాలపై ఆమె చేసే వ్యాఖ్యలు తరచుగా సోషల్ మీడియాలో వైరల్ అవుతుంటాయి.

ఎంఐఎం ను ఓడిస్తారా: హింధూ ధర్మం, హిందూ సాంప్రదాయాలపై ఆమె మాట్లాడే మాటలు, ఇచ్చే ప్రసంగాలపై పాజిటివ్ రెస్పాన్స్ ఉంది. పాతబస్తీలో ఏమైనా సమస్యలు వస్తే, వాటికి పరిష్కారం చూపించేవారు. హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ వ్యాఖ్యలకు ఆమె కౌంటర్ ఇచ్చేవారు. బీజేపీ ప్రతినిధిగా అసదుద్దీన్ విధానాలను తనదైన శైలిలో వ్యతిరేకించడంతో పార్టీ అధిష్టానం దృష్టిలో పడ్డారు. ఎంఐఎం కంచుకోట పాతబస్తీలో తరుచూ ఆధ్యాత్మిక కార్యక్రమాలు చేపట్టేవారు.

హైదరాబాద్ సీటు 1984 నుంచి నాలుగు దశాబ్దాలుగా ఒవైసీల అడ్డా. ఈసారి ఎలాగైనా ఎంఐఎంకు చెక్ పెట్టి, విజయం సాధించాలని భావిస్తున్న బీజేపీ అధిష్టానం అనూహ్యంగా మాధవీ లతకు ఛాన్స్ ఇచ్చింది. దీంతో, ప్రస్తుత ఎన్నికల్లో అసద్ ను మాధవీలత ఏ విధంగా ఎదుర్కొంటారనేది ఆసక్తి కరంగా మారుతోంది.



# ఒకప్పుడు వరల్డ్ నంబర్ 1.. ఇప్పుడు జట్టుకు భారమవుతున్న యాషెస్ హీరో

ఆస్ట్రేలియా స్టార్ బ్యాటర్ మార్నస్ లబూషేన్ ఫామ్ లేమితో సతమతవుతున్నాడు. ఒకప్పుడు వరల్డ్ నంబర్ 1 టెస్టు బ్యాటర్ గా వెలుగొందిన లబూషేన్ జట్టుకు భారంగా మారుతున్నాడు.

నిరుడు సెంచరీల మీద సెంచరీలు బాదిన ఈ రైట్ హ్యాండర్ ఇప్పుడు హాఫ్ సెంచరీ కాదు కదా కనీసం 20 పరుగులు కూడా చేయలేక పోతున్నాడు.

స్వదేశంలో పాకిస్థాన్ సిరీస్‌లో అర్ధ శతకం తప్పిస్తే.. వెస్టిండీస్, న్యూజిలాండ్ టెస్టు సిరీస్‌లో ఈ స్టార్ ఆటగాడు దారుణంగా విఫలమయ్యాడు. గత ఆరు ఇన్నింగ్స్‌ల్లో మార్నస్ 10, 1 నాటౌట్, 3, 5, 1, 2 పరుగులతో తీవ్రంగా నిరాశ పరిచాడు. దాంతో, సుదీర్ఘ ఫార్మాట్‌లో అతడి సగటు తొలిసారి 50 కంటే తక్కువకు పడిపోయింది. 2019 తర్వాత లబూషేన్ సగటు దారుణంగా పడిపోవడం ఇదే మొదటిసారి. అయినా సరే కెప్టెన్ కమిన్స్, కోచ్ ఆండ్రూ మెక్‌డొనాల్డ్ అతడికి అండగా నిలుస్తున్నారు.

2018 అక్టోబర్‌లో టెస్టుల్లో అరంగేట్రం చేసిన లబూషేన్ కెరీర్ 2019లో టర్న్ అయింది. ఆ ఏడాది యాషెస్ సిరీస్ లో ఇంగ్లండ్ బౌలర్లకు కొరకరాని కొయ్యలా మారిన అతడు నాలుగు హాఫ్ సెంచరీలు బాదాడు. మొత్తంగా 353 పరుగులతో నాలుగో టాప్ స్కోరర్‌గా నిలిచాడు. దాంతో, మూడో స్థానంలో పాతుకుపోయిన అతడు ఆ తర్వాత ఆడిన 12 మ్యాచుల్లో 1,591 పరుగులు సాధించాడు. 2021-22 పర్యటనలోనూ లబూషేన్ పరుగుల వరద పారించాడు. రెండు ఫిఫ్టీలు, ఒక సెంచరీతో కలిపి 335 రన్స్ కొట్టాడు.

దాంతో, 51 ఇన్నింగ్స్‌ల్లోనే 3 వేల పరుగుల మైలురాయి దాటాడు. నిలకడగా రాణించి వరల్డ్ నంబర్ 1 ర్యాంక్ దక్కించుకున్నాడు.



అయితే.. నిరుడు జనవరిలో భారత పర్యటనలో ఈ టెస్టు స్పెషలిస్ట్ దారుణంగా విఫలయమ్యాడు. స్పిన్ ద్వయం అశ్విన్, జడేజాలను ఎదుర్కోలేక అపసోపాలు పడ్డాడు. దాంతో, ఆస్ట్రేలియా 0-4తో బోర్డర్ గవాస్కర్ ట్రోఫీని కోల్పోయింది.

టెస్టుల్లో రికార్డులు బద్దలు కొట్టిన లబూషేన్ 2020లో వన్డే జట్టుకు ఎంపికయ్యాడు. అయితే.. నిరుడు వరల్డ్ కప్ ముందు పేలవ ఫామ్‌లో ఉన్న అతడిని సెలెక్టర్లు పక్కన పెట్టేశారు. స్పిన్నర్ డీన్ ఎల్గర్ గాయపడడంతో స్క్వాడ్‌లో అతడికి చోటు దక్కింది. దాంతో, లబూషేన్ పలు మ్యాచుల్లో కీలక ఇన్నింగ్స్‌లు ఆడి ఆసీస్ విజయాల్లో భాగమయ్యాడు. టీమిండియాతో జరిగిన ఫైనల్లో లబూషేన్ విలువైన ఇన్నింగ్స్ ఆడాడు. షమీ విజృంభణతో 47 రన్స్‌కే మూడు వికెట్లు పడిన దశలో క్రీజులోకి వచ్చిన అతడు ఓపెనర్ ట్రావిస్ హెడ్(137)కు అండగా నిలిచాడు. 58 పరుగులతో నాటౌట్‌గా నిలిచి ఆస్ట్రేలియాను గెలుపు బాట పట్టించాడు.

# మర్క్‌రమ్‌పై వేటు.. సన్‌రైజర్స్ హైదరాబాద్ కెప్టెన్‌గా కమిన్స్

ఇండియన్ ప్రీమియర్ లీగ్ 17వ సీజన్‌లో మాజీ చాంపియన్ సన్‌రైజర్స్ హైదరాబాద్ కీలక నిర్ణయం తీసుకుంది. ఈసారి టైటిల్‌పై కన్నేసిన హైదరాబాద్ ఎడెన్ మర్క్‌రమ్‌పై వేటు వేసింది.

అందరూ ఊహించినట్టుగానే ప్యాట్ కమిన్స్‌ను కెప్టెన్ చేసింది.

ఆస్ట్రేలియాకు రెండు ఐసీసీ ట్రోఫీలు కట్టబెట్టిన కమిన్స్‌కు పగ్గాలు అప్పగిస్తున్నట్టు సోమవారం ఎస్ఆర్‌హెచ్ ప్రకటించింది. ఎక్స్ ఖాతాలో పోస్ట్ పెట్టింది. 17వ సీజన్‌లో హైదరాబాద్‌తో పాటు పలు జట్లు కొత్త సారథులను నియమించాయి. శుభ్‌మన్ గిల్ గుజరాత్ టైటాన్స్ జట్టుకు, హార్దిక్ పాండ్యా ముంబై ఇండియన్స్ కెప్టెన్‌లుగా ఎంపికైన విషయం తెలిసిందే. దక్షిణాఫ్రికా ఆటగాడు ఎడెన్ మర్క్‌రమ్ 16వ సీజన్‌లో జట్టును నడిపించడంలో విఫలమయ్యాడు. ఓపెనింగ్ కాంబినేషన్, మిడిలార్డర్ వైఫల్యం వెరసి వరుస ఓటములతో హైదరాబాద్ జట్టు పాయింట్ల పట్టికలో అడుగున నిలిచింది. 2016లో డేవిడ్ వార్నర్ సారథ్యంలో టైటిల్ నెగ్గిన హైదరాబాద్ ఆ తర్వాత కేన్ విలియమ్సన్, మర్క్‌రమ్.. ఇలా కెప్టెన్లు మారినా మరో టైటిల్ కొట్టలేకపోయింది. గత సీజన్‌లో తీవ్రంగా నిరాశ పరిచిన తమ జట్టు రాతను కమిన్స్ మారుస్తాడని ఆరెంజ్ ఆర్మీ ఎంతో నమ్మకంతో ఉంది. అంతర్జాతీయ క్రికెట్‌లో ఆస్ట్రేలియా పునఃవైభవానికి ప్యాట్ కమిన్స్ నాంది పలికాడు. టిమ్ పైన్ నుంచి 2022లో టెస్టు పగ్గాలు అందుకున్న



అతడు ఆసీస్‌కు నిరుడు రెండు ఐసీసీ ట్రోఫీలు అందించాడు. ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ గదతో పాటు వన్డే వరల్డ్ కప్‌ట్రోఫీ గెలిచింది. అందుకనే 17వ సీజన్ మినీ వేలంలో అతడి కోసం హైదరాబాద్ ఫ్రాంచైజీ ఏకంగా రూ.20.50 కోట్లు పెట్టింది.

వరల్డ్ కప్ ఫైనల్లో సెంచరీ బాదిన ట్రావిస్ హెడ్ ను కూడా హైదరాబాద్ కొన్నది. ఈసారి బ్యాటింగ్‌తో పాటు బౌలింగ్‌లోనూ హైదరాబాద్ జట్టు పటిష్ఠంగా కనిపిస్తోంది. మార్చి 22 నుంచి ఐపీఎల్ 17వ సీజన్ షురూ కానుంది. హైదరాబాద్ జట్టు తమ తొలి మ్యాచ్‌లో మార్చి 23వ తేదీన కోల్‌కతా నైట్ రైడర్స్ తో తలపడనుంది.

# రాకెట్‌తో కాదు.. చీపురుతో బ్యాడ్మింటన్ ఆడేశాడు..

బ్యాడ్మింటన్ అనగానే ఎవరికైనా పుల్లెల గోపీచంద్, పీవీ సింధు సైనా నెహ్వాల్ పేర్లు గుర్తుకొస్తాయి. వాళ్లు రాకెట్‌తో సాధించిన అద్భుత విజయాలు మదిలో మెదులుతాయి. వాళ్లను స్ఫూర్తిగా తీసుకొని షటిల్, కాక్ అందుకున్నవాళ్లు చాలామందే. అయితే.. తాజాగా ఓ వ్యక్తి మాత్రం రాకెట్ లేకుండానే చీపురు కట్టతో అలవోకగా బ్యాడ్మింటన్ ఆడేశాడు. ప్రస్తుతం ఆ వీడియో ఆన్‌లైన్‌లో వైరల్ అవుతోంది.

గత వారం జతిన్ శర్మ అనే యూజర్ తన ఇన్‌స్టాగ్రామ్‌లో వీడియో పెట్టాడు. అందులో ఇద్దరు బ్యాడ్మింటన్ ఆడుతున్నారు. అంతలోనే ఒక వ్యక్తి చీపురుతో కోర్టులోకి వచ్చాడు. ప్లాస్టిక్ చీపురు కట్టతో అతడు అవలీలగా బ్యాడ్మింటన్ ఆడాడు. షటిల్ బ్యాటుతో ఆడినట్టే



ఎంతో నేర్పుగా కాక్‌ను అవతలి కోర్టులోకి పంపాడు. దాంతో, అవతలి ఎండ్‌లో ఉన్న మహిళ సైతం అతడి నైపుణ్యానికి ఆశ్చర్యపోయింది.

# ధర్మశాలలో వడగండ్లు, ఎముకలు కొరికే చలి..

## ఐదో టెస్టుకు అంతరాయం తప్పదా..!

ఇంగ్లండ్‌తో జరుగుతున్న ఐదు టెస్టుల సిరీస్‌లో భారత జట్టు హ్యాట్రిక్ విజయాలతో అదరగొట్టింది. మరో మ్యాచ్ ఉండగానే సిరీస్ కైవసం చేసుకున్న టీమిండియా ఐదో టెస్టులోనూ బెన్ స్టోక్స్ సేనను మట్టికరిపించేందుకు సిద్ధమవుతోంది. మార్చి 7 వ తేదీన మ్యాచ్ ప్రారంభం కానుంది. అయితే.. ఈ మ్యాచ్‌లో ఇరుజట్ల ఆటగాళ్లకు బౌలర్ల కంటే వాతావరణంతోనే అసలైన సవాల్ ఎదురుకానుంది. హిమాలయ పర్వత సానువుల్లోని ధర్మశాలస్టేడియంలో ప్రస్తుతం చల్లని వాతావరణం ఉంది. మ్యాచ్ సమయానికల్లా స్టేడియంలో వడగండ్లు పడే చాన్స్ ఉంది. సముద్ర మట్టానికి 1,457 మీటర్ల ఎత్తులో ఉండే ధర్మశాల స్టేడియంలో తొలి రెండు రోజులు వాతావరణం బాగా చల్లగా ఉంటుందని భారత వాతావరణ శాఖ కూడా తెలిపింది.

స్వదేశంలో ఇంగ్లండ్‌తో జరుగుతున్న టెస్టు సిరీస్‌లో టీమిండియా జోరు కొనసాగిస్తోంది. ఉప్పల్ టెస్టులో దారుణ ఓటమి నుంచి తేరుకున్న రోహిత్ సేన వరుసగా మూడు టెస్టుల్లో ఇంగ్లండ్‌ను చిత్తు చేసింది. విరాట్ కోహ్లీ, కేఎల్ రాహుల్, షమీ వంటి సీనియర్లు లేకున్నా సిరీస్ కైవసం చేసుకుంది. కుర్రాళ్లు యశస్వీ జైస్వాల్, సర్ఫరాజ్ ఖాన్, శుభ్‌మన్ గిల్, ధ్రువ్ జురెల్‌లు దంచి కొట్టగా.. స్పీడ్‌స్టర్ జస్ప్రీత్



బుమ్రా, స్పిన్నర్లు కుల్దీప్, అశ్విన్‌లు ఇంగ్లండ్ భరతం పట్టారు. దాంతో, స్టోక్స్ సారథ్యంలోని ఇంగ్లండ్ తొలిసారి టెస్టు సిరీస్ కోల్పోయింది. నామమాత్రమైన ఐదో టెస్టులోనూ విజయంపై కన్నేసిన భారత్.. బ్యాటింగ్ విభాగంపై దృష్టి పెట్టింది. వరుసగా విఫలమైన రజత్ పాటిదార్ స్థానంలో యువకెరటం దేవ్‌దత్ పడిక్కల్‌ను ఆడించే చాన్స్ ఉంది. ప్రస్తుతం టీమిండియా డబ్ల్యూటీసీ పట్టికల్ అగ్రస్థానంలో ఉంది. ఐదో టెస్టులోనూ గెలిస్తే.. వరుసగా మూడోసారి ఫైనల్ చేరే అవకాశం ఉంది.

# చెన్నైకి మరో షాకింగ్ న్యూస్.. ఐపీఎల్‌కు స్టార్ ఓపెనర్ దూరం

ఇండియన్ ప్రీమియర్ లీగ్ 17వ సీజన్‌కు సమయం దగ్గరపడుతోంది. అన్ని జట్లు తమ వ్యూహాలకు పదును పెడుతుంటే.. డిఫెండింగ్ చాంపియన్ చెన్నై సూపర్ కింగ్స్‌కు వరుసగా షాక్‌లు తగులుతున్నాయి. స్టార్ ఆల్‌రౌండర్ శివం దూబే ఇప్పటికే గాయపడగా.. తాజగా ఓపెనర్ డెవాన్ కాన్వే సీజన్ అర్ధ భాగానికి దూరం కానున్నాడు.

స్వదేశంలో ఆస్ట్రేలియాతో జరుగుతున్నటెస్టు సిరీస్‌లో కాన్వే గాయపడ్డాడు. స్కానింగ్‌ల అతనంరం అతడి ఎడమ చేతి బొటన వేలికి సర్జరీ అనివార్యమని వైద్యులు చెప్పారు. దాంతో, ఈ లెఫ్ట్ హ్యాండర్ త్వరలోనే సర్జరీ చేయించుకోనున్నాడు. అతడు కోలుకునేందుకు 8 వారాల పైనే అంటే దాదాపు రెండు నెలలు పట్టనుంది. దాంతో, ఐపీఎల్ 17వ సీజన్ తొలి అర్ధ భాగం మొత్తానికి కాన్వే దూరమయ్యే చాన్స్ ఉంది. మే వరకు అతడు సూపర్ కింగ్స్ జట్టుతో కలిసే చాన్స్ ఉంది. విధ్వంసక ఇన్నింగ్స్‌లతో చెన్నైకి శుభారంభాలు ఇచ్చే కాన్వే లేకపోవడం ధోనీ సేనకు పెద్ద లోటే. 16వ సీజన్‌లో కాన్వే 51.69 సగటుతో 672 పరుగులు సాధించాడు. 139.71 స్ట్రయిక్ రేటుతో ఆడిన అతడు ఆరు హాఫ్ సెంచరీలు బాదాడు. కాన్వే సీజన్ తొలి అర్ధ భాగానికి దూరం కావడంతో రుతురాజ్ గైక్వాడ్‌కు జోడీగా ఎవరు ఆడుతారు? అని అభిమానుల్లో ఆసక్తి



నెలకొంది. గైక్వాడ్‌కు జోడీగా వరల్డ్ కప్ హీరో రచిన్ రవీంద్రను ఓపెనర్‌గా ఆడించే అవకాశం ఉంది. ఎందుకంటే.. భారత పిచ్‌లపై అతడు వన్డే వరల్డ్ కప్‌లో దంచి కొట్టాడు.

ఈ యువ ఆల్‌రౌండర్ మేటి బౌలర్లను సైతం ఉతికారేస్తూ రెండు సెంచరీలు బాదాడు. దాంతో, నిరుడు దుబాయ్‌లో జరిగిన మినీ వేలంలో రవీంద్రను రూ. 1.80 కోట్లకు చెన్నై కొన్న విషయం తెలిసిందే. ఐపీఎల్ 17వ సీజన్ మార్చి 22న ప్రారంభం కానుంది. డిఫెండిగ్ చాంపియన్ అయిన చెన్నై జట్టు తొలి పోరులో రాయల్ చాలెంజర్స్ బెంగళూరును ఢీకొట్టనుంది.

# మెస్సీ ఫ్రీ-కిక్ తగిలి గుక్కపెట్టి ఏడ్చిన చిన్నారి..

వరల్డ్ కప్ హీరో లియోనల్ మెస్సీ మళ్లీ స్టేడియంలో అభిమానులను అలరిస్తున్నాడు. హాకాంగ్‌తో మ్యాచ్‌కు దూరమైన ఈ స్టార్ ఫుట్‌బాలర్ ఒర్లాండో సిటీతో జరిగిన మ్యాచ్‌లో బరిలోకి దిగాడు.

ఆదివారం రాత్రి ఫోర్ట్ లాడెరేడేల్ స్టేడియంలో మెస్సీ సారథ్యంలోని ఇంటర్ మియామి 5-0తో గెలుపొందింది. అయితే.. ఈ మ్యాచ్ రెండో అర్ధభాగంలో మెస్సీ కొట్టిన ఫ్రీ కిక్ స్టేడియంలోకి దూసుకెళ్లింది. గోల్ పోస్ట్ మీదుగా వెళ్లి కుర్చీ కూర్చున్న చిన్నారి ముఖానికి తాకింది. దాంతో, అప్పటిదాకా కేరింతలు కొడుతున్న ఆ పాప ఒక్కసారిగా గుక్కపెట్టి ఏడ్చేసింది. ఆమె తల్లిదండ్రులు ఆ పాపను ఓదార్చేందుకు నానా తిప్పలు పడ్డారనుకో.

ఆమె తండ్రి తనను ఓదార్చుతూ 'నువ్వు బాగానే ఉన్నావా.. ఏదీ ఏమైనా మెస్సీ కొట్టిన బంతి నీకు తగిలింది. అందులో ఏమీ పొరపాటు లేదు' అని అనడం మెస్సీపై అతడికున్న అభిమానానికి అద్దం పడుతోంది. నిరుడు పారిస్ సెయింట్ జర్మనీ క్లబ్ నుంచి అమెరికాకు చెందిన ఇంటర్ మియామి క్లబ్‌కు మెస్సీ మారాడు. అతడి రాకతో ఇంటర్ మియామి రాతే మారిపోయిందనుకో. మేజర్ సాకర్ లీగ్‌లో ఆ జట్టు వరుస విజయాలతో దూసుకెళ్లింది.



అర్జెంటీనాకు మూడో వరల్డ్ కప్ అందించిన మెస్సీ.. హాంకాంగ్‌తో ఫిబ్రవరి 4న జరిగిన ఎగ్జిబిషన్ మ్యాచ్‌లోబరిలోకి దిగలేదు. దాంతో, అతడిని చూసేందుకు స్టేడియానికి వచ్చిన అభిమానులు తీవ్ర నిరాశకు గురయ్యారు. మెస్సీ ఆడకపోవడంతో తమ మ్యాచ్ టికెట్ డబ్బులు వాపస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. దాంతో, చైనాలోని బీజింగ్‌కు చెందిన ఫుట్‌బాల్ సమాఖ్య అర్జెంటీనా జట్టు పర్యనను రద్దు చేసిన విషయం తెలిసిందే.

# పీకేఎల్ 10వ సీజన్ విజేతగా పల్టాన్.. తొలిసారి ట్రోఫీ సొంతం.. ఫైనల్లో హర్యానాపై గెలుపు..

హైదరాబాద్‌లోని గచ్చిబౌలిలోని జిఎంసి బాలయోగి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో జరిగిన ప్రో కబడ్డీ లీగ్ 10వ సీజన్ ఫైనల్ మ్యాచ్‌లో పుణెరి పల్టాన్ జట్టు హర్యానా స్టీలర్స్ జట్టును ఓడించి తొలిసారి ప్రొ కబడ్డీ లీగ్ ట్రోఫీని కైవసం చేసుకుంది. ఈ మ్యాచ్‌లో పుణెరి పల్టన్ 28-25తో హర్యానా స్టీలర్స్‌పై విజయం సాధించింది. ఫైనల్ మ్యాచ్‌లో పుణెరి పల్టన్ తరపున అద్భుత ప్రదర్శన చేసిన పంకజ్ మోహితే, మోహిత్ గోయెట్‌లు జట్టు విజయాన్ని కైవసం చేసుకున్నారు. ఈ లీగ్‌లో పుణెరి పల్టాన్ టోర్నీ ఆద్యంతం మంచి ప్రదర్శన చేసింది.

తదనుగుణంగా లీగ్ దశలో మొత్తం 96 పాయింట్లు సాధించిన పల్టాన్ జట్టు.. ఆఖరి మ్యాచ్ తొలి అర్ధభాగంలోనూ అదే ఆటను కొనసాగించింది. తద్వారా 13-10 ఆధిక్యంతో తొలి అర్ధభాగం ముగిసింది. రెండో అర్ధభాగంలో పుణెరి తరపున పంకజ్ మోహిత్ మరింత దూకుడుగా ఆడి జట్టుకు నాలుగు ముఖ్యమైన పాయింట్లను అందించాడు.

తొలి అర్ధభాగంలో 3 పాయింట్లతో వెనుకబడిన హర్యానా జట్టు ద్వితీయార్థంలో పుంజుకునే ప్రయత్నం చేసింది. కానీ, పుణెరి జట్టు ఇందుకు అనుమతించలేదు. ద్వితీయార్థంలో ఇరు జట్లు చెరో 15 పాయింట్లు సాధించి మ్యాచ్‌ను ఉత్కంఠభరితంగా మార్చాయి. కానీ, తొలి అర్ధభాగంలో పుణెరి పల్టాన్ సాధించిన ఆధిక్యం జట్టు విజయంలో కీలకపాత్ర పోషించింది. ఈ మ్యాచ్‌లో ఇరు జట్లు 43 రైడ్‌లు చేశాయి. ఇందులో హర్యానా స్టీలర్స్ 15 విజయవంతమైన రైడ్‌లు చేయగా,




పుణెరి పల్టాన్ 12 విజయవంతమైన రైడ్‌లు చేసింది. చివరగా, లీగ్ అంతటా అత్యుత్తమ డిఫెండర్‌గా నిలిచిన ఇరాన్‌కు చెందిన మహ్మద్రెజా ఈ సీజన్‌లో ఉత్తమ డిఫెండర్ అవార్డును కూడా అందుకున్నాడు.

పుణెరి పల్టాన్ జట్టు: అభినేష్ నడరాజన్, గౌరవ్ ఖత్రి, సంకేత్ సావంత్, పంకజ్ మోహితే, అస్లాం ఇనామాదర్, మోహిత్ గోయత్, ఆకాశ్ షిండే, బాదల్ సింగ్, ఆదిత్య షిండే, మహ్మద్రెజా షాద్లుయ్ చెయెన్నె, వాహిద్ రెజీమర్, అహ్మద్ ముస్తఫా ఇనామదర్.

హర్యానా స్టీలర్స్ జట్టు: చంద్రన్ రంజిత్, కె ప్రపంజన్, సిద్ధార్థ్ దేశాయ్, వినయ్, తేజస్ పాటిల్, శివమ్ పటారే, విశాల్ టైట్, ఘనశ్యామ్ మగర్, హసన్ బల్బూల్, హర్దీప్, జైదీప్ దహియా, రాహుల్ సెట్పాల్, రవీంద్ర చౌహాన్, మోహిత్ నందాల్, మోను కు హుడా, హర్ష్ సన్నీ సెహ్రావత్, మోహిత్, హిమాన్షు చౌదరి, ఆశిష్.

# ఐపీఎల్ అంటే బాలీవుడ్, గ్లామర్ కాదు.. అదొక సీరియస్ క్రికెట్

భారత జట్టు మాజీ ఓపెనర్ గౌతం గంభీర్ మరోసారి సంచలన కామెంట్స్‌తో వార్తల్లో నిలిచాడు. 17వ సీజన్‌కు ముందు కోల్‌కతా నైట్ రైడర్స్ మెంటార్‌గా బాధ్యతలు చేపట్టిన గౌతీ.. ఐపీఎల్ అంటే బాలీవుడ్, గ్రామర్ కాదని అన్నాడు. తాజాగా స్టార్ స్పోర్ట్స్‌తో మాట్లాడుతూ.. 'ఐపీఎల్ అనేది సీరియస్ క్రికెట్. ఈ విషయం నేను మొదటి రోజునే చెప్పాను. ఈ లీగ్ అంటే బాలీవుడ్, గ్లామర్ కాదు. ఐపీఎల్ అంటే అత్యంత పోటీ ఉన్న క్రికెట్. అందుకనే ఐపీఎల్ ప్రపంచంలోనే కష్టమైన టీ20 లీగ్‌గా పేరొందింది' అని గంభీర్ వెల్లడించాడు. అంతేకాదు కోల్‌కతా నైట్ రైడర్స్‌కు మంచి ఫ్యాన్ బేస్ ఉందని, ఐపీఎల్ అరంభంలో కోల్‌కతా అద్భుత ప్రదర్శన చేసిందిన గంభీర్ వెల్లడించాడు. కోల్‌కతా జట్టు చిల్లర పనులతో వార్తల్లో నిలవదని, మైదానంలో తమ ఆటతోనే అభిమానుల మనసు



గెలుస్తుందని చెప్పాడు. గంభీర్ సారథ్యంలో కోల్‌కతా 2012, 2014లో చాంపియన్‌గా నిలిచింది.

# గిల్, కోహ్లీ కాదు.. ఈసారి ఆ ప్లేయర్‌కే ఆరెంజ్ క్యాప్..

### జోస్యం చెప్పిన విరాట్ ఫ్రెండ్..

ఇండియన్ ప్రీమియర్ లీగ్(ఐపీఎల్) చరిత్రలో అత్యధిక వికెట్లు తీసిన ఆటగాడిగా టీమిండియా స్పిన్నర్ యుజ్వేంద్ర చాహల్‌కు అరుదైన రికార్డు ఉంది. ఇటీవల ఓ స్పోర్ట్స్ వెబ్‌సైట్‌కి ఇచ్చిన ఇంటర్వ్యూలో అతడు రాబోయే ఐపీఎల్ 2024 అంచనాలపై పలు కీలక వ్యాఖ్యలు చేశాడు. ఈ ఐపీఎల్ సీజన్‌లో ఆరెంజ్ క్యాప్ ఎవరికి సొంతమవుతుందని.. అతడ్ని అడగ్గా.. విరాట్ కోహ్లీ, శుభ్‌మాన్ గిల్ కాదు.. ఈసారి టీమిండియా యువ సంచలనం, రాయల్స్ ఓపెనర్ ఆరెంజ్ క్యాప్ విజేతగా నిలుస్తాడని అన్నాడు చాహల్. గిల్, కోహ్లీలను కాకుండా చాహల్ తన రాజస్థాన్ రాయల్స్ జట్టుకు చెందిన ఇద్దరు ప్లేయర్స్‌ను ఆరెంజ్ క్యాప్‌కు ఎంపిక చేయడం గమనార్హం.

ఐపీఎల్ 2024లో యశస్వి జైస్వాల్ లేదా జోస్ బట్లర్‌లలో ఒకరు ఆరెంజ్ క్యాప్ గెలుస్తారని చాహల్ అంచనా వేస్తున్నాడు. 2022 సీజన్‌లో ఇంగ్లాండ్ వైట్‌బాల్ కెప్టెన్ జోస్ బట్లర్ ఆరెంజ్ క్యాప్ గెలుచుకున్న సంగతి తెలిసిందే. ఆ సంవత్సరం బట్లర్ 17 మ్యాచ్‌ల్లో 863 పరుగులు చేశాడు. అలాగే ఇటీవల కాలంలో జైస్వాల్ రెడ్‌హాట్ ఫామ్‌లో ఉన్నాడు. గత ఐపీఎల్ సీజన్‌లోనూ జైస్వాల్ మెరుపులు మెరిపించాడు. 14 మ్యాచ్‌లలో 624 పరుగులు చేశాడు. ఈ క్రమంలో ఒక్క ఐపీఎల్ సీజన్‌లో అత్యధిక పరుగులు చేసిన అన్‌క్యాప్డ్ బ్యాటర్‌గా రికార్డు సృష్టించాడు.

Editor,Printer, Publisher & Owner by **Reddy Shekar**,3-184, venkatapur, (m) venkatapur, mulugu dist, 506352, Printed at 16-48
**SS Printers,** (m) mulugu, mulugu. RNI NO:- TELTEL 02048/2021, **E Mail : teenmaardesk@gmail.com, Cell : 9177108128**